1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 5
సంచిక : 4
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక


అమ్మనుడి

నుడి నాడు నెనరు

జూన్ 2019



కందుకూరి వీరేశలింగం కాలంలో –
ఇప్పటికి వందేళ్లకు ముందు –
మనలో గూడుకట్టి వున్న సామాజిక
దురాచారాలకంటె ఇప్పటి దుష్ట సంస్కృతి
మరింత భయంకరంగా,
ప్రమాదకరంగా ఉంది.
నాటికీ నేటికీ ప్రధాన బలిపశువులు
స్త్రీలూ, పిల్లలూ.
మొత్తం సమాజాన్నే సవ్యమార్గం
పట్టించడంకోసం ఉద్యమాలు సాగాల్సిన
అక్కర నేడు మరింతగా ఉంది.
ఈ పరిస్థితులలో మనం
నిత్య సమరశీలి వీరేశలింగంగారి
వర్ధంతిని జరుపుకొంటున్నాం.
మరణించి వందేళ్లు గడచినా
మనలను ఇప్పటికీ ముందుకు ఉరికించే
స్ఫూర్తి 'కందుకూరి వీరేశలింగం'



"సొతంత్రకాల సదువులు"
ధారావాహిక
–నంద్యాల నారాయణరెడ్డి

మందుచీటీ (కథానిక)
– సమ్మెట ఉమాదేవి

ఇకపై తెలుగు మాధ్యమంలో చదువులుంటాయా?!
– నూర్‌బాషా రహంతుల్లా

తెలుగు జానపదభాష పరిణామాలు
– పులికొండ సుబ్బాచారి

జాతి మనుగడకే సవాలుగా మారిన ప్రభుత్వాల భాషావిధానం

'అమ్మనుడి' చదువరులకు ప్రత్యేకంగా...

'జోగిని మంజమ్మ' ఆత్మకథ



ఆమె 'మంగళముఖి' !

వారిలో ప్రజాభిమానం పొందింది.

స్త్రీ కాదు–పురుషుడూ కాదు

మగవాడిగా పుట్టి ఆడదిగా మారి నటువంటిది.

అదీ కోరుకున్నది కాదు ఇది తన తప్పుకాదు.

ఈ వాస్తవాన్ని గ్రహించని కుటుంబం శారీరకంగా, మానసికంగా హింసించింది.

ఆ హింస స్వరూపం చెప్పనలవికానిది.

ఆ యాతనను అనుభవిస్తూనే తనలో చెలమలా పొంగుతున్న ఆడతనాన్ని అదిమి పెట్టుకోవడానికి విఫలయత్నం...

ప్రకృతి ముందు కృత్రిమం నిలబడటం సాధ్యమా?

సాధ్యం కానప్పుడు గుండెలో దాచు కుని ఆ బాధను అనుభవించటం.

మరలా కుటుంబం నుంచి హింస.

ఈ రెండింటిని అనుభవించడానికి సాధ్యం కాని సంక్లిష్ట పరిస్థితిలో ఇల్లు వొదిలి బయటి ప్రపంచంలోకి....

అప్పటికి తనకు కేవలం పదినాలుగేళ్ళే!!

మనస్సులో వేధించే స్త్రీత్వాన్ని దేహంలో మోసుకుని ఊరూరు గుడి, గోపురాలు తిరుగుతూ గడిపిన అలమరి బతుకు.

అన్నం, నీళ్లు, బట్టలు లేక, తన వాళ్ళంటూ ఎవరూ లేని ఏకాకిగా కనీవినీ ఎరుగని దుఃఖాన్ని దిగమింగుకుంటూ...

ఆ దుఃఖాన్ని భరించలేక ఆత్మహత్యాయత్నం...

కానీ విధిరాత మరోలా ఉంది.

చావు రాలేదు. విషయం తెలిసి ఇంటి వాళ్ళు ఆస్పత్రిలో చేర్చారు.

చికిత్స పూర్తికాకుండా తనను ఆస్పత్రిలో వదిలేసి వచ్చారు.

ఇదంతా దైవపీడన వల్లనే అని భావించిన ఈ కుటుంబం చివరికి తనకు **జోగమ్మ దీక్ష ఇప్పించింది.**

అందుకు కుటుంబానికి కోటి నమస్కారాలు అర్పించింది.

బతుకు అస్తిత్వం కోసం మళ్ళీ సంచార జీవితం.

అప్పుడు కనిపించింది యల్లమ్మ జోగతి నృత్యం !!

వృద్ధ జోగమ్మ దగ్గర నృత్యంలో తర్ఫీదు.

బతుకు తెరువు కోసం వీధుల్లో, బజార్లో, వండుగ జారతలలో ఒకటి రెండు రూపాయల కోసం ఎనిమిది పదిగంటలు అలసిపోకుండా నృత్యం చేయటం...

తను నేర్చిన ఆ నృత్యానికి సామాజిక గౌరవం తెప్పించాలన్న తపన...

అందుకు రాత్రి పగలూ కష్టపడింది.

తనలా బాధలు, అవమానాలు అనుభవించిన మగజోగమ్మలతో బృందాన్ని ఏర్పాటు చేసింది.

వాళ్ళతో కలిసి శ్రీరేణుక చరిత్ర, మోహిని భస్మాసుర, హేమారెడ్డి మల్లమ్మ, మొదలైన పారంపరిక కథలను ప్రదర్శించింది.

వేలాది జోగమ్మలకు నృత్యం నేర్పించింది.

పడుతున్న శ్రమకు అవకాశాలు వెదుక్కుంటూ వచ్చాయి.

ఎన్నో సంస్థలు, ప్రభుత్వ కార్యక్ర మాలు, నాటక రంగాలు, చలన చిత్రాలు ఆమెను సగౌరంగా ఆహ్వానించాయి. నృత్య కళాకారిణిగా, రంగస్థల నటిగా. సినీ నటిగా తనకు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్విని యోగపరుచుకుంది. వచ్చిన ప్రతీ రూకను జోగమ్మల కోసమే ఖర్చు చేసింది.

ఆమె కృషికి గుర్తింపుగా జానపద అకాడెమీ పురస్కారం, కన్నడ రాజ్యోత్సవం, కళాభూషణ, కిత్తూరు రాణి చెన్నమ్మ పురస్కారం, హెచ్.ఎల్. నాగేగౌడ పురస్కారం అందుకుంది. బెంగళూరు జానపద అకాడెమీ సభ్యురాలైంది.

అయినా ఆమె జోగమ్మలకు సమాజంలో అంటిన కళంకాన్ని, చిన్నచూపును బ్రద్ధలుకొట్టాలనే లక్ష్యం వైపు సాగుతోంది.

అందుకు కొన్ని ప్రణాళికలు రూపొందించింది.

ఆమె శ్రీ 'జోగిని మంజమ్మ'.

ఆమె జీవితంలోని బాధలు, అవమానాలు, దుఃఖం, వైవిధ్యభరితం!



ఆగస్టు సంచిక నుండి నెలనెలా చదవండి

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...

◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...

◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...


తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి

జూన్ 2019



రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

లోపలి పుటలలో....

రేఖాచిత్రాలు: **పావులూరి చిదంబరేశ్వరరావు**

వ్యంగ్యచిత్రాలు: **సరసి**

కంప్యూటరీకరణ : **లంకె జనార్దన్**

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిష్టర్డ్ పోస్టులో, లేదా editorammanudi@gmail. com కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500	--
5 సం॥	:	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥	:	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥	:	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
AMMA NUDI - AXIS BANK, TENALI
అక్కౌంట్ నెం. **915020010550189**
IFSC Code : UTIB0000556
ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంప గలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది
నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు-1.** ఫోన్:7386223538.

హెచ్చరిక

అమ్మభాష తెలుగును కాపాడుకొనే
ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- దయచేసి 3వ పుటలోని 'రచయితలకు సూచనలు' చూడండి

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

సంపాదక హృదయం

జాతి మనుగడకే సవాలుగా మారిన ప్రభుత్వాల భాషావిధానం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. తెలుగుదేశం పార్టీని ఓడించి, వైఎస్ఆర్ సి.పి. అధికారంలోకొచ్చింది. తమ ఎన్నికల వాగ్దాన పత్రాల్లోనే ఈ పార్టీలు రెండూ, ఇకపై బోధనా భాషగా తెలుగు ఉండబోదని, ప్రాథమిక స్థాయినుండీ బోధనాభాషగా ఇంగ్లీష్ ఉంటుందని తెలియజేశాయి. చంద్రబాబుగారి ప్రభుత్వం ఈ విషయంలో కొంత దోబూచులాట ధోరణి వహించినా వైఎస్ఆర్ పార్టీ మాత్రం బోధనా భాషగా ప్రాథమిక స్థాయి నుండీ ఇంగ్లీషే ఉంటుందని స్పష్టమైన ప్రకటన చేసింది. తెలుగును ఒక భాషగా మాత్రం తప్పనిసరి చేస్తామని కూడా స్పష్టం చేసింది. ఈ అంశాన్ని కూడా తమ ఎన్నికల ప్రచారంలో ఒక అంశంగా చేసి వైఎస్ఆర్ పార్టీ వ్యూహాత్మక ప్రచారం చేసింది కూడా.

భాషోద్యమకారుల పట్టుదల వల్ల 1 నుండి 10వ తరగతి వరకూ తెలుగును ఒక భాషగా / సబ్జెక్టుగా తప్పనిసరి చేస్తూ 2003లో జి.ఒ.నెం:86/2.7.2003 వచ్చింది. 1నుంచి 5 తరగతుల వరకు మాతృభాషలో విద్యాబోధనను తప్పనిసరి చెయ్యాలన్న డిమాండును త్రోసిపుచ్చి, అందుకు బదులుగా ఒక సబ్జెక్టుగా మాత్రం 10వ తరగతి వరకూ తప్పనిసరి చెయ్యడానికి ఒప్పుకొని ఆ ఉత్తర్వును జారీ చేసింది నాటి తెలుగుదేశం ప్రభుత్వం. వారి హయంలోనూ, తర్వాతి కాలంలో ఇప్పటివరకూ ఆ జి.ఒ. సరిగ్గా ఎన్నడూ అమలు కాలేదన్నది బహిరంగ రహస్యం. జి.ఒ లోనే ఉన్న కొన్ని లోటుపాట్లు కూడా అందుకు తోడ్పడ్డాయి. పాలకుల్లో రాజకీయ సంకల్పం లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. క్రమంగా ప్రభుత్వ విద్యావ్యవస్థ బలహీనపడుతూ, ప్రయివేటు బోధనా సంస్థలు అన్ని స్థాయిల్లోనూ ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయి, అదంతా ఒక ప్రత్యేక సామ్రాజ్యంగా మారిపోయింది. ఇందుకు ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమం ఉండడమే కారణమని, వాటిని కూడా ఇంగ్లీషులోకి మార్చడమే దీనికి సరైన పరిష్కారం అనే ప్రచారం సాగింది. ప్రజలపై ఇది తీవ్రంగా ప్రభావం చూపింది. ఇంగ్లీష్ మీడియంలో చదివితేనే అది చదువనిపించుకొంటుందనీ, తెలుగు మాధ్యమం వర్థి దండుగ వ్యవహారమనీ తల్లిదండ్రుల్లో అభిప్రాయం బలపడ్డది. మన సమాజంలో వ్రేళ్లూనుకుపోయిన అన్ని రకాల వెనుకబాటుతనానికి ఇంగ్లీషు మాధ్యమంలో బోధనే పరిష్కారమనీ, ఆర్థికంగా ఎదగడానికి ఇదే సరైనదారి అనే నమ్మకం పాదుకుంది.

2003 సంవత్సరం నుండి నేటి వరకూ భాషోద్యమంలో ఇది ప్రధానాంశం అయినా, పరిస్థితి మరింత కఠినం అయిందే తప్ప, ప్రభుత్వాలు మారినా ఈ పరిస్థితిలో మార్పు రాలేదు. 2006లో రాజశేఖరరెడ్డిగారి ప్రభుత్వం 6వ తరగతి నుండి 10 వరకు మునిసిపల్ పాఠశాలల్లో ఇంగ్లీష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. తర్వాత నవ్యాంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుగారి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న విద్యా వ్యాపారవేత్త నారాయణగారు అన్ని పురపాలక పాఠశాలల్లోనూ తెలుగు మాధ్యమాన్ని సమాధి చేశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతూనే ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుగారు ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టారు. 2017 లో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించి, తర్వాత కొద్ది నెలల్లో

తెలుగును ఒక భాషగా బోధించడాన్ని 10వ తరగతి వరకు తప్పనిసరి చేస్తూ, ఒక చట్టాన్ని (10/2008), తర్వాత ఒక సమగ్రమైన జి.ఒ. నెం : 15/1-6-2008 ను విడుదల చేశారు. తెలుగును రక్షించుకోవడానికి ఈ చర్య సరిపోతుందని ఆయన భావించినట్లున్నారు. ఇంటర్మీడియట్లో తెలుగు గురించీ, ఇంకా ఏవో చాలా చాలా చర్యల్ని తెలుగు కోసం చేస్తానని ప్రకటించి, ఆ తర్వాత దాన్నంతా పక్కన పెట్టేశారు.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న జగన్మోహనరెడ్డిగారు బోధనా మాధ్యమం విషయంలో చెయ్యబోయేది దాదాపుగా ఇదేనని మా అంచనా. ఇందువల్ల - పైకొకమాట, అమలులో వేరొక తీరు తొలగిపోయి, పాఠశాల చదువంతా ఇంగ్లీషు మాధ్యమంలోకే పూర్తిగా జారిపోయే విధంగా స్పష్టమైన ఆదేశాలు రానున్నాయని మనం నిస్సందేహంగా అనుకోవచ్చు. తెలుగును ఒక భాషగా మాత్రం 1 నుండి 10 వరకూ బోధించాలనే 2003 నాటి జి.ఒ. బదులుగా మరొక జి.ఒ.ను దానికి బలవర్ధకంగా ఒక చట్టాన్నీ తెచ్చి తమ తెలుగు భాషా పరిరక్షణ విధానం ఇదీ అని స్పష్టంగా కొత్త ముఖ్యమంత్రిగారు ప్రకటించే రోజు దగ్గరలోనే ఉంది.

తెలంగాణలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ తెలుగును ఒక సబ్జెక్టుగా బోధిస్తే చాలు అనీ, తెలుగు మీడియంకు కాలం చెల్లిపోయిందనీ భావించే వారెందరో ఉన్నారు. వీరిలో చాలామందికి ఈ అంశంపై మౌలిక అవగాహన లేదనే చెప్పుకోవాలి. దురదృష్టకరమైన సంగతి ఏమిటంటే తెలుగు సాహిత్యాన్ని వృద్ధి చేసుకొంటే తెలుగును కాపాడుకొంటున్నట్లేననీ, అందుకు 10వ తరగతి వరకూ తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేస్తే చాలదా అని ప్రశ్నించే సామాన్యులే కాదు, ఉపాధ్యాయులు కూడా ఉన్నారు!

ఇప్పటికే పాలనాభాషగా తెలుగు కనుమరుగవుతున్నది. తెలుగును రెండవ స్థాయికి దిగజార్చి, ఇంగ్లీషుకే అన్ని గౌరవాలూ అంటగట్టిన తర్వాత...ముమ్ముందు పరిపాలనలో కూడా తెలుగు కన్పించదు. "ఏం, ఇంగ్లీషు మీకు వచ్చు కదా, ఇక తెలుగుతో పనేమిటి?" అనే రోజులూ వస్తున్నాయి. ఇంగ్లీషుకు అంతర్జాతీయ భాష అనే ముద్రవేసి దాన్ని అందలానికెక్కిస్తున్న సమాజంలో, తరాలకు తరాలూ సొంత భాషకు దూరమవుతుంటే - ఇక ఇది తెలుగు రాష్ట్రంగా ఎలా పిలువబడుతుంది?

'భాషా ప్రేమ ప్రగతికి అడ్డు రాకూడదు', 'బ్రతుకుకూ భవిష్యత్తుకూ ఉపయోగించని భాషను చదువుకోవడం ఎందుకు? - ఇలాంటి ప్రశ్నలు అలవోకగా ప్రచారమవుతున్నాయి. సొంతభాష బ్రతుకుకూ, భవితకూ, ప్రగతికి ఏ మాత్రం అడ్డు కాదు అనీ, సొంతభాషతోనే సరియైన క్రాంతి అనీ ప్రజలకు తెలియజెప్పేదెవరు? కంచే చేనును మేసిందన్నట్లు - ప్రభుత్వాల అకర్మణ్యత వల్ల, స్వార్థపూరిత విధానాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది.

తెలుగుభాషా ప్రేమికులమని అందరూ చెప్పుకొంటుంటారు. అసలు - సొంతభాషను ప్రేమించడం ఏమిటి?! తెలుగు భాష మనది. అది మన ప్రాణం, దాన్ని కాపాడుకోవాలి. భాష నశిస్తే జాతి నశించదా!? జాతి నశించిన తర్వాత మనం ఎవరమని చెప్పుకొంటాం?

ఇప్పటిదాకా భాషోద్యమాలపేరిట జరిగినదంతా సరే. ఇప్పుడున్న పరిస్థితుల్లో అందరమూ మరింత లోతుగా ఆలోచన చెయ్యాలి. ప్రభుత్వాలను ఒప్పించి, తెలుగు మాధ్యమంలో సమాంతర వ్యవస్థను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించేందుకు ఏర్పాటు జరగాలి. అన్ని ఆధునిక అవసరాలకూ వినియోగించే భాషగా తెలుగును పెంపొందించుకోవాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆసక్తిగల వారందరినీ సమావేశపరచి, దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, వ్యూహాత్మకంగా ముందుకు సాగాలి. తెలుగు భాషోద్యమ సమాఖ్యతోపాటు తక్కిన అన్ని సంఘాలూ మేధావులూ కలసి ముందడుగు వెయ్యాలి.

సామల రమేష్‌బాబు

తేదీ : 28-5-2019

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

భారతీయభాషల్లో ఇంటర్నెట్ : కొన్ని గణాంకాలు

ఈ మధ్య ప్రతి ఒక్కరు తమని తాము నిత్య విద్యార్థులమని పిలిపించుకోవటాన్ని ఇష్టపడుతున్నారు. అదొక పోకడగా తయారయింది.

బడికి వెళ్ళే పిల్లలు బడిలో నేర్చుకోలేని సంగీతమో, ఆటపాటలో, నృత్యమో. క్రీడలో, అబాకస్ లాంటి ఉన్నతస్థాయి విషయాలో బడి బయట అదే పనిగా నేర్చుకుంటున్నారు.

ఉద్యోగస్తులు, గృహిణులు, పెద్దవాళ్ళు – తాము విద్యార్థి దశలో నేర్చుకోలేక పోయిన కళనో, ఆటనో, రచనావ్యాసంగమో కొత్తగా నేర్చుకుంటున్నారు.

ఈ విధంగా ఏదోటి అందుబాటులో ఉన్నది నేర్చుకుందాం అనే భావన నిన్నటి కన్నా నేడు అధికమయింది. పుస్తకాలతో అనుబంధాలు ఏదో ఒక విధాన పెరుగుతున్నాయి. ఆహ్లాదం కోసం కథలో, నవలలో, ముద్రిత పుస్తకాలు కొని చదవటం, ఈబుక్స్ రూపంలో కంప్యూటర్లలో, మొబైళ్ళలో చదవటం, ఇంకెవరో చదివి పెట్టినవి వినడం, సినిమాగానో, సీరియల్‌గానో తీస్తే పుస్తకం పక్కన పెట్టుకొని చదువుతూ ఆ సినిమానో, సీరియలో చూస్తూ ఆస్వాదించడం. ఇలా పుస్తకం రకరకాల అవతారాలతో నేడు మెప్పిస్తోంది.

ఇక ఏదైనా నేర్చుకోవాలంటే, అది మన మాతృభాష వాహికగా నేర్చుకోవటం సులువని ఎన్నో పరిశోధనలు తేల్చాయి. bit.ly/2JHqk1o లింకులో ఉన్న యునెస్కో వారి "మదర్ టంగ్ మ్యాటర్స్: లోకల్ లాంగ్వేజ్ ఏజ్ ఎ కీ టు ఎఫెక్టివ్ లర్నింగ్ (మాతృభాషలు అక్కరకు వస్తాయి : ప్రభావవంతంగా నేర్చుకునేందుకు ప్రాంతీయ భాషలే ముఖ్యం)" పత్రంలో తెలిపిన విధంగా మాతృభాషలో అభ్యసించిన విషయం త్వరగా అర్థమవుతుంది, సులువుగా గుర్తుంటుంది, తిరిగి ఇంకొకరికి నేర్పాలన్నా, ఒప్పచెప్పాలన్నా, నేర్చుకున్నది ఆచరణలో పెట్టాలన్నా మాతృభాషలో నేర్చుకున్నదే ఎక్కువ గాఢంగా మన బుద్ధికెక్కుతుందని తెలుస్తోంది.

కానీ నేర్చుకునేందుకు అందుబాటులో ఉన్న అంశాలు దాదాపుగా ఇంగ్లిష్ లోనే ఉన్నాయి.


ఇది ఇబ్బంది పెట్టే విషయమో, ఆందోళన చెందాల్సిన విషయమో కాదు.

ఎందుకంటే తెలుగులో సమాచారాన్ని రూపొందిస్తే అందుకు తగ్గ మార్కెట్ ఉందన్న విషయాన్ని కాస్త ఆలస్యంగా వాణిజ్య వ్యాపార సంస్థలు, విషయ సమాచార రచయితలు తెలుసుకున్నారు.

అమెజాన్ ప్రైమ్ లో తెలుగు భాషా సినిమాలు/సీరియళ్ళు మాత్రమే కాదు, ప్రాచుర్యమున్న ఇతర భాషా దృశ్యకాలకు తెలుగు ఉపశీర్షికలు అందుబాటులో ఉన్నాయి. యూట్యూబ్ తెరిచి చూస్తే వంటలు చేసి చూపించే వీడియోలు, సినిమా సమీక్షల వీడియోలు, యాత్రాస్థలాల వివరణ, వ్యాపార మెళకువలు ఇలా చాలా అంశాల మీద తెలుగులో సమాచారం విపరీతంగా వస్తోంది. ఐదేళ్ళ క్రితమే రోజుకు కనీసం ఇరవై షార్ట్‌ఫిల్మ్‌లు యూట్యూబ్ వేదికగా విడుదలయ్యాయి. ఇప్పుడీ సంఖ్య వందల్లో ఉంది.

కానీ ఇప్పుడున్న సమాచారానికి వేల రెట్లు ఎక్కువ సమాచారం అందుబాటులోకి రావాలి.

ముఖ్యంగా ఎవరైనా నేర్చుకోవడానికి అనువుగా ఒక



పాఠ్యాంశానికి/బోధనాంశానికి తగ్గట్టుగా తయారవ్వాలి.

ఇందుకు కావాల్సిన సాంకేతికత అందుబాటులో ఉన్నా, తెలుగులో ఇంకా మొదలవ్వలేదు.


ఇది ఒక గొప్ప అవకాశం. తెలుగు వార్తాసంస్థలు ప్రస్తుతం ఈ ఖాళీలో ఇమడాలని చూస్తున్నాయి కానీ వారికది తలకు మించిన పని అవటం వలన నాణ్యమైన సమాచారం తయారవ్వటం లేదు.

“ఈ సందర్భంలో ఇలా మాట్లాడాలి, ఇలా ప్రవర్తించాలి, ఇలా మాట్లాడకూడదు, ప్రవర్తించరాదు” అని బోధ చేసే విషయాలు కానీ, సైకిల్. స్కూటర్, కార్. బట్టలుతికే మషీను లాంటి ఉపకరణాలను శుభ్రం చేసుకునే విషయాలను చెప్పే వీడియోలు లేదా కోర్సులు గానీ, వంటలను నేర్పే మార్గదర్శక వీడియోలూ కానీ, ఇలా రోజువారీ ప్రతి మనిషికి అవసరమయ్యే విషయాలపై తయారు చేసే సమాచారానికి మన దేశంలో కోట్లలో వీక్షకులున్నారు.

గూగుల్–కెపిఎంజి నివేదిక ప్రకారం మన దేశంలో 23 కోట్ల జనాభా భారతీయ భాషల్లో ఇంటర్నెట్ ను వాడుతోంది. ఆంగ్లంలో ఈ సంఖ్య 17.5 కోట్లు మాత్రమే. 2021 నాటికి 75 శాతం భారత ఇంటర్నెట్ వాడుకరులు తమ మాతృభాషల్లోనే ఇంటర్నెట్ వాడతారని అంచనా. ఆ రాబోయే జనాభాకు తగిన సమాచారాన్ని రూపొందించుకున్న సంస్థలు, వ్యక్తులు, మాత్రమే భవిష్యత్తు లో నిలదొక్కుకోగలరు.

ప్రతి ఒక్కరికీ, చవకగా, సులువుగా ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం, మన ప్రమేయం లేకుండానే బ్యాంకింగ్ వ్యవస్థ, ప్రభుత్వ యంత్రాంగంతో మనం చేసే సంభాషణలు ఇంటర్నెట్ వాహికగా జరగటం వలన మనకు తెలీకుండానే మనం ఇంటర్నెట్ వాడుకరులము అయిపోయాం. ఆ విధంగా ఇంగ్లిష్ లో మాత్రమే అందుబాటులో ఉన్న సేవలు భారతీయ భాషలకు మారటం అనివార్యమయింది. 68 శాతం భారతీ యులు ఆంగ్లంలో కన్నా తమ సొంత భాషల్లో ఉన్న సమాచారాన్నే వినియోగిస్తున్నారు.

సరిగ్గా ఇక్కడే నేను చెప్పదలచిన విషయాన్ని ప్రస్తావిం చాలి. ఇంత ఎక్కువ స్థాయిలో భారతీయ భాషల్లో నాణ్యమైన సమాచారానికి మార్కెట్లో డిమాండ్ ఉన్నప్పటికీ, ఆ డిమాండ్ కి సరిపోయే సమాచారం అందుబాటులో లేదు. పేమెంట్ గేట్‌వేలు కావచ్చు, సమాచార పత్రికలు కావాచ్చు, చాటింగ్ చేసే అనువర్తనాలు కావచ్చు. వీటికి చాలా ఎక్కువ డిమాండ్ ఉంది.



60% భారతీయుల ప్రకారం మన భాషల్లో ఆయా సేవలు లేకపోవడం వలన సింహభాగం వాడుకరులు ఆ సేవ లను వాడేందుకు ముందుకు రావటం లేదు. పైన చెప్పిన గూగుల్ – కెపిఎంజి నివేదిక కోసం జరిపిన సర్వేలో 88% మంది భారతీయులకు ఆంగ్ల వాణిజ్య ప్రకటనల కన్నా భారతీయ భాషల వాణిజ్య ప్రకటనలు ఎక్కువగా ఆకర్షించా యట.

రాబోయే 5 ఏళ్ళలో ఇంటర్నెట్ వాడుకరులుగా రాబోయే వారిలో 90 శాతం భారాతీయ భాషలవారే ఉంటారని అంచనా.

దీనికి తోడు భారత ప్రభుత్వం డిజిటల్ లిటరసీ పేరుతో 2021 నాటికి కనీసం 60 వేల గ్రామీణ కుటుంబాలు పూర్తి స్థాయిలో ఇంటర్నెట్ వాడే దిశగా ప్రాణాళికలు రూపొందించింది. ఆహ్లాదం కోసం, వార్తల కోసం, ఆన్‌లైన్‌లో షాపింగ్, బ్యాంకింగ్ సేవలు, ఇలా అన్ని రంగాలలో భారతీయ భాషల్లో వాడకం బీభత్సంగా పెరిగిపోయింది. మరింత ఎక్కువగా రాబోయే రోజుల్లో పెరగనుంది. ఇలాంటి సందర్భంలో భారతీయ భాషల్లో, మన సందర్భంలో తెలుగులో విషయ సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చే వ్యక్తులకు చేకూరే లాభం చాలా ఎక్కువ. ఆయా రంగాలలో ఇప్పటికే విజయాన్ని సాధించిన సంస్థలకు భారతీయ భాషల్లో నాఆణ్యమైన విషయ సమాచారం అందించే ఉద్యోగుల అవసరం రానుంది.

నూర్‌బాషా రహంతుల్లా
6301493266

ఇకపై తెలుగు మాధ్యమంలో చదువులుంటాయా?

తెలుగు మాధ్యమంలో చదువుకు, ఉపాధికి ఏ పార్టీ అయినా హామీ ఇచ్చిందా? తెలుగుదేశం, వైసిపి పార్టీలు రెండూ కూడా ప్రాథమిక విద్యను ఇంగ్లీషు మీడియానికి మార్చుతామని, తెలుగును ఒక సబ్జెక్టుగా మాత్రమే ఉంచుతామని తమ మ్యానిఫెస్టోలలో ప్రకటించాయి. కానీ ప్రాథమిక విద్యను తెలుగు మాధ్యమంలో ఉంచి ఇంగ్లీషును ఒక సబ్జెక్టుగా మాత్రమే నేర్పాలని తెలుగు భాషాభిమానులు కోరుతున్నారు. మన రాష్ట్రంలో పోయిన సంవత్సరం 9వేల ప్రాథమిక పాఠశాలల్ని ఇంగ్లీష్ మీడియంలోకి మార్చారు. ఈ సంవత్సరం మిగిలిన 40వేల పైచిలుకు ప్రాథమిక పాఠశాలల్ని ఆంగ్లమీడియంలోకి మార్చబోతున్నారు. ఇకమీదట అన్నీ ఆంగ్లమాధ్యమ పాఠశాలలే ఉంటాయి. ఎందుకంటే విద్యార్థుల తల్లిదండ్రులు ఆంగ్ల మాధ్యమంపై మక్కువ చూపుతున్నారట. ఈ ఒక్క కారణం చూపుతూ ఇప్పటిదాకా కొనసాగిన తెలుగు మాధ్యమాన్ని మూల దశలోనే లేకుండా తీసిపారేస్తున్నారు. బ్రతుకుతెరువుకు పనికివచ్చే వృత్తి విషయాలను తెలుగులో బోధించకుండా కవిత్వాలు పద్యాలు కథలు ఉండే తెలుగును ఒక సబ్జెక్టుగా మాత్రమే బోధిస్తారట. విద్యార్థులకు అటు తమ భాషను రానివ్వకుండా, ఇటు స్వేచ్ఛగా అనుమానాలు నివృత్తి చేసుకోనివ్వకుండా ఇదేమి చదువు ? ఇది పిల్లల మాతృభాషను మార్చటం కాదా ? మరో భాషలోకి వలస తీసికెళ్ళటం కాదా?

సివిల్స్‌లో సత్తాచాటిన తెలుగు తేజాలకు సన్మానం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఆదేశించారు. ఇది మంచి సంప్రదాయమే. కానీ తెలుగులోనే డిగ్రీ దాకా చదివి, తెలుగు మాధ్యమం లోనే సివిల్స్ పాసైన అభ్యర్థులకు ఘనసన్మానం చెయ్యాలి. తెలుగు మాధ్యమం ద్వారా పరీక్షల్లో నెగ్గే పద్ధతుల్లో నైపుణ్యశిక్షణ ఇప్పించాలి. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ప్రోత్సాహకాలు, రిజర్వేషన్లు ఇవ్వాలి.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా ఇంకా దేశభాషలకు స్వాతంత్ర్యం రాలేదు. మాతృభాషలో విద్య ఉంటే, స్వరాజ్యం ఎప్పుడో వచ్చేది అన్నారట గాంధీజీ. భాషా చాతుర్యం ఉంటే ఎంతటి క్లిష్టమైన వ్యవహారాలనైనా అవలీలగా పరిష్కరించుకోవచ్చు. చెప్పాలనుకున్న విషయాలు సాఫీగా చెబుతూ నదీ ప్రవాహంలా ముందుకు సాగేది మాతృభాషే. ప్రపంచ భాషలను శాసిస్తున్న ఆంగ్లం కూడా ఎన్నెన్నో పరభాషా పదాలను తనలోఇముడ్చుకొని నేడీ రూపం తీసుకొంది. ఇంగ్లీషు ఎప్పటికప్పుడు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఇముడ్చు కోవటమేకాక విశ్వవ్యాప్తంగా విద్యాలయాలను సమకూర్చుకొని విద్యార్థులకు నేర్పుతూ ప్రపంచ భాషగా ఎదిగింది. నాలుగు మాటలు ఇంగ్లీషు కలవకుండా తెలుగులో మాట్లాడుతున్న పరిస్థితి నేడు మనకు లేదు.

మన పిల్లలు పై స్థాయిలోకి వెళ్లడానికి, బాగా చదవడానికి ఇంగ్లీషు మీడియం చదువులే మంచివన్న అభిప్రాయానికి తల్లిదండ్రులు, ప్రభుత్వాలు వచ్చేశాయి. ఇక్కడి భాషతో ఇక్కడే బతకవచ్చన్న భరోసా ఎప్పుడు ఏర్పడుతుంది? మాతృభాష బువ్వ పెడుతుందన్న నమ్మకం ఎలా కుదురుతుంది?

ఇంట్లో తెలుగు – బడిలో ఇంగ్లీషు

మనిషి మాతృభాషలో ఆలోచిస్తాడు. మన ఊహకూ, కాల్పనిక శక్తికీ, నూతన సృజనకూ మూలం మాతృభాషే. మాతృభాషగా తెలుగు మన ఇళ్ళల్లో ఇంకా బ్రతికే ఉంది. "ఇంట్లో తెలుగు-బడిలో ఇంగ్లీషు" లా ఉంది మన జీవితం. మన పిల్లలకు నేర్పే చదువు కూడా తెలుగు మాధ్యమంలోనే ఉండాలని కొందరు అడుగుతున్నారు.

మాతృభాషను విస్మరించి పరభాషకు పట్టం ఎందుకు కడుతున్నారు అంటే ఉద్యోగాలు పరభాష లోనే దొరుకుతున్నాయి కాబట్టి. మన పిల్లలకు మాతృభాషలో కనీసం ప్రాథమిక విద్య లేకపోవడంవల్ల పిల్లల్లో సృజన పోయింది. అందుకే చాలామంది ఇంగ్లీషు మీడియంలో చదివిన యువకులు, నాయకుల పిల్లలు తెలుగులో తప్పులు మాట్లాడుతున్నారు. మన దేశంలో నేడు 60 శాతం విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో చదువుకుంటున్నారు. ఎన్నో ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలు ఆంగ్లంలోకి మారాయి.ప్రజలు కూడా ఈ మార్పును కోరుకుంటున్నారు. ఎందుకంటే తెలుగు మాధ్య మానికి ఎటువంటి ప్రోత్సాహకాలు లేవు. ఆంగ్లమాధ్యమం వల్ల కొందరు విద్యార్థులకు విదేశాలల్లో ఉద్యోగాలు దొరకవచ్చేమో కానీ, రాష్ట్రప్రజల భాషా సాహిత్యాల భవిష్యత్తును అది నాశనం చేస్తుంది. విద్యార్థులు కూడా పరభాషా మాధ్యమం వలన తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.న్యాయం, వైద్యం, ఇంజనీరింగ్, భౌతిక రసాయన శాస్త్రాలన్నీ తెలుగులో నేర్పగలగాలంటే మాతృభాషలోనే ఆ సాంకేతిక సమాచారమంతా లభించేలా పదసంపద ఎప్పటికప్పుడు పెరగాలి. ఇందుకుగాను తేలికగా అర్థమయ్యే ఇంగ్లీషు పదాలను కూడా తెలుగు

పుస్తకాలలోకి తీసుకోవాలి.

ప్రోత్సాహకాలతోనే తెలుగు వృద్ధి

తెలుగు మాధ్యమంలో చదివి ప్రభుత్వ ఉద్యోగాలకోసం తెలుగులో పరీక్షలు రాసేవారికి 5 శాతం మార్కులను అదనంగా కలిపినా, తెలుగు మాధ్యమంలో డిగ్రీ వరకు చదివిన పిల్లలకు మొత్తం ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్ కల్పించినా తెలుగు భాషకు గొప్ప మేలు జరుగుతుంది. నానాటికి నీరసించి పోతున్న భాషకు బలవర్ధక ఔషధాలు ఇవ్వాలి కానీ అసలు ప్రోత్సాహకాలేమీ ఇవ్వకూడదు అని కొందరు తెలుగు వాళ్ళే వాదిస్తుండటం విచిత్రంగా ఉంది. బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇచ్చి ఎక్కదీసుకొచ్చినట్లే మన మాతృభాషలకు కూడా ప్రోత్సాహకాలిచ్చి బలపరచాలి, బ్రతికించాలి. డబ్బురాని విద్య దరిద్రానికే అంటారు. ఏ ఉద్యోగమూ రాక ఎందుకూ పనికిరాక పోయేటట్లయితే తెలుగులో ఎవరు చదువుతారు? ఎందుకు చదువుతారు? తెలుగు చదవడాన్ని పెంచాలంటే ప్రోత్సాహకాలు కూడా ఉండాల్సిందే.

1985 పరీక్షల వరకూ తెలుగు మీడియం అభ్యర్థులకు ఇచ్చిన 5 శాతం ప్రోత్సాహక మార్కుల పునరుద్ధరణకోసం ప్రభుత్వం అసలు కోర్టులో ప్రయత్నమే చేయలేదు. ప్రోత్సాహక మార్కుల కేసులో దీటుగా ఎదుర్కొని వాదించగల తెలుగు న్యాయవాదిని నియమించి మార్కుల పునరుద్ధరణ జరపాలి. ప్రజల భాషకు వ్యతిరేకంగా తమిళనాడులో ఎవరైనా న్యాయస్థానాలకు వెళితే ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకొంటున్నట్లుగా మన ప్రభుత్వం కూడా తీవ్రంగా తీసుకోవాలి. విషయం కోర్టులో ఉందన్న సాకుతో తెలుగు విద్యార్థులకు ప్రోత్సాహకాలు ప్రకటించటాన్ని మరచిపోకూడదు. 5 శాతం అదనపు మార్కులను ఇవ్వడం వల్ల ఎంతో ఉపయోగం ఉంది.

తెలుగు మాధ్యమం వారికన్నా ఇతర మాధ్యమాల వారు ఉద్యోగాలకు జరిగే పరీక్షల్లో చాలా ఎక్కువ మార్కులు ఎందుకు తెచ్చుకొంటున్నారు? పిల్లల చదువు మీద శ్రద్ధ పెట్టే కుటుంబాలు తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమానికే ఎందుకు పంపుతున్నాయి? ఆంగ్ల మాధ్యమ పంతుళ్ళ స్థాయిలో తెలుగు మాధ్యమ పంతుళ్ళకు కూడా జీతాలు ఇవ్వగలిగితే తెలుగు విజ్ఞానులు తెలుగునేలపైనే నిలబడతారు. తెలుగులో పోటీ పరీక్షల పుస్తకాలు వెల్లువెత్తుతాయి. తెలుగులో చదివితే కొన్ని ప్రోత్సాహకాలు కూడా ఉన్నాయనే ధీమా ప్రభుత్వం కల్పించక తప్పదు. ప్రజలు ఏ పనికైనా ప్రయోజనం ఆశిస్తారు. ప్రజల పక్షాన ప్రభుత్వం ఉంటే ప్రజలూ ప్రభుత్వాన్ని నిలుపుకుంటారు. మనిషి ఆశాజీవి. ఎక్కడ లాభం ఉంటే అక్కడికి చేరతాడు. తెలుగు విద్యార్థుల్ని కాపాడుకోవటం ద్వారానే తెలుగును రక్షించుకోగలం. ఈ మర్మాన్ని గ్రహించే తమిళనాడు ప్రభుత్వం 20 శాతం రిజర్వేషన్లు తమిళ విద్యార్థులకు కల్పించింది. అక్కడ ఎలా సాధ్యమయ్యిందో కనుక్కొని అదే పద్ధతి ఇక్కడ మనమూ అనుసరించాలి. అప్పుడు ఆంగ్ల మాధ్యమం వాళ్ళు కూడా తెలుగు మాధ్యమంలో చదవడానికి తరలివస్తారు. తమిళనాడులో నివసించే విద్యార్థులు తమిళంలో చదవక తప్పదు అని దివంగత ముఖ్యమంత్రి జయలలిత హోసూరు ఎమ్మెల్యే గోపీనాథ్‌కు అసెంబ్లీలో తెగేసి చెప్పారు. అక్కడ రాని పెను ప్రమాదం ఇక్కడ ఎందుకు వస్తుంది? భాష విషయంలో తమిళనాడునే మనం ఆదర్శంగా తీసుకోవాలి. ఎందుకంటే ఆ రాష్ట్రం తమిళాన్ని అభివృద్ధి చేసుకోటానికి ఎన్ని మార్గాలున్నాయో అన్ని మార్గాలూ అన్వేషించి సఫలమయ్యింది. అందువలన పై ప్రతిపాదనలకు తోడు ఉద్యోగ నియామక పరీక్షలలో తెలుగును ఒక కంపల్సరీ సబ్జెక్టుగా పెట్టాలి. ఈ నియమం వల్ల అభ్యర్థులు తెలుగు మాధ్యమంలో చదివి తెలుగు బాగా నేర్చుకొని పాస్ కాక తప్పదు. ప్రభుత్వ ఉద్యోగాలకు తెలుగు తప్పనిసరి కావాలి.

ప్రభుత్వోద్యోగులు ప్రజల దగ్గరకు వెళ్ళాలి, వారి సమస్యలు వినాలి, వారికి అర్థమయ్యేట్లు పరిష్కార మార్గాల గురించి వారి భాషలోనే చెప్పాలి. కాబట్టి వారికి తెలుగులో పరిజ్ఞానం ఉండాల్సిందే. ఇంట గెలిచి రచ్చ గెలవాలి రాష్ట్రంలో ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే జరగాలి. అన్ని ప్రభుత్వ ఉత్తర్వుల జారీకి తెలుగు భాషనే ఉపయోగించాలి. ఆంగ్లం వాడకూడదు. కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు, రాష్ట్రం వెలుపల ఉన్న చిరునామాదారులతో మాత్రమే ఆంగ్లం ఉపయోగించాలి. అన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్న అన్ని సంస్థలు, అన్ని స్థానిక సంస్థలు తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలి. అన్ని శాసనేతర అవసరాలకు ప్రజలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలకూ తెలుగు భాషనే ఉపయోగించాలి. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఉత్తర్వులు, నియమాలు, నిబంధనలు, ఉపవిధులు అన్నీ కూడా తెలుగు భాషలోనే ఉండాలి. రాష్ట్రంలోని అన్ని దుకాణాలు, సముదాయాల బోర్డులు ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ నామఫలకాలు, శంకుస్థాపన శిలాఫలకాలు తెలుగులోనే రాయించాలి. తెలుగు మన ప్రజల భాష. ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు కూడా ఆరు నెలల్లో తెలుగు నేర్చుకోవాలి. తెలుగులో సంతకంపెట్టాలి. తెలుగులో నోట్స్ రాయాలి. తెలుగుపిల్లలు తెలుగులోనే ఎందుకు వెనుకబడి ఉండాలి? మాతృభాషలో వెనుకబడేవాళ్ళు అన్ని భాషల్లోనూ వెనుకబడే ఉంటారు. ఇంటగెలిచి రచ్చ గెలవాలి. మాతృభాషకు ఇచ్చే ప్రోత్సాహకాల పైన ఇక ఎవరు న్యాయస్థానాలకు వెళ్ళకుండా చట్టంలోనే నియమం పెట్టాలి.

తెలుగు మాధ్యమ అభ్యర్థులకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు

డిగ్రీ తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్ ఇస్తామని ఆనాటి మంత్రులు పల్లె రఘునాధరెడ్డి, భూమా అఖిలప్రియ వాగ్దానం చేశారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం కేజీ టూ పీజీ ఉచిత విద్య ఇంగ్లీషు మీడియంలోనే ప్రవేశపెడతామన్నారు. ఇంగ్లీషు మీడియం లేకపోవటం వల్లనే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోతున్నాయనీ, విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నదనీ ఉభయ రాష్ట్రాల్లో చర్చ నడుస్తున్నది. మునిసిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం రద్దుచేస్తూ; ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. మరోవైపు రాష్ట్ర మంత్రి నారాయణ; తెలుగు మాధ్యమంలో చదువుకుంటే ఉద్యోగాలు రావని, ఇంగ్లీషు మాధ్యమం

తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి

లోనే ఉద్యోగాలొస్తాయని, మున్సిపల్ పాఠశాలలన్నింటిలో తెలుగు మాధ్యమం తీసేసి ఇంగ్లీషు మాధ్యమం ప్రవేశ పెడతామని ప్రకటించారు. ఎవరిమాటలు నమ్మాలి? ప్రాథమిక స్థాయిలోనే మాతృభాషను నేర్చుకొనే అవకాశం కోల్పోయి మరోసారి స్వాతంత్ర్యాన్ని కోల్పోయాము. గత్యంతరంలేక పరాయిభాషలోకి తప్పనిసరై కావాలనే మన పిల్లల్ని నెడుతున్నాము. తెలుగులోనే పరీక్షలు రాసి, ఆ భాషలోనే ముఖాముఖిలో పాల్గొని, కేంద్రప్రభుత్వ అధికారులుగా ఎంపికైనవారు ఎంతమంది లేరు ? అలా మాతృభాష ద్వారా ఉద్యోగాలను సాధించే స్థాయికి మన పిల్లలను తీసుకెళ్ళాలని మన నాయకులు కూడా కోరుకోవాలి కదా?

సర్వీస్ కమీషన్ ఉద్యోగాలలో తెలుగు మాధ్యమం ద్వారా డిగ్రీలు చేసిన వారికి ఎన్ని దక్కుతాయి ? ప్రజల భాషకు పరిపాలనలో పట్టం కడతామనే నాయకుల వాగ్దానాలు రెండు రాష్ట్రాల్లోనూ వినబడుతున్నాయి. తెలుగును ఉపాధి వనరుగా మార్చాలని అందరూ కోరుతున్నారు. కొందరైతే ప్రజల భాష పదికాలాలపాటు పాలించాలని తపిస్తున్నారు కూడా. తెలుగు విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు పొందేలా చెయ్యాలి మన; ప్రజా సేవ (పబ్లిక్ సర్వీస్) కమీషన్లు. 1985 వరకు పబ్లిక్ సర్వీస్ కమీషన్ పోటీ పరీక్షల్లో తెలుగు మీడియం డిగ్రీ విద్యార్థులకు ఇచ్చిన 5 శాతం ప్రోత్సాహక మార్కులు హైకోర్టు తీర్పుతో ఆగిపోయాయి.ప్రభుత్వం హై కోర్టులో అప్పీల్ చేసి మార్కుల పునరుద్ధరణకు ప్రయత్నించాలి. గ్రూప్ 1, గ్రూప్ 2 సర్వీసు ఉద్యోగాలలో డిగ్రీ తెలుగు మీడియంలో చదివిన వారికి గతంలో ఇచ్చిన మాదిరే 5% ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలి. తెలుగులో కార్యాలయ వ్యవహారాలు నడిపే అభ్యర్థులకు దారి ఇవ్వాలి. ఆఫీసుల్లో తెలుగు బ్రతకాలి. తెలుగు మీడియంలో చదివితే ఉద్యోగాలు రావాలి. మన పిల్లలు తెలుగులో చదవాలి. తెలుగు అధికారులు తెలుగులో కార్యాలయాలు నడపాలి. తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థుల్ని ప్రోత్సహించి అధికారులుగా చేయాలి. అప్పుడు జనం తండోప తండాలుగా తెలుగులో చదువుతారు. తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు సర్వీసుకమీషను పరీక్షల్లో రిజర్వేషన్లు, ప్రోత్సాహక మార్కులు తిరిగి ఇప్పించటానికి కృషి చేస్తామని 2012 ప్రపంచ తెలుగు మహాసభల్లో ఇచ్చిన హామీపై జీవోలు ఇవ్వాలి.

తెలుగు భాషలో సాధికారత ఏదీ?

ఎవరి భాషలో వారికి విద్యను బోధిస్తేనే ప్రయోజనమన్నారు గిడుగు రామమూర్తి. బడి పలుకుల భాష కంటే పలుకుబడుల భాషే అవసరమని కాళోజీ చెప్పారు. అసలైన పురోగతి మాతృభాషతోనే సాధ్యమని గాంధీజీ వాదించారు. అమ్మభాషలో బోధన విద్యార్థి సృజనను ఎంతో పెంచుతుందని విశ్వకవి రవీంద్రుడు భావించాడు. ఇవేవీ పట్టించుకోకుండా ఇంగ్లీషులో మాత్రమే నేర్పుతున్న చదువు పిల్లలకు భారంగా మారింది. కళాశాల విద్య అర్థం కావటం లేదు. పనిమీద ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేవారికి అక్కడ ఏమి జరుగుతుందో తెలియటం లేదు. న్యాయస్థానాల్లో ఎవరు ఏం మాట్లాడుతున్నారో, అక్కడ జరుగుతున్న ప్రక్రియ కక్షిదారులకు అంతుపట్టడం లేదు. ఇటు సొంత తెలుగు భాష చెల్లక, అటు పరాయి కోర్టు భాష సొంతం తెలియక, ఎంతకీ అవగతం కాక అవస్థ పడుతున్నారు. సొంత భాషలో చెప్పుకోలేను, పరభాషలో నవ్వలేను, ఏడ్వలేను అన్నట్లు మారింది పరిస్థితి. అర్థమైనా కాకపోయినా ప్రతి విషయం ఇంగ్లీషులోనే చెప్పుకోవాల్సి వస్తోంది. మాతృభాషలో స్వేచ్ఛగా మాట్లాడే భాగ్యాన్ని పోగొట్టుకున్నాం. సొంత మాటలను, పదసంపదను పోగొట్టుకొని మూగవాళ్ళలాగా బ్రతుకుతున్నాం. భాషా దారిద్ర్యం, భావ దారిద్ర్యం రెండూ మన ప్రజల్ని బాధించేలా మన పాలన, విద్యా, న్యాయ రంగాలను తయారు చేశారు.

భాషా ప్రయోజనాల్ని అందరి దరికీ చేర్చే బాధ్యత ప్రభుత్వానిది. తెలుగునాట తెలుగు భాషాబోధనను నిర్బంధం చేయాలి. ప్రాథమిక దశ నుంచి ఉన్నత పాఠశాల చదువు ముగిసే పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలోనే బోధించాలి. పాఠ్యపుస్తకాల్ని పిల్లలందరికీ బాగా అర్థమయ్యేలా రూపొందించాలి. కన్నడ భాషాబోధనను అక్కడి ప్రభుత్వం ఉన్నత పాఠశాలదాకా నిర్బంధం చేసింది. కర్ణాటకలో పనిచేసేవారికి ఆ భాష తప్పనిసరిగా తెలిసి ఉండాలని తేల్చిచెప్పింది. తమిళనాడులో మాతృభాషలో చదివితేనే అక్కడ ఉద్యోగాలిస్తారు, మలయాళ భాష, సంస్కృతిని పదిలపరచుకొనేందుకు అక్కడ ప్రత్యేకంగా ప్రాధికార సంస్థ ఏర్పాటైంది. ఒడిశా, గుజరాత్, పశ్చిమ్ బంగ, మహారాష్ట్రల్లోనూ చదువుల్లో, ఉద్యోగాల్లో అక్కడి మాతృభాషలకే పెద్దపీట వేస్తున్నారు.

ఆంగ్లంలోని గ్రంథాల్ని ఇజ్రాయెల్ తన భాషలోకి కొద్దికాలంలోనే తర్జుమా చేసుకొంది. అత్యాధునిక పరిజ్ఞానానికి సంబంధించిన ఏ పదమైనా వెంటనే స్వీడన్ భాషలోకి అనువాదమవుతోంది ఉన్నత న్యాయ స్థానాలలో తెలుగు కనీసం ప్రవేశిస్తుందా? మన పాఠాల్లో ఉన్న 'తెలుగు' ఎంత? ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో తెలుగు మాయమవుతోంది! 'మార్కులకు పనికిరాని' సబ్జెక్టుగా మిగిలిపోతోంది. తమిళనాడులో సెంట్రల్ సిలబస్‌లోనూ తొమ్మిదవ తరగతి వరకు తమిళం తప్పనిసరిగా బోధించాల్సిందే. తెలంగాణలో పాఠశాల నుంచి జూనియర్ కళాశాల వరకు ఒక బోధనాంశంగా తెలుగు ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. తెలుగును బోధించే విద్యాలయాలకు మాత్రమే తెలంగాణలో అనుమతి దక్కుతుందన్నాడు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నామఫలకాలపై తెలుగు విధిగా కనిపించాలన్నాడు.

ఆంధ్రప్రదేశ్‌లో ఏమిటి పరిస్థితి?

హైకోర్టులో తెలుగు వాదన పనికిరాదు పొమ్మన్నాడో ప్రభుత్వ న్యాయవాది. 1952 లో తెలుగు భాష పేరుతో మన రాష్ట్రం ఏర్పడింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలలో మనదే మొదటి రాష్ట్రం. భాషాప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు ఉద్దేశం ఏమిటి? తెలుగు రాష్ట్రాన్ని తెలుగులోనే పరిపాలించటం. గత 66 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో తెలుగు పాలన సిద్ధించిందా? ఏమి ఆశించి భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేశారో ఆ ఉద్దేశాలు ఈనాటికీ నెరవేరకపోగా భవిష్యత్తులో కూడా ప్రజల భాషలో పాలన నడుస్తుందనే ఆశలుకూడా వదులు

సంస్కృతాన్ని అడ్డుపెట్టి తెలుగు కాంతినాపలేరు

కోవాలనే హెచ్చరికలు వస్తున్నాయి. అసలు పాలించటానికి మీ భాష బ్రతికి ఉంటుందా అనే సవాళ్ళు నిత్యమూ ఎదురవుతున్నాయి. తెలుగు జనమే ఇంగ్లీషు కాన్వెంట్లకు ఎగబడుతుంటే తెలుగు బడులు నిలుస్తాయా తెలుగులో ఫైళ్ళు నడుస్తాయా అని పరిహాసాలు ఆడు తున్నారు. తెలుగు జాతి మనది– నిండుగ వెలుగు జాతి అనే పాటను తెలుగు జాతి మనది– రెండుగ వెలుగు జాతి అని పాడుకుంటున్నారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు, దిగువ కోర్టుల్లో న్యాయపాలన అంతా మాతృభాషలోనే సాగేందుకు వీలుగా రెండు హైకోర్టులూ సాయపడాలని వేడుకుంటున్నారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అన్నట్లు అన్ని కోర్టుల్లో కూడా ఆంగ్లానికే ఆదరణ దొరుకుతోంది. ఎన్నో అవాంతరాలున్నా తెలుగులో తీర్పులు ఇచ్చి కొందరు న్యాయమూర్తులు సాహసోపేతమైన శ్రమ చేశారు.

మాయమాటలు

పాలకుల్లో మాతృభాషాభిమానం మచ్చుకైనా లేదు. అధికార శ్రేణులకు తెలుగుపట్ల చిన్నచూపు చెప్పనలవికాదు.తెలుగును అధి కార భాషగా ప్రకటిస్తూ 1966లో చేసిన శాసనానికి 39 సంవత్స రాల తరవాత తీరిగ్గా 2005లో చట్టబద్ధ ఉత్తర్వులు వెలువడ్డాయి. తెలుగురాష్ట్రాల్లో ఉన్న తొమ్మిదికోట్లమంది తెలుగువారికి సేవలం దించవలసిన లక్షలాదిమంది ఉద్యోగులు వాస్తవానికి తెలుగులోనే పనిచేయవలసి ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు వారి భాషలోనే పనులు చేసిపెట్టవలసిన బాధ్యత ప్రభుత్వాలపైన, అధికారు లపైన ఉన్నది. ప్రభుత్వ కార్యకలాపాలన్నీ విధిగా తెలుగుభాషలోనే సాగించాలనేగా భాషాదినోత్సవాలలో పాలకులు మాట్లాడేది? మరి ప్రజలలో ఈ ఇంగ్లీషు మోజు పెంచేది ఎందుకు? పైశాచిక భాషాను వాదాలతో తెలుగు అంటేనే ప్రజలు తారెత్తిపోయేలా బ్యూరోక్రసీ కసిగా వెలగబెట్టిన నిర్వాకాలు ఎన్నో! 2013లో ఏర్పాటు చేసిన తెలుగు భాష సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ద్వారా గానీ 2018 లో ఏర్పాటు చేసిన తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ద్వారా గానీ ఏమేమి పనులు చేయించుకున్నారు?

భాష విషయంలో పాలకుల సంకల్పాలు, ప్రమాణాలు, గొప్పగా ఉంటున్నాయి. కానీ ప్రభుత్వాల ఉత్తర్వులు మాత్రం అమలు కావడం లేదు. తెలంగాణాలో సాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ వచ్చాయి. పాలనలోనూ, చదువుల్లోనూ తెలుగు కచ్చితంగా ఉండాలి. కార్యాలయాలలోనూ, పాలనలోనూ, కోర్టుల్లోనూ తెలుగును వెలిగించాలి. చిత్తశుద్ధిలేని నాయకుల మాటలతో ప్రజలలో నమ్మకం పోయింది. కూడు పెట్టని భాష మనకు – కోటీశ్వరులయ్యే చదువులు వాళ్ళకా? అని పేద ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విమర్శలను సాకుగా చూపి పాలకులు అసలు తెలుగు మాధ్యమానికే ఎసరు పెడుతున్నారు. పాఠశాల స్థాయి నుంచే తెలుగు మాయం "తెలుగు రాష్ట్రాలు రెండూ భాషను కాపాడేం దుకు కట్టుబడాలి. మాతృభాషలోనే మాట్లాడండి, మాతృభాషను ఎవరూ మరిచిపోవద్దు" అని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చెబుతున్నారు. స్కూళ్ళలో తెలుగు నేర్పుతుంటే కదా పిల్లలకు ఆభాష వచ్చేదీ మాట్లాడేదీ ? ప్లేస్కూల్ పేరిట మూడో ఏడు దాటగానే బడిలో వేస్తున్నారు. వారికి...మొదలు పెట్టడమే ఏ ఫర్ యాపిల్! 'అ– అమ్మ, ఆ – ఆవు' అని తెలుగు అక్షరాలు నేర్పించరు. కొన్ని స్కూళ్లలో ఐదో తరగతి దాకా తెలుగు చెప్పనే చెప్పరు. 6, 7, 8 తరగతుల్లో మొక్కుబడిగా చదివితే చాలు. 9, 10లో తెలుగు ఆప్షనల్ మాత్రమే! అంటే...ఇష్టముంటేనే తీసుకోవచ్చు. ఇంటర్‌లో కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రథమ భాషగా ఆంగ్లం, ద్వితీయ భాషగా సంస్కృతం మాత్రమే బోధిస్తారు. అసలు ఎక్కడా తెలుగు కనిపించదు.త్రిభాషా సూత్రం అమలు కాగితాలకే పరిమితమవుతోంది. నాయకుల హామీల ప్రకారం ఎలిమెంటరీ స్థాయిలో పూర్తిగా మాతృభాషలోనే బోధన ఉందా? ప్రైవేటు స్కూళ్లన్నీ ఇంగ్లీషు మీడియమే! ప్రైవేటు బడుల్లో బోధనా మాధ్యమంగా తెలుగు ఎప్పుడో మాయమైపోయింది. ఒక్క ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే ఇది మిగిలి ఉంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నానాటికీ పడిపోతోంది. ప్రైవేటు, కార్పొరేట్ బడుల్లోని 'ఇంగ్లీషు' మోజే దీనికి కారణం. ప్రైవేటు స్కూళ్లను తెలుగు బాట పట్టించాల్సిన ప్రభుత్వం...తానే ఆంగ్ల మాయలో పడుతోంది. మునిసిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియంను తగలేస్తూ...ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతోంది. తల్లి దండ్రులు కూడా; తమ పిల్లలకు తెలుగు రాకపోవడాన్ని గర్వంగా చెప్పుకొంటున్నారు. తెలుగులోనే డిగ్రీ దాకా చదివి, తెలుగు సాహిత్యమే ఆప్షనల్‌గా తీసుకొని, తెలుగులోనే ఇంటర్వ్యూకి హాజరై సివిల్స్‌లో తెలుగు మాధ్యమంతోనే మూడవ ర్యాంకు సాధించిన రోణంకి గోపాల కృష్ణను మనం గుర్తు తెచ్చుకోవాలి.

తెలుగు రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమీషన్లు తెలుగు మాధ్యమానికి అండగా ఉండాలి తెలుగు రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమీషన్లు తెలుగు మాధ్యమ విద్యార్థులకు ఎంతో సేవ చేయవచ్చు. ఇవి జరిపే గ్రూప్ 1, 2, 3, 4 ఉద్యోగ నియమకాలలో డిప్యూటీ కలక్టర్,మున్సిపల్ కమిషనర్, ఏసీటీఓ,సబ్ రిజిస్ట్రార్, డిప్యూటీ తహసిల్దార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఎక్స్టెన్షన్ ఆఫీసర్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సీనియర్ ఆడిటర్, సీనియర్ అకౌంటెంట్,జూనియర్ అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సెక్రెటరీ లాంటి వన్నీ తెలుగులో చేసే ఉద్యోగాలే. ఇవన్నీ ఐ ఏ ఎస్, ఐ పి ఎస్ లాంటి ఉన్నతోద్యోగాలు కావు. తెలుగు ప్రజలతో మమేకమై వారితో ముఖాముఖి తెలుగులో మాట్లాడుతూ వారిమధ్యే నివసిస్తూ వారికి సేవలందించే ఉద్యోగాలు.

తెలుగు ప్రజల సమస్యలను సరిగ్గా విశ్లేషణ చేయాలి. గ్రామ సామాజిక, ఆర్థిక వ్యవస్థపై తగిన అవగాహన తెచ్చుకోవాలి. ప్రజా పరిపాలన పై పరిజ్ఞానం పెంచుకోవాలి. అక్కడి ప్రజలు వారి భాషలో చెప్పే సమస్యలు, పరిష్కారాలు, సూచనలు వినాలి, రాయగలగాలి. ఈ నైపుణ్యాలన్నీ ప్రజల భాషలో తెలుగు మాధ్యమంలో చదివిన వారికే ఎక్కువగా ఉంటాయి.

రచయిత – విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలక్టర్
అమరావతి

ఓట్లు అడిగేది తెలుగులో...పరిపాలించేది ఉత్వర్వులిచ్చేది ఇంగ్లీషులోనా?

ఆచార్య పులికొండ సుబ్బాచారి
9440493604

తెలుగు జానపదభాష ప్రభావాలు, పరిణామాలు

'సాహిత్యంలో పరిణామాలు త్వరగా వస్తాయి కాని భాషలో పరిణామాలు చాలా ఆలస్యంగా వస్తాయి. అంటే భాషలో మార్పులు రావడానికి చాలా కాలం పడుతుంది సాహిత్యంలో వచ్చినంత త్వరగా రావు' అని ఒకప్పుడు భాషావేత్తలు చెప్పేవారు. కాని నేటి పరిస్థితులు అలా లేవు. భాషలో పరిణామాలు కూడా చాలా వేగంగా వస్తున్నాయి అని చెప్పవలసిన పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జానపద భాషలో నేటి కాలంలో వస్తున్న పరిణామాలు ఎలా ఉన్నాయి. వాటికి కారణాలు ఏమిటి అని ఇక్కడ పరిశీలించే ప్రయత్నం చేస్తున్నాను.

జానపద భాష ఏది అనేది చాలా పెద్ద ప్రశ్న. దీన్ని తేల్చడం అంత తేలిక కాదు. ఎందుకంటే జానపదులు ఎవరు అని తేలిస్తే కాని జానపద భాష ఏది తేల్చి చెప్పడం కుదరదు. జానపదులు ఎవరు అనే దానిపైన చాలా పెద్ద సిద్ధాంత చర్చ జరిగింది. అటు వైపు వెళితే సమయం అంతా అక్కడే సరిపోతుంది, అక్కడికి వెళ్ళడం లేదు. కాని చాలా క్లుప్తంగా ఇక్కడ నాలుగు మాటలు చెబితే కాని ముందుకు నడవడం కుదరదు. తెలుగులో ఈ పని తొలిసారిగా ఆచార్య రామరాజుగారు చేసారు. మౌఖికంగా లభించే సాహిత్యాన్ని ఏమనాలి అనే సందర్భంగా చాలా విస్తృతమైన చర్చే చేసి అప్పటికి వేరు వేరు పండితులు వాడే వేరు వేరు పదాలన్నింటిని పరిశీలించి జానపద సాహిత్యం అనాలి అదే అన్నింటికన్నా సరైన పారిభాషిక పదం అని తేల్చారు. దాన్ని నేనూ అంగీకరిస్తాను. ఇక ఎవరు జానపదులు అని చెప్పడానికి కేవలం పల్లెల్లో ఉండే వారే జానపదులు అని అనడం కుదరదు నగరంలో ఉండే వారిలో కూడా జానపదులు ఉండవచ్చు అని చెప్పారు. అలాగే పల్లెలో కూడా పండితుడు ఉండవచ్చు నన్నారు. మరి జానపదులు అని ఎవరిని చెప్పాలంటే జానపద మనస్తత్త్వం ఉన్న వారినే జానపదులు అనాలి అని చెప్పారు. దీనిపైన కూడా ఇంకా పెద్ద చర్చ జరగడానికి వీలుంది. జానపద మనస్తత్త్వం అంటే ఏది అని చెప్పాలంటే తిరిగి పెద్ద చర్చే జరగాలి.

మన వద్ద సంగతి ఇలా ఉండగా పాశ్చాత్యులలో కూడా who are folk అనే విషయంలో పెద్ద చర్చే జరిగింది. చివరికి అలన్ డండెస్ చేసిన నిర్వచనాన్ని అన్ని దేశాలలో అంగీకరిస్తున్నారు. చాలా క్లుప్తంగా దాన్ని ఇక్కడ చెబితే "కొన్ని సామాన్యలక్షణాలుండి తమదైన సంస్కృతి సంప్రదాయాలు తాము కలిగి ఉండి దీర్ఘ కాలంగా ఉన్న ఏ సామాజిక సమూహాన్నైనా జానపదులు అని అనవచ్చు" అని చెప్పారు. దీని ప్రకారం సంప్రదాయ సామాజిక సమూహాలు జానపదులు అవుతాయి. తాత్కాలిక అవసరాలకోసం ఒక చోట చేరిన ఏర్పడిన సామాజిక సమూహాలు జానపదులు అనే నిర్వచనం కిందికి రారు. ఈ నిర్వచనం ప్రకారం ఎవరు జానపదులు కారు? అనే పెద్ద ప్రశ్న ఉదయించింది. తర్వాత తర్వాత దీనికి కొన్ని పరి మితులు ఏర్పరచారు తర్వాతి శాస్త్రజ్ఞులు. కాగా ఇప్పుడు జాన పదులు ఎవరు అనే చర్చ ఎక్కడా జరగడం లేదు. అది గతార్థం అయింది. పై నిర్వచనాన్నే అత్యధికులు అన్ని దేశాలలో పాటిస్తున్నారు.

ఇక జానపద భాష అనగానే ఇప్పటిదాకా తెలుగులో మనకు అవగాహన ఉన్నదాని ప్రకారం గ్రామీణ జీవితం గడిపే వారు, వివిధ వృత్తులలో ఉన్నవారు, విద్యావంతులు లేదా అధిక విద్యా వంతులు కాని వారు అనే భావన ఉన్నది. తెలుగులో జానపద సాహిత్య పరిశోధన చేసినవారు ఇలాంటి సామాజిక సమూహాలనుండే సాహిత్యాన్ని సేకరించారు. దీనికి ఒక ప్రమాణంగా గ్రహించిందే మంటే, మౌఖిక సాహిత్యాన్ని సృజించే వారు జానపదులు అనే ఒక ప్రమాణరేఖ ఉంది. సేకరించి పరిశోధించిన సాహిత్యమంతా ఇలాంటి మౌఖిక సాహిత్యమే. దీన్నే జానపద సాహిత్యంగా నేటికీ అంగీకరించి పరి శోధనలు సాగుతున్నాయి.

లిఖిత సాహిత్య పరిచయం లేనివారు అలాంటి చదువులు చదువుకోని వారు జానపదులు అనే ఒక ప్రమాణ రేఖ కూడా ఉంది. ఇక్కడ విద్య అనేదానికి నేను విస్తృతమైన అర్థంలో గ్రహిస్తాను. జానపద శాస్త్రంలో నిరక్షరాస్యులు illiterate అనే పదాన్ని అంగీకరించరు. వారు non-literate అనే అభివ్యక్తిని వినియోగిస్తారు. దాని అర్థం ఏమంటే ఒక భాష మాట్లాడేవారు ఎవరూ నిరక్షరాస్యులు కారు. అక్షరాలు రాయడం తెలియని వారు ఉండవచ్చు కాని అక్షరాలు తెలియనివారు ఉండరు అని దీని అర్థం. అంటే జానపద శాస్త్రం ప్రకారం ఒక భాష మాట్లాడే వారు అందరూ అక్షరాస్యులే అని అర్థం. అక్షరాలు రాయడం అంటే లిపి తెలియనివారు అనే అర్థంలోనే వారిని చూచి నాన్ లిటరేట్స్ అనే పదాన్ని వారికి వినియోగిస్తారు. ఇక విద్య అంటే ఇక్కడ ఉన్న అవగాహన కూడా వేరే. కేవలం తరగతులు డిగ్రీలు పొందేదే విద్య అనే భావన ఉంది. కాని ప్రతి పని ఒక విద్య అని ప్రతి జీవన విధానం ఒక విద్య అని జానపద శాస్త్రం భావిస్తుంది. ప్రతి చేతి వృత్తి దాన్ని నేర్చుకోవడం దాన్ని చేయడం ఒక విద్యే. వ్యవసాయం ఒక విద్య వడ్రంగం ఒక విద్య. వంట గృహనిర్వహణ ఇలా అన్ని రకాల పనులు జీవన విధానాలు కూడా విద్యలే. దీన్ని సాంఘిక శాస్త్రాలు దాదాపు అన్నీ అంగీకరిస్తాయి. కాగా మామూలు అవగాహనలో ఉన్న విద్యని దృష్టిలో ఉంచుకొని జానపదులను విద్యలేని వారు అని చెప్పడం కుదరదు. ఔపచారికమైన తరగతులు చదవనివారు అని చెప్పవచ్చు.

ఇక నేటి దాకా జరిగిన పరిశోధనలను పరిశీలిస్తే జానపద భాషని గురించి చాలామంది జానపద విద్వాంసులు తమ పరిశోధన గ్రంథాలలో చెప్పారు. రామరాజు గారు జానపద భాషలోని విశేషాంశాలను చెప్పారు. నాయని కృష్ణకుమారిగారు తర్వాత రఘుమారెడ్డిగారు కూడా జానపద భాషని వర్ణించి విశేషాంశాలను చెప్పారు. ఆ తర్వాత కూడా మరికొందరు జానపద భాషని గురించి రాశారు కాని ఇక్కడ వారు చేసిన భాషాపరిశీలన అంతా కూడా వారు సేకరించిన జానపద సాహిత్యాన్ని గేయాలను ఆధారంగా చేసుకొని చేసిన పరిశీలనమే. మామూలుగా మాట్లాడిన భాషను వివిధ సందర్భాలలో సేకరించి చేసిన పరిశీలన కాదు ఇది. అంటే వారు సేకరించిన మౌఖిక సాహిత్యంలోని భాషకు జానపదులు నిత్య జీవనంలో మాట్లాడే భాషకు తేడా ఉంటుందా అని పరిశీలిస్తే వారు మాట్లాడే భాషలోనే సాహిత్యాన్ని సృష్టించి ఉండవచ్చు. కాని అది మాత్రమే జానపద భాష కాదు అది ఒక భాగం మాత్రమే అవుతుంది. కాని దైనందిన జీవితంలో ప్రతిరోజూ మాట్లాడే విస్తృత పదసంచయం, భాష మౌఖిక సాహిత్యం కన్నా విస్తృతంగా ఉంటుంది. దీన్ని కూడా సేకరించి ఆ భాషని విశ్లేషించే ప్రయత్నం తర్వాత జరిగింది.

భద్రిరాజు కృష్ణమూర్తిగారు ఈ పనిచేశారు. వీరు మాండలిక భాషని విశ్లేషించి తెలుగు మాండలిక భాషలు ఎన్ని ఉన్నాయి వాటి లక్షణాలు ఏమిటి వ్యాకరణం ఏమిటి అనే చర్చ చేశారు. వారు సంపాదకత్వం వహించి తయారు చేసిన గ్రంథం తెలుగు భాషాచరిత్ర లో వారే ఒక వ్యాసం మాండలిక భాషలపైన రాశారు. ఇదే వ్యాసంలో ఆయన జానపద భాషని గురించి చర్చించారు. అయితే ఇక్కడి భాషా చర్చ జానపద సాహిత్యం ఆధారంగా జరగలేదు. ఇది వారు మాండలిక వృత్తిపదకోశాల కోసం సేకరించిన భాష ఆధారంగా చేసిన భాషాపరిశీలన. వివిధ వృత్తులు చేసుకునే వారు వారి వృత్తికి సంబంధించి దైనందిన జీవితంలో, వృత్తి వినియోగంలో వాడిన మాట్లాడిన భాషను పరిశీలించారు. కృష్ణమూర్తిగారు తెలుగు మాండలిక భాషలని నాలుగు మండలాలుగా విభజించారు. 1. పూర్వమండలం, 2 దక్షిణ మండలం, 3. ఉత్తర మండలం, 4 మధ్యమండలం అని నాలుగు మండలాలుగా మన మాండలిక భాషలని విభజించి మాండలిక భాషకున్న లక్షణాలు వర్ణించారు. ఇక వీటి వివరాలు ఇక్కడ అవసరం లేదు కాని ఆయన చేసిన మరొక పరిశీలనను ఇక్కడ ప్రస్తావించాలి. ఇదేసందర్భంలో భాష వ్యక్తీకరణలను రెండుగా విభజించి చెప్పారు 1. శిష్టభాష 2. జానపద భాష. ఇక్కడ మొదటిది చదువుకున్న వారి భాష రెండోది చదవుకోని వారి భాష లేదా పామర భాష. ఇక్కడ పామరులు అంటే కించపరిచే అర్థం లేదు.

జానపద భాషకి శిష్టభాషకి ఉన్న భేదాలను చెబుతూ ఎనిమిది ప్రధానమైన లక్షణాలను ఆయన సూచించారు. జానపద భాషని పరిశీలించడానికి ఆ విభజన చాలా బాగా ఉపకరిస్తుంది. నేటి జానపద భాషలో పడిన ప్రభావాలను పరిశీలించి వస్తున్న పరిణామాలను గ్రహించడానికి ఆయన చేసిన విభజన ఇక్కడ తప్పక పరిశీలించవలసి ఉంటుంది. ఆయన చెప్పిన ఎనిమిది లక్షణాలను ఇక్కడ చెబుతాను.

1. శిష్టోచ్చారణలో ఒత్తులు నిలుస్తాయి (భాగవతం, ధర్మం), జానపదోచ్చారణలో ఒత్తులు పోతాయి (బాగవతం దర్మం).

2. శి.ఉ లో అద్విరుక్త చకారం అంతటా నిలుస్తుంది. (చవుడు, చుక్క, పలచన) జా.ఉ లో చకారం సకారం అవుతుంది (సవుడు, సుక్క, పలసన)

3. శి.ఉ లో పదాది వకారం నిలుస్తుంది (ఇ,ఈ,ఎ,ఏ లముందు విల్లు, వీధి, వెండి, వేడి) జా.ఉ లో వకారం పోతుంది యిల్లు, యీది, యెండి, యేడి)

4. శి.ఉ లో సంయుక్త హల్లులు నిలుస్తాయి (భక్తి, చేస్తాడు, కలెక్టర్) జా.ఉ లో హల్లులు సమీకరణం పొందుతాయి (బత్తి, సేత్తాడు, స్వరభక్తి కూడా రావచ్చు. కలకటేరు)

5. శి.ఉ లో శ, ష, స ల భేదం ఉంటుంది. (శాస్త్రి, భాష, కాసు). జా.ఉ లో శ, ష, స లు సకారంగా మారతాయి సేత్రి, బాస, కాసు).

6. శి.ఉ లో మూర్ధన్య దంతమూలీయ భేదం నిలుస్తుంది (పల్లం, పళ్ళెం, వాణ్ణి) జా. ఉ లో మూర్ధన్యాలు దంతమూలీయా లౌతాయి (పల్లం, పల్లెం, దాన్ని, వాన్ని).

7. శి.ఉలో f, ఫ వేరు వేరుగా ఉంటాయి (ఆఫీసు, కాఫీ, తోపు) జా.ఉ లో f, ప గా మారుతుంది (ఆఫీసు కాపీ తోపు)

8. శి. ఉ లో పదాది గకారం దేశ్య శబ్దాలలో నిలుస్తుంది (గట్టు, గడ్డ, గండి) జా. ఉ లో గ, గె మారుతుంది. (గెట్టు, గెడ్డ, గెండి).

జానపద భాషలో ఉన్న ఎనిమిది ప్రధాన లక్షణాలు పైన చేసిన పరిశీలనలో చూడవచ్చు. రోజూ మాట్లాడే భాషని పరిశీలిస్తే ఇంకా కొన్ని విధానాలు కూడా మనకు జానపద భాషలో కనిపిస్తాయి. అయితే పైన చెప్పిన ఎనిమిది భాషావిశేషాలు నేటికీ మనకు జానపద భాషలో కనిపిస్తాయి. అంతే కాదు పైన చెప్పిన జానపద భాష లక్షణాలు ఆయా మండలాలలో నివసించే విద్యావంతుల భాషలో కూడా మనకు కనిపించే తీరు ఇక్కడ మనం గమనించవచ్చు. తెలంగాణ మాండలికంలోని భాషారూపాలు ఇక్కడి విద్యావంతులు యాదృచ్ఛికంగా మాట్లాడే భాషలో కూడా చూడవచ్చు.

ఉదాహరణకి తెలంగాణ మాండలికంలో పైన చెప్పిన పదాది వకారం లోపించి వచ్చిండు బదులు అచ్చిండు, అచ్చింది అని పలకడం, మళ్లీ బదులు మల్లీ అనడం, వాళ్ళు బదులు వాల్లు అనడం, విద్యావంతులలో కూడ ఉంది. అంతే కాదు ఇక్కడి మాండలికానికి వేరే వ్యాకరణం రాసే ప్రయత్నమే ఉంది కాబట్టి ఇక్కడ దీనిపైన విస్తృత చర్చ అవసరం లేదు. ఇంతే కాదు కృష్ణ మూర్తిగారు చూపిన ఇంకా ఇతర మూడు మండలాలలోని భాషలలో ఉన్న విద్యావంతుల భాషలో కూడా ఇలాంటి మాండలిక పద వినియోగం మనం చూడవచ్చు.

ఇక నేటి జానపద భాషపైన ఏఏ ప్రభావాలు విస్తృతంగా పడ్డాయో మనం నేటి సందర్భంలో పరిశీలించి నేడున్న జానపద భాష వ్యక్తీకరణాలు ఎలా ఉన్నాయో చెప్పవచ్చు.

రామరాజుగారు జానపద భాషకి ఒక నిర్వచనం లాంటి

వాక్యాన్ని రాశారు. "దేశీయమగు సరళ మార్గమున వ్యాకరణాలంకార నియమములకు కట్టువడక అలతియలతి పదములతో అప్రయత్న ముగా సహజముగా వెలువడెడు వ్యావహారిక భాష" అని దీన్ని అన్నారు. అలాగని రామరాజు గారు జానపదభాషని వ్యాకరణ విరుద్ధ భాష అని అన్నారని అర్థం చేసుకోకూడాదు. శిష్టభాషకు వర్తించే వ్యాకరణానికి విరుద్ధమైన భాష అని మాత్రమే వారి భావం. కారణం వారే, ఇదే అధ్యాయంలో జానపద భాషకు వేరే వ్యాకరణమే రాయాలని నిక్కచ్చిగా చెప్పి దాన్ని ప్రత్యేకంగా వర్ణించి వ్యాకరణం రాయాలి అని అన్నారు. అయితే రామరాజు గారు జానపద భాషని గురించి రాసింది 1956 ప్రాంతంలో ఇక భద్రిరాజు కృష్ణమూర్తి గారు జానపద భాషలక్షణాలను గురించిరాసింది 1973 ప్రాంతంలో. కాగా నేటికి ఈ పరిశీలన చేసి దాదాపు ఐదు దశాబ్దాలు గడిచింది. నేడున్న సామాజిక పరిస్థితిలో వచ్చిన పరిణామాలను పరిశీలిస్తే నేటి జానపద భాషలో వచ్చిన పరిణామాలను పరిశీలించవచ్చు. అందుకే నేటి సందర్భంలో భాషపైన పడిన ప్రభావాలను పరిశీలన చేద్దాం.

సామాజిక పరిమాణాల కారణంగానే అక్కడున్న కళారంగం ప్రభావితం కావడం మనం గమనిస్తూ వస్తూనే ఉన్నాము. స్వాతం త్ర్యోద్యమ కాలంలో ఉద్యమానికి బాసటగా జానపద సాహిత్యం జాన పద ప్రదర్శన కళలని ఉద్యమకారులు పార్టీలు విరివిగా వాడు కొని వారి ఆలోచనలను, వాదాలను సిద్ధాంతాలను బాగా ప్రచారం చేసారు. తెలంగాణ రజాకార్ల వ్యతిరేక ఉద్యమంలో కూడా జానపద కళలను విరివిగా వినియోగించుకోవడం చరిత్ర ప్రసిద్ధం కూడా. ఇక్కడ గమనించాల్సిన విషయం సామాజికంగా జరిగే పరిణామాలు జానపద సాహిత్యం కళలపైన ఎలాంటి ప్రభావం వేసింది అని. ఇలా కాక మరో కోణంలో సమాజంలో జరిగే సాంకేతిక పరిణామాలు, సాంఘిక పరిణామాలు ఆ సమాజంలోని సాహిత్యం అంటే మౌఖిక సాహిత్యం కళపైన ఎలాంటి ప్రభావం వేస్తుంది అని పరిశీలించవలసి ఉంది. జన జీవితంలో వచ్చే తీవ్రపరిణామాలు భాషపైన కూడా గట్టి ప్రభావం వేస్తాయని మనకు ఇటీవల అంటే గడచిన రెండు మూడు దశాబ్దాలలో తెలియవచ్చింది.

నాటక రంగం అదృశ్యం కావడానికి లేదా మరుగున పడి పోవడానికి సినిమా ఎంత బలమైన కారణమో ఇప్పటికే చాలా చర్చలు జరిగాయి. అయినా జానపద కళలు కొన్ని బతికి బట్టకట్టాయి. కారణం సినిమా థియేటర్లు గ్రామాలకు దూరంగా ఉండడం కనీసం తాలూకా కేంద్రానికి పోయి అదీ ఏ నెలకో రెండు నెలలకో పోయి చూసే పరిస్థితి ఉండేది. వారికి ఉన్న ఖాళీ సమయంలో ఈ జానపద ప్రదర్శన కళలు పాటలు ఇతర అభివ్యక్తి ప్రక్రియలు వినోదాన్ని అందించేవి. ఇంకా రకరకాల జానపద క్రీడలు ఆచారాలు విని యోగంలో ఉండేవి. అంటే సినిమా ప్రభావం ఒక స్థాయి మేరకే ఉండేది.

1980 దశకం తర్వాత సమాజంలో వచ్చే పరిణామాలు చాలా వేగవంతం అయ్యాయి. సామాజిక పరిణామాలను చాలా తీవ్ర స్థాయిలో తేవడానికి వచ్చిన సాంకేతిక మాధ్యమ విప్లవాలు అని చెప్పదగినవి ఒకటి సాటిలైట్ కేబుల్ టివి, రెండు మొబైల్ ఫోన్. ఈ రెండు జన జీవితాన్ని అతి తీవ్రస్థాయిలో ప్రభావితం చేశాయి. దీని తర్వాత ఇలాంటి ప్రభావం ఉన్న మరొక ప్రధాన అంశం విద్యావ్యాప్తి.

మన దేశంలో అక్షరాస్యత పెరిగిన విధానాన్ని పరిశీలించినా అక్షరాస్యత లేని వారి భాష అంటే లిఖిత సాహిత్య ప్రభావం కాని ఉన్నత స్థాయి భాష ప్రభావం కాని లేని వారిది, అక్షరాస్యులు కాని వారి కేవల మౌఖిక భాష అంటే జానపద భాష వ్యాప్తి ఎలా ఉందో కూడా తెలుసుకోవచ్చు.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటికి అంటే 1947 నాటికి మన దేశంలో అక్షరాస్యత 12% గా ఉండేది. కాని అదే 1940 దశకంలో ఐరోపా దేశాలలో అక్షరాస్యత 90% గా ఉండేది. దీన్నే బట్టే పరాయి పాలనలో మగ్గిన దేశంలో చదువు పరిస్థితిఎలా ఉండేదో తెలుసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. మనకు వచ్చిన ఉద్యమాలు కూడా ఆ కాలంలో వచ్చినవే. దీన్ని బట్టే అంటే అక్షరాస్యత 12 శాతంగా ఉన్న ప్రజలకు సమాచారం అందించవలసిన మాధ్యమం జానపద భాష జానపద కళలు మాత్రమే అని నాటి ఉద్యమకారులు కాని ఇతరులు కాని గుర్తించారు.

ఆంధ్రదేశంలో కేబుల్ ద్వారా వ్యాపించే సాటిలైట్ టివి 1996నుండే ఆరంభం అయింది. ఇది ప్రతి పల్లెకు వ్యాపించడానికి ఐదు నుండి పది సంవత్సరాల కాలం పట్టింది. అంటే 2010 నాటికే ప్రతి పల్లెకు సాటిలైట్ టివి డిష్ టివి ప్రసార మాధ్యమం వ్యాపించింది. ఇంటింటికీ టివి ఉండడం టివి లేని గుడిసె కూడా లేకపోయిన స్థితి ఈ కాలానికే వచ్చింది. ఇక దీనితో పాటు దీనికిసమాంతరంగా విద్యా వ్యాప్తి ఎలా ఉందో తెలుసుకోవడం ముఖ్యం. 2011 జనగణన ప్రకారం భారత దేశం మొత్తంలో అక్షరాస్యత వ్యాప్తి 74.04% గా ఉంది. కాగా 2018 సంవత్సరంలో అంటే ఇటీవలే గణించిన లెక్కల ప్రకారం దేశంలో అక్షరాస్యత 94.65 శాతంగా ఉంది.

ఇక్కడ నేటిస్థితిలో అక్షరాస్యత అంటే కేవలం అక్షరాలు మాత్రమే రాయగలిగిన వారు కారు అని కనీసం పదవ తరగతివరకు చదువుకున్నవారు అని గ్రహించాలి. దీనికి కారణం ప్రతిపల్లెకు విద్యావ్యాపారం పాకి పోయింది. అంటే ఇంగ్లీషు మీడియం ప్రైవేటు పాఠశాలలు ప్రతి పల్లెకూ వ్యాపించి పెద్ద ఎత్తున వ్యాపారం జరుగుతూ ఉంది. కనీసం పదవతతరగతి వరకు చదివించని కుటుంబాలు చాలా అరుదుగా కనిపిస్తున్నాయి. ఈ వ్యాస కర్త ప్రతి సంవత్సరం ఒక వంద గ్రామాలకు తగ్గకుండా సందర్శిస్తూ క్షేత్ర పరిశోధన చేస్తూ ఉన్నాడు. ఈ గ్రామాలలో గమనించిన విషయాలు భాషలో వచ్చిన మార్పులు ఆశ్చర్యం కలిగించేలా ఉంటున్నాయి.

ప్రతి ఇంటిలోను టివి పనిచేస్తూ ఉంది అని చెప్పుకున్నాము. నేటి లెక్కల ప్రకారం ఒక తెలుగులోనే 56 ఛానళ్ళు పనిచేస్తున్నాయి.

ప్రజల భాషలో పరిపాలించేదే ప్రజాస్వామ్య ప్రభుత్వం

ఇవి నిరంతరాయంగా కార్యక్రమాలను అందిస్తున్నాయి. రోజులో పగలు, రాత్రి సమయాలలో ఎక్కువ సమయం వచ్చేవి సీరియళ్ళు, తర్వాత సినిమాలు, తర్వాత వార్తలు. ఇక ప్రత్యేకంగా రోజంతా వార్తలు వినిపించే ఛానళ్ళు వచ్చాయి. ఈ మాధ్యమాలలో వినియోగించే భాష ప్రభావం ప్రజల మీద చాలా ఎక్కువగా ఉంది. పత్రికల భాషకన్నా ఈ ఛానళ్ళలో ప్రజలకు వినిపించే భాష ప్రభావం చాలా ఎక్కువగా కనిపిస్తూ ఉంది. ఇక సినిమా అనేది ఒకప్పటి తెరమాధ్యమం కాదు. తెరమాధ్యమంగా సినిమా ఉన్నప్పుడు గ్రామీణ ప్రజలు తమకు కనీసం పది కి.మీ దూరంలో ఉన్న కొద్దిపాటి బస్తీకి పోయి సినిమా చూడవలసి వచ్చేది. కాని నేడు సినిమా అనేది తెర మాధ్యమం కాదు గృహప్రక్రియ అంటే domestic genre అని కొత్త నిర్వచనం ఇవ్వాలి. ఒక్కో ఛానల్ రోజుకు కనీసం మూడు సినిమాలు అందిస్తూ ఉంది. అంతే కాదు అచ్చం రోజంతా సినిమాలే ప్రదర్శించే ఛానళ్ళు వచ్చాయి. దీని కారణంగానే గ్రామీణ జీవితంలో కాని నగరంలో కాని సినిమా అనేది గృహప్రక్రియ అయింది ఇంటితెర అయింది అని చెప్పవచ్చు. దీనివల్ల ఇంటి సినిమా ప్రభావం గ్రామీణ జీవితంలో వేష భాషలలో సమూలమైన మార్పు తీసుకు వచ్చింది. టివిలో వాడే భాషని మాట్లాడడం నాగరికత అని పాతకాలంలో మాట్లాడిన భాష మాట్లాడడం మోటు అనే భావన ప్రజలలో వచ్చింది. ఏది జానపద భాష అని లెక్కిస్తే ఇది జానపద భాష ఇది నగరభాష అని విడమరచి చెప్పలేని పరిస్థితి ఏర్పడింది.

సెటిలైట్ ఛానళ్ళు ఇంటింటికీ వ్యాపించినందువల్ల ఏర్పడిన పరిస్థితి జానపద కళలపైన మరణ శాసనం రాసింది. గ్రామీణుల కున్న తీరిక సమయం మొత్తాన్ని ఈ డిష్ టివి లాగేసుకుంది. దీని కారణంగానే జానపద క్రీడలు జానపద ప్రదర్శన కళలు తెరమరుగు అయ్యాయి. అంటే వాటిని అంటిపెట్టుకొని ప్రవర్తించిన జానపద భాష కూడా మరుగై పోయింది అనే అర్థం. నేటి క్షేత్ర పరిశోధనలో ఎక్కడ ఏ పల్లెలో పలకరించినా ప్రజలు మాట్లాడే భాష టివి భాషకు చాలా దగ్గరగా ఉంటూ ఉంది. ఏ ఛానల్ కి సంబంధించిన యాంకర్ కాని పల్లెకు పోయి ఏ వ్యక్తికైనా మైక్ ఇచ్చి అక్కడి సమస్యలను గురించి విచారిస్తే అక్కడి వారు అతనితో మాట్లాడే భాష టివి ప్రసారంచేసే భాష మాదిరిగానే ఉంటుంది. రైతుల సమస్యల గురించి కాని జీవనోపాధి పథకాల గురించి కాని లేదా గ్రామాలలో అమలయ్యే ప్రభుత్వ కార్యక్రమాల గురించి కాని టివి విలేకర్లు అడిగిన ప్రశ్నలకు అక్కడి వారు చెప్పే సమాధానాలు టివిలలో వింటే అది టివి మాధ్య మాలలో ప్రసారం అయ్యే భాషలాగే ఉంటుంది. కాని అంతకుముందు గ్రామాలలో కనిపించిన భాష కనిపించడం లేదు. క్షేత్ర పరిశోధనలలో అక్కడి వారిని కదిలిస్తే వినిపించే భాష కూడా ఇలాగే ఉంటూ ఉంది.

ఇక గ్రామీణ జీవితాన్ని సమూలంగా మార్చి మానవ సంబంధాలను అతి దగ్గరచేర్చి వారి భాషలో అత్యధికంగా ఇంగ్లీషు మాటల్ని చేర్చిన మరొక సమాచారవ్యవస్థ మొబైల్ ఫోన్. నగరంలో ప్రతి ఇంట్లోనే కాదు ప్రతివ్యక్తి దగ్గర సెల్‌ఫోన్ ఉంటూ ఉందన్న సంగతి చెప్పనవసరం లేదు. సెల్‌ఫోన్ వ్యాప్తి మండలస్థాయిలో ప్రతి గ్రామ స్థాయిలో ప్రతి తండా స్థాయికి కూడా విస్తరించి ఉంది. మొబైల్ ఫోన్ ప్రతి ఇంట్లో ఉంది. ఈ ఇంట్లో లేదు అని చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. వివిధ వృత్తులు చేసుకునే వారి దగ్గర, పొలంలో నాగలి దున్నే వ్యక్తి నడుముకుకట్టి కూడా మొబైల్ కనిపిస్తూ ఉంది. చివరికి ప్రతి యాచకుని వద్ద కూడా మొబైల్ ఫోన్ కనిపిస్తూ ఉంది. తెలుగు వ్యవహార భాషలోనికి చాలా ఎక్కువ ఇంగ్లీషు పదాలు తెచ్చిన ఘనత ఈ ఫోన్ వ్యవస్థకి ఉందని తెలుస్తూ ఉంది. ఇంతకు ముందు అంటే కనీసం పది సంవత్సరాల క్రితం గ్రామాలలో క్షేత్రపరిశోధనలలో ఎవరినైనా ఇంగ్లీషు రాని వారితో మాట్లాడి ఇంగ్లీషు పదాలు లేని తెలుగును విందాము అని అనుకుంటే అది సాధ్యం అయ్యేది. ఇంగ్లీషు చదువుకోని వారి తెలుగు ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి అంటే ఇంగ్లీషు పదాలు (బస్సు రైలు వంటివి కాక) లేని తెలుగును వినడం సాధ్యం అయ్యేది. కాని జానపద భాషలో ఇలా ఇంగ్లీషు పదాలు లేని తెలుగు వినడం నేడు సాధ్యం కాదు. పెద్దవారు అంటే 70 లేక 80 ఏండ్లు వయస్సున్న ఆడ మగ వారిని కదిలించినా వారి భాషలో ఆంగ్లపదాలు బాగా వినిపిస్తున్నాయి. సెల్ ఫోన్ వ్యవస్థ చుట్టూ తిరిగే ఎన్నో మాటలు తెలుగులో లేనివి ఇంగ్లీషు పదాలే అందరి నోళ్ళలో నానుతున్నాయి. సెల్, సిమ్, సిమ్ కార్డు, బాటరీ, చార్జింగ్, రీచార్జింగ్, టవర్, కాల్, కాల్ కలవలేదు, కాల్ చేసాడు. చార్జింగ్ ఎక్కింది. చార్జింగ్ దిగిపోయింది. సెల్లులో డబ్బులెయ్యి. ఇలా ఎన్నో వ్యక్తీకరణలు ప్రతి వారి భాషలోనికి వచ్చాయి. ఇక మొబైల్ సేవలు అందించే కంపెనీల పేర్లన్నీ కూడా గ్రామాలలో వినిపిస్తాయి. వాటి అధినేతల పేర్లు కూడా వినిపిస్తాయి. బాగా చదువుకున్న వారు విశ్వవిద్యాలయం పండితులు మొబైల్ ఫోన్ ను చరవాణి, అని కరవాణి అని, ల్యాండ్ ఫోన్ ని స్థిరవాణి అని అనువాదాలు చేసి సరదాగా వినియోగించు కుంటున్నారు. కాని జానపదుల భాషలో సెల్ ఫోన్ సెల్ ఫోన్ గానే వ్యవహారంలో స్థిరపడింది. సెల్ ఫోన్ వ్యవస్థకి సంబంధించిన ఏ పదాన్ని కానీ వారు తెలుగులో అనువాదం చేసే ప్రయత్నం చేయడం లేదు పూర్తిగా ఇంగ్లీషు పదాలే అక్కడ ప్రచారంలోనికి వచ్చాయి. విస్తరించిన సినిమా, విస్తరించిన డిష్ టివి కేబుల్ టివి, విస్తరించిన మొబైల్ ఫోను, విస్తరించిన ఇంగ్లీషు విద్య జానపద భాషలో ఎక్కువగా మార్పులు తెచ్చాయి.

జానపద భాషలో టివి మాధ్యమం భాష, అదీ సీరియళ్ళలో పాత్రలు మాట్లాడే భాష బాగా ప్రచారంలోనికి వచ్చింది. సీరియల్ పాత్రల భాషలో మాట్లాడడం ఫేషన్ అనే స్థితికి వెళ్ళింది. టివి వార్తల్లోని భాషకూడా బాగా వ్యాప్తిలోనికి వచ్చింది. దీని ప్రభావం వల్ల ఇంగ్లీషు విద్య వ్యాప్తి వల్ల కూడా జానపద భాషలో ఇంగ్లీషు పదాల వాడుక చాలా విస్తృతంగా పెరిగింది. యువతరంలోనే కాక పెద్దవయస్సు వారిలో కూడా ఇంగ్లీషు పదాల వినిమయం బాగా పెరిగింది. మాండలిక వ్యక్తీకరణాలలో కూడా చాలా మార్పులు వచ్చాయి.

నగరీకరణం అనేది పల్లెల్లో బాగా వ్యాపించింది. ఈ నగరీకరణం అంటే urbanization అని చెప్పాలి. దీన్నే మరో

పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం - రెండూ తప్పే

విధంగా ఆధునీకరణం అని కూడా అనవచ్చు. కొన్ని ఉదాహరణలు చూడవచ్చు. ఇంతకుముందు కాలంలో గ్రామంలో పెండ్లి అయితే తాటాకు పందిళ్ళు వేసేవారు. అది ఆ సంవత్సరం అంతా ఉండేది. ఇక పెద్దపెద్ద పాత్రలు ఉన్న వారి ఇండ్ల నుండి అరువుకు తెచ్చుకునేవారు శుభకార్యం అంటే వారు కూడా కాదనకుండా ఇచ్చేవారు. అంటే దాదాపుగా గ్రామంలో ఉండే వస్తువులే పెండ్లి కార్యక్రమాలు అన్నింటిలో ఉండేవి ఉపయోగపడేవి. మేళతాళాలు వాద్యగాళ్ళు మాత్రం అన్ని గ్రామాలలో ఉండేవారు కారు పక్క ఊరునుండి రావలసి వచ్చేది. కాని నేటి కాలంలో టెంట్ హౌస్ లు చాలా పెద్దగ్రామాలలో వచ్చాయి. ఒక గ్రామంలో లేకపోయినా పక్కగ్రామాలనుండి తెప్పించుకుంటున్నారు. సామాను టెంటులు టేబుళ్ళు కుర్చీలు, క్రాకరీ మ్యూజికి బ్యాండ్ విత్ వెహికిల్ యూనిఫామ్ లు అన్నీ పల్లెకి వచ్చాయి. ఫ్లెక్సీ బానర్లు, వాటర్ బాటిళ్ళు, వీడియోలు డిజిటల్ ఫోటోలు, మానీటర్లో చూడడాలు, సిడి ఆల్బమ్ లు ఇన్ని వచ్చాయి. పాత ఆచారాలకు చెందిన పదాలు అన్నీ పోయి ఇక్కడ చెప్పుకునే కొత్తపదాలు అన్నీ వచ్చాయి. ఎన్నో ఇంగ్లీషు పదాలు జానపదుల వ్యవహారంలోనికి వచ్చాయి.

కరెంటు లేని ఇల్లు కనిపించదు. ఈ కరెంటుతో పాటు చాలా ఇంగ్లీషు పదాలు వ్యవహారంలోనికి వచ్చాయి. బల్బు, ఫాను, ఎసి, స్విచ్చులు, లైట్లు, బోర్డులు, మిక్సీలు, గ్రైండర్లు, వాషింగ్ మెషిన్లు, ఇలా చాలా గృహోపకరణాలు సంప్రదాయమైనవి పోయి కొత్తవి వచ్చాయి. వాటితో పాటు తెలుగు మాటలు పోయి ఇంగ్లీషు పదాలు వ్యవహారంలోనికి వచ్చాయి.

కొత్త కొత్త ఆహారాలు, వాటి పేర్లు నిత్యవ్యవహారంలోనికి వచ్చాయి. వైట్ రైస్, సాంబార్ రైస్, ఫ్రైడ్ రైస్, ఘీ, కోకోనట్ రైస్, కర్డ్ రైస్, బటర్ మిల్క్, పాల పాకెట్లు, క్రేట్లు, కాన్లు, ఛాట్, పానీ పూరీ, పావ్ బాజీ, బిర్యానీ, యగ్ బిర్యానీ, వెజ్ బిర్యాని, మటన్, చికెన్ బిర్యానీలు, ఇలా చాలా పదాలు నిత్య వ్యవహారంలోనికి వచ్చాయి. టీవీ ఛానళ్ళలో వంటల కార్యక్రమంలో చూపించి మాట్లాడే మాటలన్నీ ఇంగ్లీషులో లేదా హిందీలో ఉంటాయి. దాదాపు ఆ పదాలు అన్నీ జానపద భాషలో నిత్యవ్యవహారంలోనికి వచ్చాయి. చదువుకోని వారుకూడా తాలింపు వేశావా బదులు ఫ్రైచేశావా అని డీప్ ఫ్రై చేయి అని చెప్పుకుంటున్నారు. చివరికి గోరింటాకు కూడా పోయి మెహందీ వచ్చిందీ. మెహందీ పాకెట్లు ఊరి కిరాణా దుకాణంలో అమ్ముతున్నారు. పల్లెల్లోకి బ్రైడ్ మేకప్ వచ్చింది. బ్రైడల్ సారీలు, బ్రైడల్ ఫినిషింగ్‌లు వచ్చాయి. దగ్గరిలోని పట్టణంనుండి నాగరికత అంతా అతి సునాయాసంగా ఊర్లోనికి అడుగు పెడుతూ ఉంది. దీనితో వచ్చే పదసంపద అంతే దేశ్య పదజాలాన్ని అంటే జానపద వ్యవహారాన్ని తోసి రాజని నిలబడుతూ ఉంది.

ఆహారపు అలవాట్లు దుస్తులలో కూడా చాలా మార్పులు వచ్చాయి. పంచె కట్టు తగ్గింది. పాంట్లు షర్టులు వేసే వారు చాలా ఎక్కువగా ఉన్నారు. పొలం పనులు చేసేటప్పుడు కూడా పాంట్లు వేసే వారు కనిపిస్తున్నారు. నరేగా పనులు చేసే వారిలో కూడా ఆడవారు షర్టులు ధరించడం మగవారు పాంటులు ధరించడం కనిపిస్తూ ఉంది. యుక్తవయస్సులో అమ్మాయిలు లంగా ఓణీ వేసుకోవడం పూర్తిగా మరిచారు. పంజాబీ సల్వార్ కమీజు అమ్మాయిలందరికీ సర్వసామాన్యమైన డ్రస్ అయింది. వీటి ప్రభావం అంటే ఆహార విహారాలలో ప్రభావం భాషమీద ఉంది. ప్రేమలు ప్రేమ వివాహాలు, కులాంతర ప్రేమలు వాటి దుష్పరిణామాలు యువతీ యువకుల మధ్య భిన్న భిన్న సంబంధాలు ఏర్పడడానికి టివీ దాని ద్వారా వ్యాపించిన సినిమా చాలా వరకు కారణం ప్రేరణం అవుతూ ఉంది. ఈ సామాజిక పరిణామం కూడా భాష మీద ప్రభావం వేస్తూ ఉంది.

వృత్తులలో విస్తృతమైన మార్పులు వచ్చాయి. మాండలిక వృత్తి పదకోశాలలో నాలుగు ఐదు దశాబ్దాల క్రితం సేకరించిన పదాలు నేడు చాలా వరకు కనిపించవు. కారణం వ్యవసాయం చాలా వరకు యాంత్రీకరణ అయింది. దానికి సంబంధించి చేసే వడ్రంగం పని చెక్కపనిముట్లు పోయినాయి. మరనాగళ్ళు ఇనప నాగళ్ళు వచ్చాయి. దీని కారణంగా వ్యవసాయ వృత్తి పదాలు పోయాయి. వడ్రంగం పనిలో పూర్తిగా యాంత్రికీకరణ వచ్చింది. సాంప్రదాయికంగా ఉన్న వృత్తి పనిముట్లు పోయాయి వాటి పదాలు కూడా పోయాయి. కోయడం దగ్గరనుండి దూగోడు పట్టడం దగ్గరనుండి పిడిశానలు, ఉలులు అన్నీ పోయి బెజ్జాలు కొట్టడం, కూసాలు చేయడం ఈ పనులన్నీ యంత్రాలు చేస్తున్నాయి. వృత్తి జానపదంలో ఈపదాలు అన్నీ అంతరించాయి. ఇలా ప్రతి వృత్తిలోను సంప్రదాయిక పనిముట్లు పనితీరు పోయింది లేదా చాలా మారింది. దానికి అనుగుణంగా భాషకూడా మారింది. స్వర్ణకార వృత్తిలో పదాలు చేనేతలో చాలా పదాలు కొత్తవి ఇంగ్లీషువి వచ్చి చేరాయి.

రెండు మూడు దశాబ్దాల క్రితం దాకా ధాన్యం కొలతలు, ద్రవం కొలతలు దూరం కొలతలు తెలుగులో ఉండేవి. ధాన్యం కొలతలు గిద్దె, సోల, తవ్వ, మానిక వంటి పదాలు పోయి కిలోలు వచ్చాయి. ద్రవం కొలతులు కూడా లీటర్లు వచ్చాయి. బరువు కూడా శేరు అర్ధశేరు, వీశె, కట్టు, మణుగు వంటి సంప్రదాయక పదాలు వ్యవహార లుప్తం అయ్యాయి. అన్నీ కిలోలు, గ్రాములే జానపద వ్యవహారంలోనికి వచ్చాయి.

పైన చెప్పిన అన్ని ప్రభావాల కారణంగా జానపద భాషలో వచ్చిన పరిణామాన్ని ఒక సారి గమనించవచ్చు. పైన భద్రిరాజు కృష్ణమూర్తిగారు చెప్పిన ఎనిమిది విధాల వైవిధ్యాలు ఇప్పుడు జానపద భాషలో కనిపించడం లేదు. వారు శిష్ట భాషకి జానపద భాషకి మధ్యనున్న వైవిధ్యాలను చెప్పడానికి ఎనిమిది విధాల భిన్నత్వాలను సూచించారు. వారు చెప్పిన ఎనిమిది విధాల జానపద భాషాలక్షణాలు గమనిస్తే నేటికి ఉన్న పరిణామాన్ని చూడవచ్చు.

1. జానపద భాషలో ఒత్తులు నిలవవు అని ఉన్న సూత్రీకరణలో ఆ పరిస్థితి పూర్తిగా లేదు. ఒత్తులు నిలిపి మాట్లాడే వారి సంఖ్య బాగా పెరిగింది.

సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడలేరు

2. హకారం పోకుండా చాలా సందర్భాలలో నిలబడుతూ ఉంది.

3. పదాది వకారం నిలబడి స్పష్టంగా పలికే సందర్భాలు ఎక్కువగా ఉంటున్నాయి.

4. సంయుక్త హల్లుల స్థానంలో ద్విత్వాక్షరాలు పలకడం కొంత తగ్గింది సంయుక్తాక్షరాలను పలకడం పెరిగింది.

5. శ ష స ల భేదం విషయంలో పెద్ద మార్పు రాలేదు. చివరికి నగరంలోని వ్యవహారంలో కాని టీవీ యాంకరమ్మల భాషలో కాని ఎక్కడ శ పలకాలి, ఎక్కడ ష పలకాలి, ఎక్కడ స పలకాలి అనే విచక్షణ ఇంకా పెరగలేదు.

టీవీ యాంకరమ్మల కృతక భాష చాలా సందర్భాలలో జానపద భాషలో అనుకరణకి లోనవుతూ ఉంది.


6. మూర్ధన్యాక్షరాలు స్పష్టంగా పలికే విధానం పెరిగింది కాని ఇంకా వాల్లు, వీల్లు, పల్లెం, వాన్ని అని పలికే తీరు ఇంకా ఉంది.

ఆచార్య కృష్ణమూర్తిగారు జానపద భాషకు సూచించిన ప్రమాణాలు పూర్తిగా నశించి శిష్టవ్యవహార రూపాలు జానపద భాషలోనికి రావడం ఇంకా పూర్తిగా జరగలేదు. కాని ఆయన సూచించిన నాటి రూపాలు కూడా పూర్తిగా నిలవలేదు. చాలా మార్పులువచ్చాయి.

జానపద భాషలో వచ్చిన ప్రధానమైన పరిణామం పదాల ఉచ్చారణలో శిష్టరూపం రావడం అన్నది అంత ఎక్కువగా జరగలేదు. విద్యావ్యాప్తి ఎక్కువగా ఉన్నా ఉచ్చారణ పాత ఉచ్చాచరణలు ఇంకా గణనీయంగా నిలిచే ఉన్నాయి. కాని వచ్చిన పెద్దమార్పు ఏమంటే సంప్రదాయ దేశీయ పద సంపద బాగా తగ్గి వాటి స్థానంలో ఇంగ్లీషు పదాలు చాలా విరివిగా వచ్చి చేరాయి. జీవన విధానంలో చాలా కోణాలలో ఈ ఇంగ్లీషు పదాల వినియోగం బాగా పెరిగింది. అంతే కాదు టీవీ అనేది దేశ వ్యాప్తంగా ఒకే విధమైన పదసంపద పెరిగేలా చేస్తూ ఉంది. ఉత్తర భారతంలో వాడే చాలా హిందీ పదాలు ఆహారం భాషలో వచ్చిన మార్పుల కారణంగా ఇక్కడ దక్షిణాది భాషలలో కూడా వచ్చి చేరింది.

తెలుగు జానపద భాషలో వచ్చిన పరిణామాన్ని సరిగ్గా విస్తృతంగా అంచనా వేయడానికి అధ్యయనం చేయడానికి పెద్ద ప్రయత్నమే జరగాలి. రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రాజెక్టు పెట్టాలి. కోర్ ప్రాంతంలో పెరిఫెరీ ప్రాంతంలో ఎంపిక చేసే విధంగా కొన్ని గ్రామాల్ని శాస్త్రీయంగా ఎంపిక చేసుకొని అక్కడ కొన్ని రోజుల పాటు ఉండి వివిధ సందర్భాలలో వ్యక్తమయ్యే పద సంపదని సేకరిస్తే తెలుగుపదాలు ఎన్ని వందలు వ్యవహార లుప్తం అయ్యాయి.

ఎన్ని ఇంగ్లీషు పదాలు, హిందీ పదాలు జానపద వ్యవహారంలోనికి ఇటీవలి కాలంలో వచ్చి చేరాయి అనే విషయం క్షుణ్ణంగా తెలుస్తుంది. ఈ అధ్యయనం వీలైనంత త్వరగా జరిగితే చాలా మంచిది. ఈ పరిశోధన సమగ్ర నిఘంటు నిర్మాణానికి కూడా బాగా వినియోగపడుతుంది.



డా॥పి. శివరామకృష్ణ (శక్తి)
94414 27977

సాహిత్యం, సమాజం, సాధికారిత 'గేర్లు మార్చాలి'

ఉద్యోగులకు ప్రజలకు కావలసిన చదువు చెప్పే స్వతంత్రం లేదు. బానిస చదువులు చదివిన వాళ్ళకు ప్రజల చదువుమీద ఆసక్తి లేదు. బూర్జువా చదువులు చెపుతూ విప్లవాల గూర్చి కొందరు గర్జిస్తుంటే, సాహిత్యసభలలో కొందరు పరవశిస్తున్నారు. ఇటువంటి మాయజలతారుసోకులతో మురిపిస్తున్న ఉత్సవ విగ్రహాలనుండి బతుకుతెరువులకు మూలాధారాలైన మూలవిరాట్టులు జానపద వాఙ్మయం, కళలను నిలబెట్టుకోవాలి. పారిశ్రామికవిప్లవం తరువాత ఉత్పత్తిసాధనాలన్నీ పెట్టుబడి దారుల వశమౌతున్న తరుణంలో, ప్రపంచ కార్మికులారా ఏకం కండి అని పిలుపునిస్తే, నేడు సుస్థిర అభివృద్ధి కోసం, వికేంద్రీకరణ ద్వారా ఉత్పత్తి సాధనాలను సొంతం చేసుకోడానికి ఉద్యమించాలి.

మార్క్సిస్ట్ విమర్శకుడు త్రిపురనేని మధుసూదనరావు(తిమరా), తెల్లవాళ్ళు రాకముందు గల తెలుగు సాహిత్యం, సంస్కృతిని గూర్చి వివరిస్తూ 'మొత్తం సాహిత్యం మీద మౌఖిక సాహిత్య ప్రభావం బలంగానే ఉంది' అని నొక్కి చెపుతూ, నాటి శృంగారచర్చలు స్త్రీ విముక్తి ఉద్యమంగా పరిణమించేవి అంటారు. తెల్లవాళ్ళ విద్య, ఉద్యోగాలు మనలను ఎలా బానిసలను చేసాయో, లిఖిత (రాత) సాహిత్యం ఎలా ప్రజలకు దూరం కాసాగిందో వివరిస్తారు. కవితా విప్లవాలలో జానపద వాఙ్మయం చేర్చకపోవటాన్నిదుయ్యబడతారు. కొడవటిగంటి ఈ పరిణామాలకు నిరుత్సాహ పడతాడు. కానీ యానాది రాఘవయ్యగారు ఈ పరిణామాలగూర్చి విస్తృతంగా రాయ టమేకాక, గిరిజనుల విముక్తికి తనజీవితాన్ని అంకితం చేసారు.

'జానపద వాఙ్మయంలో తెలుగు స్త్రీల సాహస పరాక్రమాలే కాక ప్రణయ జీవితంలో కూడా స్వేచ్ఛా, మానవతా స్ఫూర్తి కనిపిస్తాయి (107) పదకవిత్వం పాలక వర్గాల కవిత్వం కాగా, సంస్కృతీకరణ దాస్యం లేదుకాబట్టి జానపదకవిత్వం సూటిగా వచ్చింది... మొత్తం సాహిత్యం మీద మౌఖిక సాహిత్య ప్రభావం బలంగానే ఉంది'.

(నాయకరాజుల కాలంలో) 'కుల సంబంధాలలో దూరం తగ్గిపోయింది. స్త్రీ పురుష సంబంధాలలో కొంత స్వేచ్ఛా, శృంగార సమస్యల బహిరంగ చర్చ కనిపిస్తుంది' (186) 'మధ్యలో వలస వాదులు వచ్చి మొత్తం సామాజిక వ్యవస్థను కంపింప చేయకపోతే స్వేచ్ఛాభోగ ఉద్యమం స్త్రీ విముక్తి ఉద్యమంగా పరిణమించేది'.(182) అంతేకాదు 'లేఖనప్రక్రియను మాత్రమే కవితా విప్లవాలకు చోదక శక్తిగా చెప్పటం అర్ధరహితం.లేఖనప్రక్రియ కవిత్వం కోసం పుట్టదు. శారీరక మానసిక శ్రమవిభజన నుంచి ఏర్పడుతుంది'.(74.) లిఖిత, జానపద సాహిత్యాల పాత్రను,హద్దులను, ప్రత్యేకతలను స్పష్టం చేస్తారు.

'ప్రజాస్వామ్యం పేరుతో బూర్జువా నియంతృత్వాన్ని అభ్యుదయ వాదం సమర్ధించింది. మధ్యే మార్గంగా సంస్కరణ వాదాన్ని చేపట్టటంతో అవకాశ ధోరణులు ప్రబలం అయ్యాయి. 'The bourgeoisie has stripped off its halo hither to honored and looked up to reverent awe. It has converted physician the priest, the poet, the man of science into its paid wage laborer Ñ.(Marx - Engels; Manifesto) సాహిత్యం అమ్మకపు సరుకుగా మారిపోయింది.కళవ్యాపార కళగా మారిపోయింది. వెన్నెముక లేని మధ్యతరగతి జీవితం సాహిత్యంలోకి ప్రవేశించిది. 117.వాళ్ళు (నవలా రచయితలు) వ్యావహారిక భాష దగ్గరికి తీసుకరావటంకాక, వ్యావహారిక భాషనే సాహిత్య భాషగా మార్చారు. తెలుగు ఇంగ్లీష్ పదాల కలయిక, వాక్య నిర్మాణం లో ఇంగ్లీష్ వాక్యనిర్మాణ పద్ధతులను ప్రవేశ పెట్టి వ్యావహారిక భాషను ప్రజలకు దూరం చేసారు...(118, సాహిత్యంలో వస్తుశిల్పాలు. త్రిపురనేని మధుసూదనరావు. 1997)

కొడవటిగంటి కుటుంబరావుకూడా ఇటువంటి అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ నిరుత్సాహపడతాడు ('పల్లెటూళ్ళలో జనం నిత్యజీవితంలో వాడే ప్రయోగాలూ పదజాలము తెలియని పేరుపడ్డ రచయితలు చాలామందిమి ఉన్నాం. మధ్య తరగతి మిధ్యా ప్రామాణిక భాష వొకటి ఆధిపత్య భాషగా స్థిరపడటం మొదలైంది. ఈ కాలపు అభ్యుదయ సాహిత్య కారులు రాజకీయ సామాజిక ఆర్ధిక రంగాల మీద దృష్టి పెట్టినంతగా భాషమీద దానిగతి తార్కికతమీద దృష్టి పెట్టలేదు. 61.

విప్లవాల సంగతి అటుంచి చిన్న చిన్న సంస్కరణలను కూడా సాహిత్యం చెయ్యలేదు. జీవితం దిగబెరుకుతున్నప్పుడు, సాహిత్యం ఎగబెరకదు'. 96.ప్రజాసాహితి కొ.కు శతజయంతి ప్రత్యేక సంచిక. 2009)

యానాది రాఘవయ్య గారు బ్రిటిష్ దమన, దండ నీతి బలహీన వర్గాలను ఎలా బలితీసుకున్నాయో 'యానాది'లో చిత్రిస్తారు. ఇది ఎవరి తప్పు అని నిలదీస్తారు. ('బ్రిటిషు ప్రభుత్వం మన అనాది నీతులను మంటగలిపి కొత్త నేరాల జాబితా మనకు అంటగట్టినప్పటినుండి, ప్రతిదీ నీదా, నాదా అనే గీటురాతికి లోబడవలసి వచ్చింది. ఎవరూకష్టించి పండించని చెరువు చేపలు, కప్పుతుంగలు, అడవి కట్టెలు, సవకచెట్ల తోపులు, పోరంబోకుల ఫలితాలు, ఈ పంచాయతీరాజులు రాకమునుపు పేద సాదా అనుభవించు చుండిన

పుడు, యానాదికి తిండి కరువే లేకుండెను. అతని సంసార బలగము బరువే కాకుండెను.

అప్పటికీ అతడు తిన్నది నాగజెముడు పండ్లు,నివసించినది కాలువ కట్టన. తాగినది దొరువునీరు, కట్టినది పారవేసిన పరాయి కట్టుగుడ్డ, అట్టి నిరపరాధికి, నిష్కామకర్మికి, ఒకేసారి ఇద్దరు పెండ్లాలు ఉండకూడదని, బొట్టుకట్టని స్త్రీ తోడి కలయిక వ్యభిచారమని ఏ పనిచేయక, స్థిరనివాసము ఏర్పరచు కొనక, తిరుగుబోతుగా నుండుట, ఎవరికీ అపాయము కానప్పటికీ శిక్షార్హమని, దిసమొలతో తిరుగుట నేరమని, గ్రామాన్ని వదిలి మరో గ్రామానికి పోవటం పెద్దనేరమని మొదలగు అనేకనేరాలను అతని నొసటిపైన మనం రాస్తే అది ఎవరి తప్పు? ('యానాది' పేజి 118.ఆంధ్ర రాష్ట్ర ఆదిమ సేవా సంఘ ప్రచురణ 1974).

కోర్టులో గిరిజనులు పడే తబ్బిబ్బులను గిడుగువారు పేర్కొంటే, న్యాయవాదియైన రాఘవయ్యగారు కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తారు.

ఇంత స్పష్టమైన అవగాహనతో, సమకాలికులు పనిచేసిన ఉదాహరణలుండగా, హక్కుల ఉద్యమాలు కప్పగంతులు వేస్తున్న జాడలను బాలగోపాల్ ఇలా కనుగొంటారు. 'కమ్యూనిస్ట్ ఉద్యమం నుండి వచ్చిన అనేక అభిప్రాయాలు పౌర హక్కుల ఉద్యమంలో భాగం అయిపోయాయి. అవి ఈ ఉద్యమానికి అవసరమా? ప్రయోజనకరమా? అసలవి సత్యమేనా అని చర్చించకుండా, వాటిని పౌర హక్కుల అవగాహనలో భాగం చేసుకోవటం వల్ల ఈ ఉద్యమం విశాల స్వభావాన్ని సంతరించుకోలేక పోతున్నది. తనదైన అవగాహనను రూపొందించుకోలేక పోతున్నది'.(46).

'తిండి ఉంటె చాలు వాక్ స్వాతంత్రం అక్కరలేదని, వాక్ స్వాతంత్రం ఉంటె చాలు తిండి అక్కరలేదని, హక్కులలో హెచ్చు తగ్గులు నిర్ధారించటానికి జరుగుతున్న చర్చను పౌర హక్కుల ఉద్యమం తిరస్కరించాలి.మనిషి నిండుగా ఎదగటానికి అన్ని హక్కులు అవసరం అని గుర్తించాలి' (78. హక్కుల ఉద్యమం. బాలగోపాల్).

హక్కుల ఉద్యమఅధివక్త భాషావేత్త చామ్స్కీ ఇదే విషయాన్నికాస్త కటువుగా చెప్పాడు. 'పారిశ్రామిక ప్రజాస్వామ్యం ఎంతముఖ్యమో కార్మికులందరికీ అనుభవ పూర్వకంగా తెలుసు. కార్మికులందరూ మార్క్స్ ను చదివే ఈ విషయం తెలుసుకోలేదు. మార్క్స్ పూర్వం నుంచే ఈ భావనుంది. (20 చామ్స్కీ 'ఆలోచనే ఆయుధంగా' ప్రజాశక్తి బుక్ హౌస్).

శ్రామిక సంస్కృతిపై స్పష్టమైన అవగాహనగల తిమరా, 'జానపద సాహిత్యంలో వర్గ స్పృహ ఉంది, వర్గ చైతన్యం లేదు'. (109) అనే నిర్ణయానికొస్తారు. కానీ వర్గచైతన్యం అనాదినుండి జాతి మనసులో లోతుగా నాటుకున్న వైనం మన స్థల పురాణాలు గుర్తు చేస్తూనే ఉన్నాయి. ఇటువంటి (ఆర్కిటైప్స్) ప్రాగ్రూపాలను మార్క్స్ కూడా వాడారు. శ్రీశ్రీ సరేసరి. జాతి సంస్కృతిని నడిపించే నిర్మాణాలను ఆవిష్కరిస్తూ మానవ, భాషాశాస్త్రజ్ఞులు జానపద గిరిజన సాహిత్య విమర్శను (లిటరరీ ఆంత్రపాలజి) తీర్చిదిద్దితే, అస్తిత్వవాదులు లిఖిత సాహిత్య విమర్శను పెంపొందించారు. (నిర్మాణ వాదం మొదట్లో భాషకు సంబంధించినదే. భాష అన్నపుడు మాట్లాడే భాష, రాసే భాష మాత్రమే కాదు, అన్నిరకాల వ్యక్తీకరణ రూపాలుకూడా. (95 సాహిత్య విమర్శపదాల డిక్షనరీ. నళిని)

మార్క్సిస్ట్ దృక్పధంతో జానపదుల, గిరిజనుల పోరాటాలను సమీక్షించిన చరిత్ర కారులు రంప, గూడెం పితూరిలలో సాంస్కృతిక వారసత్వం నిర్వహించిన పాత్రను గుర్తుచేస్తారు.

'In Gudem Rampa case, religion was used to express dissatisfaction with subjugation and frame the terms of deliverance with in a known model that provided symbolic capital to counteract the superior control of economic capital by their oppressors...This was rendered authentic by the encounter of Bodadu with five Pandavas in the jungle, a symbolic mediation of local and national culture that was politically expedient for integration of hill men with the supporters in the plains Ñ.

(Readings in Subaltern Studies Ed. David Ludden 2002.Orient black Swan.)

సాంస్కృతిక వారసత్వంలో, స్థల పురాణాలు, జాతరలు, కొలుపులు, పురా గేయగాథలు ప్రధాన పాత్ర వహిస్తాయి.

నాగరాజులకు మత్స్యరాజులకుగల సహజ వైరాన్ని విశాఖ మన్యంలో మత్స్యగుండం పురాగాథ వివరిస్తుంది.

వస్తుమార్పిడి, సమష్టినిర్ణయంతో నడిచే వ్యవస్థ /విధానం గిరిజనులది. బంగారం, నాణేలు వంటి కృత్రిమ విలువలను వారు మాయగా భావించి విధ్వంసానికి దిగటాన్ని తెలియచేసే ముఖలింగంలో మధుకేశ్వరస్వామి, కారా మాస్టారి యజ్ఞం కథను తలపిస్తుంది.

కానీ వివిధ రూపాలలో నాగరికతదాడి చేస్తుందని, దాన్ని ఎదుర్కోవటానికి కావలసిన నైపుణ్యం, చదువు నేర్చుకోవాలని పూరి క్షేత్రం అక్షర బ్రహ్మకథ బోధిస్తుంది. చదువుతో పాటు, ఇందుకు కావసిన బలగాన్ని, కులాలను కలుపుకుంటూ సమకూర్చుకోవాలని మోదకొండమ్మ కథ, నాగరాజుల మత్స్యరాజుల కథలాగే,' పంచ పాండవుల పంట దుర్యోధనుడి వంట, కొండవారిపంట – దిగువ వారి వంట'కు పోతున్నప్పుడు జరుగుతున్న దోపిడీని గిరిజన భారతాన్ని వర్ణించే నందిపండుగ పాట వివరించి, తంతుద్వారా మాజిక్ రియలిజం శిల్పంతో సుఖాంతం చేస్తుంది.

అయితే చదువు నేర్చుకోవాలనే అక్షర బ్రహ్మకద ఒక తంతుగా మారితే, ప్రభుత్వం 'సంతోష చంద్రశాల' 'ఆటబడి – పాటబడి' 'చదువు కొత్తలు' వంటి ముద్దుపేర్లుపెట్టి, సార్వత్రిక విద్యపేరిట గిరిజనుల ఆటపాటలను పక్కన పెట్టి, 'పల్లవు' చదువులను గిరిజనుల మీద రుద్దసాగారు.వీరి రచనలలో హైకూలు దొర్లుతాయి కాని గిరిజనుల సాంస్కృతికవాసనలేమీ కనిపించవు.

విశ్వవిద్యాలయాలలో జానపద విజ్ఞానం బోధించేవారుకూడా మానవ, భాషాశాస్త్రాలు వృద్ధిచేసిన విమర్శనాసంప్రదాయం, (అంబేద్కర్ సార్వత్రిక విద్యాలయం ఒక అధ్యాయంగా చేర్చినా) ప్రచారానికి నోచుకోలేదు. మానవశాస్త్ర వేత్తలకు సాహిత్యం అక్కరలేదు.

(తరువాయి 27 వ పుటలో)

ముఖచిత్రకథనం

సన్నిధానం నరసింహశర్మ
9292055531

నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం స్ఫూర్తి ఇప్పటికీ అవసరమే!



కందుకూరి వీరేశలింగంగారు, భార్య రాజ్య[redacted]

బాల్య వివాహాలు ఇప్పుడు జరగడంలేదు నిజమే! వాటికి వ్యతిరేకంగా వర్తమానకాలంలో ఉద్యమం అక్కరపడదు. స్త్రీ పునర్వివాహాలు ఇప్పుడు సమస్యకాదు. దాని గురించి ఉద్యమం నేడక్కర పడదు. ఇందువల్ల వీరేశలింగం ప్రబోధాలు స్ఫూర్తి నేటికి అవసరం లేదనుకుంటే – అది పాక్షిక ఆలోచనా సంకుచితత్వమే అవుతుంది. కందుకూరి వీరేశలింగం పంతులుగారి కాలాన్ని భావించుకుని ; నాటి ప్రధాన సమస్యలైన వాటిని ఎదుర్కోడంలో ఆయన ఆరాటాలూ పోరాటాలూ, నమ్మినవాటి పట్ల కుదురుతలపులు తలచుకొంటే ఒడలు జలదరిస్తుంది. చేతులెత్తి దండం పెట్టాలనిపిస్తుంది.

ప్రజల్లో ఛాందసులు బానిస తలంపులు ; మత పీఠాధిపతుల గిరి గీసుకుని గుండ్రంగా తిరిగే మౌఢ్యాలు, ముందు మేలు చూపే వ్యవస్థలో కొందరు ధర్మశాస్త్రాలకు వక్రభాష్యాలు చేసే ధోరణులు; కొత్తలకు స్వాగతమెత్తడంలో సమకాలీన ప్రాపంచిక జీవన దృక్పథాలనుచూసుకోకపోవడం – ఇటువంటి ఒకానొక సామూహిక వ్యతిరేక వాతావరణంలో ఆయన ప్రణాళికాబద్ధ క్రియాత్మక సమర పాత్ర ఆషామాషీ కాదు;

ఓరోరీ జంగమా వీరేశలింగమా అని అంటూ దుమ్మెత్తి పోయడాలుండేవి. పాడయిపోయిన వాళ్లు ఆయన్ను పాడైపోతున్న వాడిగా భావించడం. అల్ప సంఖ్యాకులైన ఆనాటి ప్రగతిశీలురు ఆయనకు తోడ్పడుతుంటే వారిని నిరుత్సాహ పరచడం, భయపెట్టడం, వెలివేయడం. స్త్రీ పునర్వివాహాలు జరిపించేటప్పుడు కావళ్లతో మంచినీళ్ళు తెచ్చేవారినీ వారించడం. కందుకూరి ఇల్లాలు రాజ్యలక్ష్మమ్మగారే తానే గోదావరికి వెళ్ళి బిందెలతో నీళ్ళు తేవడం ఇటువంటివెన్నో జరిగాయి.

ముక్కుపచ్చలారని వారికి బాల్య వివాహాలు చేయడం వీరేశలింగాన్ని కలచివేసింది. స్త్రీ పునర్వివాహాల్ని ఆయన అంగీకరింప జేయడంలో ఆయనకు సంప్రదాయపు వ్యక్తిగా చెబితే తప్పులేదేమో.

ధర్మశాస్త్రాలు లోతుగా చదివి, కువ్యాఖ్యాన దురంధురుల్ని ఆ ధర్మశాస్త్రంలోని అంశాలనే ఎత్తిచూపి స్త్రీ పునర్వివాహాలు శాస్త్ర సమ్మతమని వాదించడంలో ఆయననైపుణ్యం పాండిత్య పునాది నుండీ పుట్టింది.

మనం ఇక్కడ ఓ అంశాన్ని గమనించాలి. వివాహ సంస్కరణ అంశాల్లో ఆయన ఏకకుల దృష్టి వుందనేది వాస్తవం. అయితే ఆ కులీనుల ఛాందసులతోనే ఆయన భావ సమరం సాగించినదీ గమనార్హం.

హిత సూచని విషయంలో కావచ్చు తనకన్నా ముందే రాయబడిన రంగరాజు చరిత్రను తొలి నవలగా చెప్పకపోవడం కావచ్చు. కొన్నిటిలో తాను ప్రథముడినని చెప్పుకోవడంలో కావచ్చు, సమాంతర సంస్కృతి ఆలోచించడంలో కావచ్చు, స్వాతంత్ర్య సమర సంబంధ జాతీయభావాల్లో కావచ్చు. భోగము వారి విషయంలో పద ప్రయోగ విషయంలో కావచ్చు. – పంతులుగారి పై నున్న విమర్శలు ఆలోచనీయాలూ ఆక్షేపణీయాలూ కావచ్చు. కానీ స్త్రీ విద్యా విషయంలో, స్త్రీ జన సముద్ధరణ విషయంలో దురాచారాల విషయంలో, అశాస్త్రీయ మౌఢ్యాల అంశాల్లో ఆయన సాగించిన సమరాలు అమరాలే! కాకినాడ పి.ఆర్.కళాశాలలో ఉద్యోగానికి దరఖాస్తు చేసిన అచ్చమైన బ్రహ్మ సామాజికుడు, మచ్చలేని చరిత్రగల రఘుపతి వేంకటరత్నం నాయు

డుగారిని కాకినాడ తీసుకువెళ్ళి సిఫార్సు చేసిన అర్హతను గౌరవించిన వ్యక్తి కందుకూరి. తరువాత కాలాల్లో కొన్ని చారిత్రక కారణమే విభేదాలు వచ్చినా నాళం కృష్ణారావుగారిని సామాజిక కార్యకళాపాల్లో కలుపుకొన్న సామాజిక సేవకుడు వీరేశలింగం.

స్త్రీ విద్య ఫలానా స్త్రీలకే వుండాలని ఆయన ప్రవచించిన దాఖలాలు లేవు.

స్త్రీ పునర్వివాహాలు జరగాలని అభిలషించడంలో కందుకూరికి మానవీయ కోణం వుంది. బాల వితంతువులు తరువాత పడుపు వృత్తిలో దిగరాదని; భ్రూణహత్యలు నివారించాలనే ఆలోచనతో స్త్రీ పునర్వివాహాలు జరగాలనేది ధ్యేయం.

"బాల వితంతువులు తమ ద్వితీయ వల్లభులతో నిరంతర సౌఖ్యమనుభవించుచుండగా కన్నులు పండువుగా గనుగొన గలిగెడు భాగ్యమెప్పుడు లభించునా' యని నా హృదయములో నేనెంతో అభిలషిస్తున్నా"నని వీరేశలింగం స్వీయచరిత్రలో రాసుకున్నారు – ఈ వాక్యాన్ని అక్షరాక్షరము పట్టి పట్టి చదివి భాదిస్తే వీరేశలింగం గారికి స్త్రీ జన బాధల, సౌఖ్యాలపట్ల ఉన్న శ్రద్ధ మరొక్కరికెవరికైనా ఇంత లోతు తలపు, సహజానుభూతి ఉందా అనేది మన ఎదల్లో కదలాడుతుంది.

వీరేశలింగం సాహిత్య సేవ : వీరేశలింగం ఒక విద్వత్కవి. సంస్కృత నాటకానువాద దక్షుడు; ప్రజోపయోగ ప్రహసన గ్రంథ రచయిత వ్యాకరణ గ్రంథ రచయిత; శాస్త్రజ్ఞాన రచయిత; ఉపన్యాసాలను కరదీపికలుగా ముద్రించిన ఉద్యమ ప్రచారవాఙ్మయ రచయిత. జీవిత చరిత్రల రచయిత; పూర్వ గ్రంథ సంస్కార కర్త, స్వీయ చరిత్ర కర్త, సంఘ సంస్కరణోపన్యాసాల పొత్తాల కర్త, వీరేశలింగం పంతులు ప్రయోజనకర శతాధిక గ్రంథకర్త.

ఆయన రచనలు తొలినాళ్ళలో 12 సంపుటాలుగా వెలువడ్డాయి. ముఖ్యంగా ఆంధ్ర కవుల చరిత్ర ఆయన పరిశోధనల సంధానాల సంయుక్త శ్రమఫలం. 21 ప్రాచీన గ్రంథాల పరిష్కర్త, ఇన్ని పుస్తకాల రచన మామూలు అంశం కాదు.

ఆయన జీవితం సాహిత్య సృజనకు, సంఘ సంస్కార సేవలకు పత్రికి నిర్వహణకు అంకితమైంది. వీటితో ఊరుకున్నారా? తన ఆశయాలు ఫలాల పంటలు ఎప్పుడూ పండుతూ ప్రజలకు వినియోగపడాలని పదికాలాల పాటుండే సంస్థల్ని స్థాపించారు. ప్రార్థనామందిరం, రాజ్యలక్ష్మీ నివాసం. ఆంధ్రదేశంలోనే ప్రథమ పురమందిరం రాజమహేంద్రవరంలో నిర్మించారు. ఆ పురమందిర నిర్మాణానికి తొలుత కొందరి వద్ద ఆయన విరాళాలు తీసుకోగా ఆయనకు అవినీతి అంటకట్టే ప్రయత్నాలుగా చేయగా బాధపడి ఎవరి సొమ్మును వారికి తిరిగిచ్చేసి కేవలం తనకు తన పుస్తకాల అమ్మకాలపై వచ్చే ధనంతో పురమందిరాన్ని నిర్మించి నిస్వార్థ అభిమాన ధనుడాయన.

చెన్నపురిలో, బెంగుళూరులో సమాజహిత కార్యక్రమాలకై మందిరాల్ని నిర్మించారు. ధవళేశ్వరంలో బాలికా పాఠశాల రాజమండ్రిలో ఆస్తికోన్నత పాఠశాల – ఇలా ఇలా ఎన్నో భవన నిర్మాణ కార్యక్రమాలు చేపట్టి ప్రజాహిత కార్యక్రమాలకు నెలవులుగా చేశారు. వివేకవర్ధనీ ప్రచురణాలయాన్ని నెలకొల్పి రచనోద్యమానికి బాసటగా చేసుకున్నారు.

ఎంతటి గొప్ప ప్రణాళికలు? ఎట్టి పట్టుదల పనితనాలు! ఎంతటి ముందు సేపు చూపులు! ముదుసలితనం వచ్చిన, పీనస జబ్బు వచ్చినా, నమ్మినవారిలో కొందరు దూరమైపోయినా ఒక మొండి పట్టుదలతో సమాజహితకారిణీధ్యేయాలను వదలని మహానుభావుడు.

1937లో చిలకమర్తి లక్ష్మీనరసింహం వీరేశలింగం చరిత్రను చదివితే అందులో వందలకొలది నీటి పాఠాలుంటాయని, వీరేశలింగ స్వీయచరిత్ర పఠనం అంటే ఆంధ్రదేశం యొక్క సాంఘిక చరిత్ర పఠనంగా తెలిపారు.

ఆరుద్రగారు సమగ్రాంధ్ర సాహిత్య చరిత్రలో వీరేశలింగ విరచిత 'పుస్తకాల జాబితా తయారు చేస్తే ఏదో పుస్తకాల వ్యాపారి కేటలాగులా ఉంటుం'దన్నారని తెలిపారు. అంటే కందుకూరి గ్రంథ రచనలకు అంత విస్తృతి వుందనిమాట;

వీరేశలింగం నాస్తికులు కారు. బ్రహ్మ సమాజ ఆస్తికులు విగ్రహారాధన వ్యతిరేకులు ఉపనిషత్తులు ప్రబోధించిన వానిని వాని సారాంశాలను గ్రహించిన 'ఏకేశ్వరోపాసన' ఆయనది.

అంతకు మించి సంఘద్రోహులను 'ఏకేసే' కార్యోపాసన ఆయనది.

భాషాసేవ

భాషా సేవ, సాహిత్య సేవ పరస్పర ఏకమార్గ సంజనితాలే అయినా ప్రత్యేకంగా బాగులెంకగా కూడా కొంత ఆయన పాత్ర వహించకపోలేదు.

వీరేశలింగం – ప్రత్యేకంగా వాడుకభాషతో యుద్ధం చేసేటంతటి గ్రాంధికవాది కాదు, ఒకరకంగా ఆయనది గ్రాంధిక భాషానుసరణమే కాని గ్రాంధిక వాదానుసరణం కాదు, ఆయన 'పటాహఖంకృతుల...అభంగతరంగమృదంగ' గ్రాంధికభాష కాదు...ఒడిదుడుకులులేని ఏకప్రవాహశైలి, స్పష్టభావ ప్రకటన ఆ శైలికి భూమిక. సరళ గ్రాంధిక సౌందర్య దర్శనం కలుగుతుంది.

కందుకూరి 25 ఏళ్ల చిన్న వయస్సులోనే చిన్నయసూరి బాల వ్యాకరణం లోటు పాట్లను ఎన్నగలిగాడు. కొక్కండ వారు పుస్తకాలే కాదు పత్రికలు కూడా గ్రాంధిక శైలిలో ఉండాలంటే దానిని ఖరాఖండీగా ఖండించారు.

పత్రికల భాష గ్రాంధిక ఫణితినున్న
పండితులుగాని వారికి పనికిరావు
పత్రికోద్దేశమే కొఱవడునుదాన
గాన నెపుడు సర్వజనోపకారమొదవ

పామరులకును తెలియంగ వ్రాయవలయు అని నిర్ద్వందంగా తన హృదయాన్ని నాటబలికారు.

తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి

భాష విషయంలో ఉద్యమధారిగా ఆయన కనబడకపోయినా ఒక ఆంతరంగిక తరంగిత ఉద్యమం వుందేమో అనిపిస్తుంది.

అన్నీ పద్య కావ్యాలలో రాయడం పట్ల ఆయనకు కొంత అయిష్టం లేకపోలేదు. తానూ సంప్రదాయమార్గానుసారిగా ఎంత గానో కొనసాగినా సంస్కరణ అంశాలు రాకపోతే కందుకూరి అవరు కదా. అందుకే

"పుస్తకములను సంస్కృత భాషలో వ్రాయుట కంటే దేశభాష లలోనే వ్రాయుట మేలైనపని. అట్టి ఉపయుక్త గ్రంథములను వచన ములలో వ్రాయుట ముఖ్య కార్యము" అని ఆయన సూటిగా అనుభవ జ్ఞానంతో ప్రజావసర గ్రహింపుతోనుడివినాడంటే అది ప్రశంసనీయం కదా! అయితే కవిత్వ గ్రంథాలు వచనేతర రచనలుగా ఉండవచ్చని కూడా ఆయన అభిప్రాయం.

భాషా సాహిత్య సంబంధంగా ఆయనకుగల భావాలకు 'సర స్వతీ నారద సంవాదం' అనే చిన్న పుస్తకమే దాఖలా.

ఆంగ్ల పదాలకు ఆంధ్రపద సృజనలు

కవి, పండితుడు, పత్రికాధిపతి, కావ్యనిర్మాత సంస్కార కావ్య విధాత అయిన కందుకూరికి ఆంగ్ల భాషా పదార్థాలకు సరితూగే సాంస్కృతిక ఆంధ్ర భాషా పద సృజనలు చేసిన భాషా ప్రయోగశీలిగా కూడా స్మరణీయులే.

పరిశోధ దృష్టిగల రచయిత డాక్టర్ అరిపిరాల నారాయణరావు ఏకంవిధ పరసృజనలను పరిశీలించి లెక్కగట్టి 300 అని తేల్చారు.

వీరేశలింగ పదసృజనలు తెలుగు అకాడమీ చేసిన పద సృజ నలు వంటివిగ కనపడినా అకాడమీలూ గికాడమీలు చేయని పనిని ఆ కాలంలో అలా తానుగా చేయడం అవిస్మరణీయం. మచ్చుకు కొన్ని....

ఆంగ్లం – ఆంధ్రం

కలెక్టరు –కరగ్రాహి

సేవింగ్స్ బ్యాంకు బుక్ – రక్షణ నిధి పుస్తకము

పోలీసు ఇనస్పెక్టర్ – పురారక్షక పర్యవేక్షకుడు

డి.ఎస్.పి. – మండల ఆరక్షకాధ్యక్షుడు

రైల్వే – అయోమయమార్గము

బిలియర్డ్స్ టేబుల్ – దంతగోళక్రీడా ఫలకం

ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు – అనుష్ఠాన నియుక్త వాస్తు విద్యా విశారదుడు

స్కూలు ఫైనలు ఎగ్జామినేషన్ – పాఠశాలాంతిమ పరీక్ష

సెంట్రల్ జైలు – మధ్యస్థ కారాగారము

నాన్ అఫిషియల్ విజిటర్ – అనధికార ద్రష్ట

డిస్ట్రిక్టులోకల్ ఫండ్ బోర్డు – మండల స్థలనిధి సంఘము

ఇటువంటివి మరెన్నో ! ఈ అనువాద పద సృజనలు ఈ కాలము వారికి హాస్యము పుట్టించవచ్చు. కృతక భాషానువాద పద సృజనల వల్ల తెలుగు అకాడమీ సైతము కొంత హాస్యము పుట్టించింది. కానీ వీరేశలింగంగారు ఆనాడు ఆ విధంగా ప్రయోగాలు చేసే బుద్ధి నైశత్యానికి ఆనందించి తీరాలి. ప్రత్యేకంగా 'తెలుగు' అనే ఆలోచనలు లేనికాలంలో సంస్కృత వినియోగానికి అలవాటు పడిన కాలంలో ఈ పదానువాదాలు జరిగాయి.

ఇంతకీ ఇంత భాషా సేవ చేసిన వీరేశలింగంగారు తమ స్వీయ చరిత్ర రెండవ ప్రకరణలో "తెలుగు భాషను వృద్ధి చేయవలె నన్న అభిలాషము నాకు మొదటి నుండియు విశేషముగా నుండెను. నేను నా కాలమంతయు భాషాభివృద్ధి నిమిత్తమే ఉపయోగించి పాటు పడిన కొంత వరకు నా అభిలాషము నెరవేఱియుండునేమో" అని రాసుకోడంలో ఆయన హృదయ భావ భాష వెల్లడవుతోంది.

తాను నమ్మకుండా ఏదీ ఆచరించని కందుకూరి వీరేశలింగం వాడుక భాషావాదాన్ని చాలనాళ్ళదాకా, చాలా ఏళ్ళదాకా అంగీకరించ లేదు. ప.గో.జిల్లాలో కొవ్వూరులో జరిగిన ఒక సభలో గిడుగు రామ మూర్తిగారి ఉపన్యాసాన్ని శ్రోతల మధ్య ఎక్కడో వున్న వీరేశలింగం విన్నారట. తలపాగతో ఓ పెద్దాయన వచ్చారని, ఆయన వీరేశలింగం గారని తెలుసుకొని సభా నిర్వాహకులు ఆయనను తోడుకొని వెళ్ళారట! అప్పుడాయన వాడుకభాషా వాదాన్ని నేనూ నమ్ముతున్నానని ప్రకటించారట

భార్య ప్రేమికుడుగా : పంతులుగారి భార్య రాజ్యలక్ష్మమ్మ సాధ్వీమణి అంటే సాధ్వీమణే! భర్త కార్యక్రమాలకు త్రికరణశుద్ధిగా తోడ్పాటునిచ్చిన అచ్చమైన జీవిత భాగస్వామి. అర్ధాంగికే తన స్వీయచరిత్రను అంకితం చేశారు కందుకూరి. భార్య అనాయాసంగా మరణించింది. వృద్ధులైన ఆయన దాన్ని తట్టుకోవడానికి రెండు మూడుసార్లు దైవ ప్రార్థన చేసుకున్నారు. ఆవిడ తెల్లవారు ఝామున చనిపోయిన ఆమెను చూడడానికి ఉదయవేళ వేలమంది జనం రావడం ఆయన్ని ఓదార్చడం వారి పట్లగల ప్రజాభిమానానికి దర్పణం. పురమందిర ధర్మకర్తలలో ఒక క్రైస్తవుడు ఒక ముస్లిము వుండాలని ఆయన రాసి పాటించడం విశాల హృదయ చిహ్నం.

అరడజను కొరతలున్నా, అరుడజన్ల మేలుములున్న చోట్ల తగ్గించుకో కూడదు' అని బంగోరే అనేవారు. వీరేశలింగం జీవిత చరిత్రను గమనించినప్పుడు ఈ వాక్యం గుర్తుకొస్తుంది.

లంచగొండితనం, క్రొత్తక్రొత్త మూఢాచారాలు, ఇంకా శకు నాలు చూసుకోవడం, మహిళా సాధికార కార్యక్రమాలకు అడ్డంకులు. సామాజికపు కుళ్లల ప్రక్షాళణకు – ఇప్పటికీ కందుకూరి స్ఫూర్తి అవసరమే కాదు, అత్యవసరం.

1848 ఏప్రిల్ 16న రాజమహేంద్రవరంలో పుట్టిన పంతులు గారు 1919 మే 27న చెన్నపట్నంలో కీర్తిశేషులయ్యారు.

ఒకటి కాదెన్నో ఉదయించి పెంపొందె
సకలమ్ము వీరేశ సాహిత్య ఖని యందె

– మధునాపంతుల

ఆ ఖనిలో ఎన్నో లోతులు! ఆలోతులలో ఎన్నో సామాజిక చరితల పొరలు? వాటి సమగ్ర దర్శనంలో అదిగో నవయుగ వైతాళి కుడు కందుకూరి రెండు తెలుగు రాష్ట్రాలకు గర్వకారకులు.

వై. ఇంద్రాణి
9246245909

1951 నుండి దేశంలో వయోజన విద్య-ఒక సమీక్ష

మనిషి సర్వతోముఖాభివృద్ధి సాధనలో విద్యది అత్యంత కీలక పాత్ర. ఒక దేశపు అభివృద్ధి, అభివృద్ధిని స్థిరపచడంలో విద్యది ప్రధాన పాత్ర. ఒక్కమాటలో భవ్య భవిష్యత్తుకు తిరుగులేని పెట్టుబడి విద్య. అభివృద్ధి చెందిన దేశాలు అక్షరాస్యతలో ముందున్నాయి, వెనుకబడిన దేశాల్లో నిరక్షరాస్యత ఎక్కువ కాబట్టి ఐక్యరాజ్యసమితి కూడా అభి వృద్ధి ప్రమాణాలలో అక్షరాస్యతను చేర్చింది. 15 దాటిన పెద్దలకు అందించే విద్యను వయోజనవిద్య అంటున్నాం. వయోజన విద్యకు అనేక నిర్వచనాలు.

చదువుకునే వయసులో అవకాశాలు పొందలేకపోయినవారు, ఇప్పుడు చదువుకోడానికి కల్పించే అవకాశం వయోజన విద్య అని చెప్పుకోవాలి. అక్షరనైపుణ్యాలనే కాక, వెనుకబాటుకు కారణాలు తెలుసుకుని, ఎదగడానికి ప్రయత్నించే సామాజికస్పృహను, అవసర మైనవారికి వృత్తినైపుణ్యాలు, జాతీయ విలువల పరిజ్ఞానాన్ని అందిం చేది వయోజన విద్య. వయోజన విద్య కేవలం అక్షరాస్యత మాత్రమే కాదు కాబట్టి దానిని అక్షరాస్యతంగా చెప్పవచ్చు. అందులో జీవన పర్యంత విద్య, నిరంతర విద్య, బడిబయటి పిల్లల విద్య, వెనుకబడిన వర్గాల వారికి కావలసిన విద్య, వీధిబాలలకు విద్య, కార్మికులు మొదలైనవారికి చెప్పే విద్య, అన్ని కూడా భాగాలే. జాతిపిత నిరక్షరా స్యత దేశానికి కళంకం, నిర్మూలించి తీరాల్సిందే అని ఆనాడే పిలుపిచ్చారు.

మన దేశంలో 1951 నుండి వయోజన విద్య - చారిత్రక నేపథ్యం :

ప్రారంభంలో (1948)వయోజన విద్యను సామాజిక విద్య (సోషల్ ఎడ్యుకేషన్) లో భాగంగా భావించారు. తొలి కేంద్ర విద్యా మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వయోజనులకు అందించే విద్య, వారిని విద్యావంతులను చేయడం మాత్రమే కాదు, సమగ్ర, సామాజిక అభివృద్ధి దిశగా చేసే ప్రయత్నం అన్నారు. జనబాహు ళ్యంలో ఉత్పాదకశక్తిని పెంచే ఆలోచనను రేకెత్తింపచేసేది వయోజన విద్య అన్నారు. సెంట్రల్ అడ్వయిజరీ బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్ః వారు సామాజిక విద్య భావనను ఆమోదించి, 1949 ఫిబ్రవరిలో జరిగిన 'కాన్ఫరెన్స్ ఆఫ్ ప్రొవెన్షియల్ ఎడ్యుకేషన్ మినిస్టర్స్' లో చర్చించారు. 1949లో రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలన్న సూచనలు జారీ అయ్యాయి. సామాజికవిద్య మొదటి మూడు పంచ వర్ష ప్రణాళికలకాలంలో (1951-56, 1956-61, 1961-66) మంచి ఫలితాలనే సాధించింది. 3, 4 ప్రణాళికల కాలంలో చర్చల్లోకి వచ్చిన వయోజన కార్యనిర్వాహక విద్యా భావన, 4వ ప్రణాళికలో బలపడింది. 1969లో నేషనల్ బోర్డ్ ఆఫ్ అడల్ట్ ఎడ్యుకేషన్, 1971లో డైరెక్టరేట్ ఆఫ్ అడల్ట్ ఎడ్యుకేషన్ ఏర్పాటు, నాన్ఫార్మల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం ప్రారంభాలతో, ప్రోగ్రాం ఆఫ్ రూరల్ ఫంక్షనల్ లిటరసీ అసోసియేట్ అయ్యింది. దేశసమగ్రాభివృద్ధికి అత్యంత కీల కంగా భావించి 1978 అక్టోబర్ 2న ప్రాధాన్యతా కార్యక్రమంగా నేషనల్ అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం (ఎన్ ఏఇపి)ని ప్రారంభించారు. ఆర్థిక, సామాజిక, స్త్రీ పురుష అంతరాలను తగ్గించడంలో వయోజన విద్య చెప్పుకోదగ్గ పాత్ర పోషించగలదని, 1986లో నేషనల్ పాలిసీ ఆన్ ఎడ్యుకేషన్ (ఎన్ పిఇ) అవసరాన్ని నొక్కి చెప్పింది. 1992లో ప్రోగ్రాం ఆఫ్ యాక్షన్ (పి.ఒ.ఎ) లో నేషనల్ ప్రోగ్రాం ఆఫ్ అడల్ట్ ఎడ్యుకేషన్ (ఎన్ పి ఎ ఇ) ని ప్రకటించారు. దాని లక్ష్యమైన వంద మిలియన్లలో 1990కల్లా 15-35 వయసుగల 40 మిలియన్లు, 1995 కల్లా మరో 60 మిలియన్ల నిరక్షరాస్యులను చదివించడానికి కాలపరిమితిగల అంచెలవారి వయోజన విద్యా కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ ఎన్ పి ఎ ఇ ప్రకారం రూరల్ ఫంక్షనల్ లిటరసీ ప్రోగ్రాం, స్టేట్ అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం (ఎస్.ఎ.ఇ.పి), ప్రోగ్రాం ఆఫ్ అసిస్టెన్స్ టు వాలంటరీ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని భావించారు.

నేషనల్ లిటరసీ మిషన్ 1988 :

సాక్షరత సాధనకు, 1988 మే 5న నినేషనల్ లిటరసీ మిషన్ (ఎన్. ఎల్.ఎం.) ను ప్రారంభించారు. దీనిని నేషనల్ పాలసీ ఆఫ్ ఎడ్యుకేషన్ 1986, నేషనల్ అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంల లోటు పాట్లను పరిశీలించి, దిద్దుబాట్లతో రూపొందించారు. ఈ కార్య క్రమంలో 100 మిలియన్ల పూర్వ లక్ష్యాన్ని 80 మిలియన్లకు కుదిం చారు. 1990 నాటికి 30 మిలియన్ల, మిగిలిన 50 మిలియన్ల నిరక్షరాస్యులను 1995కల్లా అక్షరాస్యులను చేయాలి. లక్ష్య సాధనకు, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖలోని డిపార్టమెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్లో, స్వయం ప్రతిపత్తితో నినేషనల్ లిటరసీ మిషన్ అథారిటీ (ఎన్ఎల్ఎంఎ)ని 1988 జూన్ లో ప్రారంభించారు. మాస్ ప్రోగ్రాం ఆఫ్ ఫంక్షనల్ లిటరసీ (ఎంపిఎఫ్ఎల్), రూరల్ ఫంక్షనల్ లిటరసీ ప్రోగ్రాం, (ఆర్.ఎఫ్.ఎల్.పి), స్టేట్ అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం వంటి కార్యక్రమాలను ఎన్ఎల్ ఎం చేపట్టింది.

అభ్యసన బోధనాసామగ్రి, విధివిధానాల రూపకల్పన, సిబ్బం దికి శిక్షణ, అధ్యయన మూల్యాంకనలు, ప్రయోగాలు, పరిశోధన, సాంకేతిక, విద్యా వనరుల సహకారాన్ని అందించడంకోసం **స్టేట్ రిసోర్స్ సెంటర్స్ (ఎస్.ఆర్.సి.)** లు ఏర్పడ్డాయి.

1988-89 సంపపలో టోటల్ లిటరసీ క్యాంపెన్ (టిఎల్సి) ను, కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాల నేషనల్ సర్వీస్ స్కీమ్

(ఎన్ఎస్ఎస్) విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలపై ఆధారపడి, కేరళలోని ఎర్నాకులం జిల్లాలో, కొట్టాయం పట్టణంలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఇంతలో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1990వ సంవత్సరాన్ని అంతర్జాతీయ అక్షరాస్యతా సంవత్సరం (ఐఎల్ వై) గా ప్రకటించగా, దేశంలో 1990 జనవరి 22న ఐఎల్ వైని ప్రారంభించారు. అప్పటికే సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమం కొనసాగుతున్న ఎర్నాకులం జిల్లాను 1990 ఫిబ్రవరి 4న మొట్టమొదటి సంపూర్ణ అక్షరాస్యతా జిల్లాగా ప్రకటించారు. ఎర్నాకులం జిల్లా, కొట్టాయంల విజయస్ఫూర్తితో కేరళలోని అన్ని జిల్లాలలో అమలు చేసి, 1991 ఏప్రిల్లో సంపూర్ణ అక్షరాస్యతా రాష్ట్రంగా ప్రకటించారు. ఆ విజయాలతో ఎన్. ఎల్. ఎం. తన 80 మిలియన్లకు లక్ష్యాన్ని తిరిగి 100కు పెంచి, 1999కల్లా దేశంలో అన్ని జిల్లాలలో అమలు చేసి, 100 మిలియన్ల నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయాలన్న లక్ష్యాన్ని ప్రకటించింది. టి.ఎల్.సి. విజయాలు దేశంలో జీవన పర్యంత విద్యా కార్యక్రమాల ఏర్పాటుకు బాటలు వేశాయి. వయోజనవిద్యలో 1. సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమం (టిఎల్స్), 2. అక్షరాస్యతానంతర కార్యక్రమం (టిఎల్పి), 3. నిరంతర విద్యా కార్యక్రమం (సిఇపి)లు భాగాలు. జీవన పర్యంత విద్యా కార్యక్రమం, 9వ పంచవర్ష ప్రణాళికా కాలంలో (1997-2002) ప్రారంభమై 11వ పంచవర్ష ప్రణాళికా కాలంలో (2007-12) సెప్టెంబర్ 2009 వరకు కొనసాగింది.

సాక్షరభారత్ కార్యక్రమం(ఎస్.బి.పి) - 2009:

ఎన్ఎల్ ఎం ఎన్ని ప్రయత్నాలు చేసినా నిరక్షరాస్యత పెను సమస్యగా ఉండి పోయింది. 2001 జనాభాలెక్కల ప్రకారం, 15 సం॥లు దాటిన నిరక్షరాస్యులు 259. 52 మిలియన్లు (సుమారు 26కోట్లు). అదే సమయంలో భారత ప్రభుత్వం అక్షరాస్యురాలైన మహిళ - ఒక నిర్ణయాత్మక శక్తిగా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించ గలదనిబీ మహిళా సాధికారత, అక్షారస్యతలు కీలక ప్రాధాన్యతలుగా ప్రకటించింది. 11వ పంచవర్ష ప్రణాళికలో పేర్కొన—భాగస్వామ్య అభివృద్ధి నినాదం స్ఫూర్తి.. స్త్రీపురుష అక్షరాస్యతా తేడాను తగ్గించకుండా సాధ్యపడదు కాబట్టి, మహిళా సాధికారతకు ప్రాధాన్యమిచ్చారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి.. అక్షరాస్యత ముఖ్యంగా మహిళా అక్షరాస్యతతోనే సాధ్యమని భావించిన ఎన్ఎల్ఎం మహిళా అక్షరాస్యతకు ప్రాధాన్యతనిస్తూ దిద్దుబాట్లతో సాక్షరభారత్ కార్యక్రమాన్ని ప్రకటించారు. కార్యక్రమాన్ని అప్పటి ప్రధాని డామన్మోహన్ సింగ్ 2009 సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని లాంఛనంగా ప్రారంభించారు. 2009 అక్టోబర్ 1 నుండి అమల్లోకి వచ్చింది. చదువుకునే అవకాశం పొందని, వయసు దాటిపోయి, ప్రస్తుతం అక్షరాస్యత, ప్రాథమిక విద్య, వృత్తి విద్య, భౌతిక, మానసిక అభివృద్ధులకు సంబందించిన విద్య, కళలు, శాస్త్రీయ పరిజ్ఞానం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఇట్లా ఏ అంశంలోనైనా నైపుణ్యాలు పెంచుకోవాలనుకుంటున్న వారికి అవకాశాలను అందించే ఏర్పాట్లు జరిగాయి. సరికొత్త సాక్షరభారత్ కార్యక్రమ ప్రాథమిక లక్ష్యం 80% జాతీయ అక్షరాస్యత. స్త్రీపురుష అక్షరాస్యతా తేడాను 10%నికి తగ్గించడం, వివిధ ప్రాంతాలు, సామాజిక వర్గాల మధ్య తేడాలను కనిష్టం చేయడానికిగాను మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు ఇంకా ఇతర వెనుకబడినవర్గాలపై దృష్టిని కేంద్రీకరించారు. 11వ ప్రణాళిక అంతానికి లక్ష్యాలను సాధించలేక పోవడంతో 12వ పంచవర్ష ప్రణాళికకు కొనసాగించారు. ఆపైన మరో సంవత్సరం కొనసాగించారు.

ఇప్పటివరకు మన కార్యక్రమాల ప్రాధాన్యతలు-లోపాలు:

1.సామాజిక విద్యా కార్యక్రమాల అవగాహన, సామాజిక భాగస్వామ్యం, సామాజిక కార్యకర్తలు, వయోజన విద్యా శాఖ శిక్షణ, ఇతర కార్యక్రమాలకు ఉద్దేశించిన జనతా కాలేజీలు 3వ పంచవర్ష ప్రణాళిక తరువాత ఏమయ్యాయో తెలియదు.

2. మొదటి 3 పంచవర్ష ప్రణాళికలలో సహకారోద్యమం, విస్తరణ ప్రాజెక్టులతో నడిపించిన సామాజికాభివృద్ధి(కమ్యూనిటి డెవలప్మెంట్) కార్యక్రమాలు ఆ తరువాత లక్ష్యాలనుండి దారిమళ్లాయి.

3. సర్వతోముఖ అభివృద్ధికి ఉద్దేశించిన సోషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం మూడు ప్రణాళికల్లో రేకెత్తించిన ఉత్సాహం చల్లబడి చివరికి వయోజన విద్యకు పరిమితం అయిపోయింది.

4. మొదటి మూడు ప్రణాళికల కాలంలో అనుకున్న ఎన్.జీ. ఓలు, పంచాయితీరాజ్ వ్యవస్థలు, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం స్థిరంగా నిలవలేదు.

5. నేషనల్ ప్రోగ్రా ఫర్ అడల్ట్ ఎడ్యుకేషన్ - ఎన్.పి.ఎ.ఇ. ఒక అనియత విద్యా కార్యక్రమం, ప్రయోగాలు,అధ్యయనాల తరువాత రూపొందిన మొదటి వ్యవస్థీకృత కార్యక్రమం. విశ్వవిద్యాలయాలలో వయోజన విద్యా విభాగాలను ప్రారంభించాయి. ఫలితాల నివేదికలు అందలేదు. యు.జి.సి. పట్టికల్లో కోర్సులు ప్రారంభించినట్లుగా మాత్రమే తెలుస్తోంది.

6. ఫార్మల్ ఎడ్యుకేషన్ అండ్ ఫంక్షనల్ లిటరసీ (ఎఫ్.ఇ.ఎఫ్.ఎల్.పి.) కార్యక్రమం ఆహారోత్పత్తి, హరిత విప్లవాలలో కొంత సాధించగలిగినా, దేశం వ్యవసాయోత్పత్తులలో అనుకున్న స్వయం సమృద్ధి సాధించలేకపోయింది. గోధుమ, చెరుకు, వరి, పప్పుధాన్యాల ఉత్పత్తి విషయంలో చాలా దేశాల కన్నా వెనుకే ఉండిపోయింది. 100 జిల్లాల (తరువాత 146 జిల్లాలను విస్తరించారు) లో కార్యక్రమాన్ని అమలు చేయాలన్న లక్ష్యం అమలయ్యాక ఈ కార్యక్రమాన్ని నిలిపేశారు.

7. వ్యవస్థీకృత నిర్మాణంతో ప్రారంభించిన నేషనల్ ప్రోగ్రాం ఫర్ అడల్ట్ ఎడ్యుకేషన్ (ఎన్.పి.ఎ.ఇ) 10 ఏండ్లపాటు కొనసాగాక అప్పటివరకు ఉన్న వ్యవస్థను మధ్యంతరంగా 1988 లో మార్చేశారు.

8. వయోజన విద్యా కార్యక్రమాలను వేగవంతం చేసేలా పరిశోధన, మూల్యాంకనం, సాంకేతికాది సహకారం అందించేందుకు -1991, జనవరిలో ఏర్పాటు చేసిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్

భాష లేకపోతే భావంలేదు;నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది

అడల్ట్ ఎడ్యుకేషన్ (ఎన్ఐఏఇ) అ అతీగతీ లేదు.

9. విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు చురుకుగా పాల్గొన్న కేరళ విజయ స్ఫూర్తితో 14 రాష్ట్రాలకు సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమాన్ని విస్తరించి, 30 లక్షల స్వచ్ఛందబోధకులతో, 3 కోట్ల మందికి చదువు చెప్పించారు కాని ఆస్థాయి ఫలితాలు రాలేదు.

10. నూతన అక్షరాస్యులకు వృత్తినైపుణ్యాలు గరపడానికి ప్రారంభించిన 32000 జనశిక్షణ నిలయాల గతి తెలియరాలేదు. ఆ తరువాత వచ్చిన శ్రామిక విద్యా పీఠాల పేరును జనశిక్షణ సంస్థానాలు (జెఎస్ఎస్)గా మార్చారు. వీటిలో కొన్ని రద్దుకాగా 250 జె.ఎస్.ఎస్.లను 2018 మార్చి తరువాత నైపుణ్యాల అభివృద్ధి మంత్రిత్వశాఖకు బదిలీ చేశారు.

11. సాక్షర్ భారత్ కార్యక్రమంలో 70 మిలియన్ల నిరక్షరాస్యులను (60 మిలియన్ల మహిళలు) అక్షరాస్యులను చేయాలన్నది లక్ష్యం కాగా, ఆయా జనాభా ప్రాతిపదికన 14 మిలియన్లు ఎస్సిలు, 8 మిలియన్లు ఎస్టీలు, 12 మిలియన్లు బిసిలు, 36 మిలియన్లు ఇతరులు ఉండాలని నిర్దేశించుకున్నారు. అయితే ఇది ఆయా వర్గాలలో ఉన్న వాస్తవ నిరక్షరాస్యుల సంఖ్య ఆధారంగా చేసుకున్న లక్ష్యం కాదు. 410 జిల్లాలలోని కేవలం గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే కార్యక్రమాన్ని అమలు చేయడం వల్ల పట్టణాల్లో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉన్న మురికివాడలు, వెనుకబడిన ప్రాంతాలను వదిలేయడం జరిగింది. 2001 జనాభా లెక్కల ప్రకారం దేశంలో పట్టణ ప్రాంత మురికి వాడల్లో మొత్త 50 మిలియన్ల నిరక్షరాస్యులు ఉన్నారు. పైగా 11 ప్రణాళికాంతం, 2012 మార్చినాటికి 70 మిలియన్ల మందిని అక్షరాస్యులను చేయాలన్న లక్ష్యం .12 వ పంచవర్ష ప్రణాళికలో కూడా కొనసాగింది. ఎన్ఐఓఎస్ పరీక్షల లెక్కల ప్రకారం 2010 ఆగస్టు నుండి 2018 మార్చ వరకు మొత్తం 16 విడతల్లో పరీక్ష రాసిన 101 మిలియన్ల మందిలో 76.1 మిలియన్లు ఉత్తీర్ణులయ్యారు. ఆ రకంగా ఆరేళ్ళు ఆలస్యంగానైనా సాక్షరభారత్ లక్ష్యం 70 మిలియన్లను సాధించినట్లే. కానీ ఈ లెక్క వాస్తవాతీతంగా అనిపిస్తున్నది.

13. 2011 జనాభా లెక్కల్లో తేలిన 285 మిలియన్ల నిరక్షరాస్యుల్లో, పట్టణాల్లోని 1.08 లక్షల మురికివాడల్లో 47.85 మిలియన్లు ఉన్నారు. సాక్షరభారత్లో పట్టించుకోని వీరిని ఇండియా యట్ 75 లేదా రోటరీ ఇండియా లిటరసీ మిషన్ల ద్వారా పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్ షిప్ కింద అక్షరాస్యులను చేసే ప్రయత్నం, ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. వీటన్నటిని చక్కదిద్దడానికి 2018 మార్చి తరువాత కార్యక్రమాన్ని నిలిపివేయండం జరిగింది. సాక్షరభారత్ కార్యక్రమాన్ని దిద్దుబాటుతో పునరుద్ధరించడానికి సమయం పడుతుంది. ప్రస్తుత పరిస్థితిలో మౌలానా ఆజాద్ తాలీం ఎ–బాలిఘన్, ఎలక్టోరల్ లిటరసి, ఫైనాన్షియల్ లిటరసీ, డిజిటల్ లిటరసీ, లీగల్ లిటరసీ, ఈక్వవలెన్సీ వంటి సృజనాత్మక కార్యక్రమాలను అమలు చేయడం కష్టం.

71 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో విద్యకు సంబంధించి రెండు నేషనల్ పాలసీలను, 12 పంచ వర్ష ప్రణాళికలను, 3 వ వార్షిక ప్రణాళికలను (పంచవర్ష ప్రణాళికలకు సెలవు ప్రకటించినప్పటి) వచ్చాయి. 14 ఆర్థిక కమీషన్లను, 2 ఎడ్యుకేషన్ కమిషన్లను , కేంద్ర సలహా సంఘం వారి విద్యపై 65 సమావేశాలను (1947 తరువాత 53 సమావేశాలు), వయోజన విద్యకు సంబంధిందచిన 5 ప్రధాన ప్రణాళికలు / కార్యక్రమాలు అమలయ్యాయి. ఇప్పటికీ దేశంలో 7 సంవత్సరాలకు పైబడిన నిరక్షరాస్యులు 250 మిలియన్లు ఉన్నారు. కాబట్టి తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటి వరకు జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి. కేంద్ర స్థాయినుంచి రాష్ట్రాలు, జిల్లా, మండలం, గ్రామ మరియు నగర స్థాయివరకు ఒక శాస్వత వ్యవస్థ ఏర్పడాలి. అందులో నిరక్షరాస్యులే కాదు, నూతన అక్షరాస్యులకు నేర్పిన నైపుణ్యాలను మరిచి, తిరిగి నిరక్షరాస్యులుగా మారకుండా, నిరంతరం విద్య మరియు జీవన పర్యంత విద్యా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది.

కొన్ని ప్రత్యేక లక్ష్యాలేర్పరుచుకుని ఆ తరువాత ఆయా కార్యక్రమాలను సరైనవిధంగా విశ్లేషించకుండానే నిలిపివేయడం వల్ల ఖర్చుచేసినట్టి మౌలిక, మానవ వనరులు వృథా అవుతాయి. ఆయా కార్యక్రమాల ఫలాలు ప్రజలకందవు. తీవ్ర సామాజిక ఆర్థిక నష్టాన్ని భరించాల్సి వస్తున్నది. ఇప్పుడు కూడా అట్లా జరక్కుండా కొత్త కార్యక్రమాన్ని జాగ్రత్తగా రూపొందించుకోవాల్సి ఉంది.

2022 కు అనేక ప్రత్యేకతలు...వాయువేగాన సంపూర్ణ అక్షరాస్యతను సాధించాలి

2022కల్లా దేశ జనాభా పట్టికలో వయసు, అర్హతలను బట్టి ఉద్యోగార్దులు అత్యధికంగా ఉంటారని అంచనా. పెద్ద సంఖ్య లోని ఉద్యోగార్జుల ఉత్పాదక శక్తిని అభివృద్ధి మార్గంలోకి తేలేకపోతే, దేశం తీవ్రవిపత్కర పరిస్థితిలోకి పడిపోయే ప్రమాదముంది. ఆ శక్తిని సరైనరీతిన ఉపయోగించుకుంటే మంచి ఫలితాలను పొందుతాం. 75వ స్వాతంత్ర్య దినోత్సం కూడా 2022లోనే రానుంది. అప్పటికి సంపూర్ణ అక్షరాస్యతను సాధిస్తే, అక్షరసమాజాన్ని కోరుకున్న జాతిపిత మహాత్మాగాంధీ)కు, గొప్ప నివాళి అవుతుంది.

2014 ఎన్ఎస్ఎస్ వారి 71వ విడత లెక్కల ప్రకారం మనం 75.4% అక్షరాస్యతను సాధించాం. ఇప్పటికది ఏడాదికి ఒక శాతం చొప్పున పెరిగి 78.0%నికి చేరి ఉంటుంది. అంటే మనం రాబోయే మూడున్నర యేళ్ళల్లో (2022 ఆగస్టు నాటికి) సుమారు 22% మందిని అక్షరాస్యులను చేయాలి. అనారోగ్యం మొదలైన కారణాలుగా కొందరిని వదిలేయాలి కాబట్టి సంపూర్ణ అక్షరాస్యతంటే 100% అక్షరాస్యత అని కాదు. వదిలేయాల్సిన వారిని 2%గా పరిగణిస్తే, మన జనాభాలో ఏడేండ్లు దాటిన సుమారు 20% మందిని అక్షరాస్యులను చేయాలి. ప్రస్తుత గణాంకాల ప్రకారం ఏడాదికి 1% చొప్పున అక్షరాస్యతలో అభివృద్ధి కనిపిస్తోంది. ఆ ప్రకారం సంపూర్ణ అక్షరాస్యత సాధనకు మనకు 20 ఏళ్లు పట్టవచ్చు. కానీ అత్యంత ఫలవంతమైన

పథకాలతో వేగాన్ని పెంచుకోవాలి. అనేక మార్గాల్లో ప్రయత్నించాలి. అనేక కార్యక్రమాలను సమన్వయపర్చుకోవాలి. అందుకుగాను:

1. పెద్దెత్తున యువతను వాడుకోవడం. ఃఈచ్ వన్ టీచ్ వన్/ టెన్)ఒకరు ఒక్కొక్కరికి/ పదిమందికి బోధించాలిః అన్న పథకంతో, విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల్లో విద్యార్థులు పదేసి మందికి చదువు చెప్పాలన్న నిర్దేశం ఉండాలి. సబ్జెక్టుగా దీనికి మార్కులు కేటాయించాలి. ఇట్లా మూడేళ్లపాటు విద్యార్థులు చదువు చెపితే 2022 కల్లా లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకుంటాం.

2. విద్యార్థులను ఆకట్టుకోడానికి పిల్లల మధ్య సాంస్కృతిక కార్యక్రమాలు తదితరాల్లో పోటీలు పెట్టవచ్చు. టీచ్ ఇండియా/ ప్రీత్ ఇండియా పోటీలు ఉపయోగపడతాయి.

3. 20-20 క్రికెట్ పోటీల్లా 20-20 లిటరసీ పోటీలు పెట్టవచ్చు. 20 మంది బృందంగా నిరక్షరాస్యులున్న ప్రాంతాల్లో 20మందికి చొప్పున చదువు చెపితే అక్కడ ఏడాదికి 400 మంది అక్షరాస్యులవుతారు.

4. సుదూర ప్రాంతాలకు ప్రత్యేక సాక్షరతా రైళ్లు, సాక్షరతా బస్సులు నడిపి చదువుచెప్పడానికి యువతను పంపవచ్చు.

5.కంప్యూటర్లు, స్మార్ట్ ఫోనులను పెద్దెత్తున ఉపయోగించుకోవచ్చు. గ్రామాలలో కంప్యూటర్ కియోస్కను ఉంచి, ఒక టెక్నీషియన్ను, బోధకుడిని నియమించాలి. అభ్యాసకులు వారి వీలును బట్టి వెళ్లి స్వయంగా నేర్చుకునే అవకాశాన్ని కల్పించవచ్చు..

6. చదువుకున్న గృహిణికి జీతం లేదా గౌరవభృతి కల్పించడం ద్వారా తోటి నిరక్షర మహిళలకు చదువు చెప్పించవచ్చు.

7. టీచర్ ట్రైనింగ్ విద్యార్థులకు మార్కులతో కూడిన నిర్బంధ ప్రాజెక్టులను అప్పగించి, చదువు చెప్పించవచ్చు.

8. జిల్లా కలెక్టర్లందరికి లక్ష్యాలను నిర్దేశించాలి. అన్ని కార్పోరేట్, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు సామాజిక బాధ్యతగా అక్షరాస్యతా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్న నిర్బంధం ఉండాలి. జాతీయ నియంత్రణా వ్యవస్థను ఒక ఃనేషనల్ లిటరసీ కన్సార్టియంః గా ఏర్పరుచుకోవడం వల్ల కార్యక్రమాల్లో లోటుపాట్లను ఎప్పటికప్పుడు సవరించుకోవచ్చు. కన్సార్టియం అంతర్జాతీయ సంస్థల అనుసంధానంతో కూడా ఉండవచ్చు.

మనం మూడేళ్లల్లో లక్ష్యాన్ని చేరగలమన్న ఆశకు మూడు బలమైన అంశాలు ఊపిరి పోస్తున్నాయి. 1.సమాచార సాంకేతిక పరిజ్ఞానపు అందుబాటు పెరిగి దేశంలోని ఏ మూలకైనా విషయాన్ని క్షణాల్లో చేరవేయగలిగిన సాంతేక పరిజ్ఞానం ద్వారా అక్షరాస్యతా కార్యక్రమాలను నిర్వహించగలగడం, 2. 35 %నికి పైగా జనాభా నగరాలకు తరలి పోతారన్న అంచనా, అంటే అక్షరాస్యత విలువను తెలుసుకోగలుగుతారు, 8 సాధించాలన్న తీవ్ర రాజకీయ నిర్ణయం ప్రస్తుతం మనకు అందుబాట్లో ఉన్నాయి కాబట్టి మనం అందరం, అన్నిటా కలిసి నడిస్తే 2022 కల్లా సాక్షరసమాజాన్ని సాధించుకోగలం.

మూలం : ఇండియన్ జర్నల్ ఆఫ్ అడల్ట్ ఎడ్యుకేషన్

రచయితలు : ఆర్.పి.సింగ్, జగదీష్ సింగ్

(20 వ పుట తరువాయి)

ఇక రాత సాహిత్య సంప్రదాయ విమర్శనా పద్ధతులను మాత్రం, అటు ఆంగ్లం, తెలుగు రచయితలు, ఉపాధ్యాయులు ఎడాపెడా ప్రచారం చేయసాగారు. అస్తిత్వవాదం దీనికి ఊతమి చ్చింది. ('మానవ స్వభావం ఇదీ అని కొన్ని లక్షణాలను మానవులందరూ ఒక అంగీకారంతో ఉంటారు కాబట్టి, లక్షణాలను మార్చటం ద్వారా మానవ స్వభావాన్ని సమాజాన్ని మార్చటం సాధ్యమే అనేది అస్తిత్వవాదుల భావన. ఇలాంటి మార్పులన్నీ మనిషి తనలోంచి తనే చేసుకోవాలన్నది వారి అభిప్రాయం. 23. సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ. నళిని. 1999)

ఇలా సాంస్కృతిక రంగంలో 'ఉపరి తలానికి' చెందిన రచయితల కళాకారుల ప్రాబల్యం పెరుగుతుంటే, నేషనల్ బుక్ ట్రస్ట్ రాష్ట్రాల వారిగా జానపదసంస్కృతిమీద ప్రచురణలు తెచ్చింది. సాహిత్య అకాడమి అటువంటి పని ప్రారంభించింది కానీ వాటికి బుక్ ట్రస్ట్ ప్రచురణలకున్న సమగ్రత రావటంలేదు. తెగల వారీగా సాహిత్యం పై తెస్తున్న ప్రచురణలు తగినంత పరిచయం చేరిస్తే తప్ప జనానికి అర్థం కావు. విశాఖలో గిరిజనసంప్రదాయ సాహిత్య సదస్సు, విజయవాడలో గిరిజన రచయితల సదస్సు అకాడమి జరిపించింది.

నేడు పరిశోధక విద్యార్థులు క్షేత్ర కృషి తగ్గించి, రాత సాహిత్యానికే పరిమితమౌతున్నా, గిరిజనులైన పల్లాల బొర్రంరెడ్డి,దాసరి చిన మూగన్న, తోకల గురవయ్య వగైరాలు సంప్రదాయ సాహిత్యం సేకరిస్తున్నారు. రాత సాహిత్యం, నుడికారాలను కొంత వాడుకుంటున్నా, ఆ ప్రక్రియలకు ఒక పరిమితి ఉంటుంది. రచనలు విజ్ఞాన సర్వస్వాలు కావు. రచనలలో సమాజాన్ని చూడటం చూరులోంచి వెన్నెలను చూడటం వంటిదే.

అచ్చతెలుగు అభిమానులు, ఇటువంటి సంప్రదాయ సాహిత్యం సేకరణ, పునర్ముద్రణ పర్యావరణం, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో పాతపంటల మీద ఆసక్తి పెరుగుతున్నందున,అందుకు సంబంధించిన సామెతలు నుడికారాలను గుర్తు చేయడం, వాటిని శాస్త్ర పరిశోధనలకు, సాహిత్య రచనలకు ముడిసరుకుగా అందించటం, జీవవైవిధ్యం, అడవులు, సముద్రం, బీళ్ళు - ఈ ఉమ్మడి వనరులను వాటిమీద ఆధార పడిన జాతుల తెగల పరం చేయటంలో ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు, సిద్ధాంతాలు వల్లిస్తూ,అమలును పక్కదారి పట్టిస్తున్న 'ప్రగతిశీల' రాజకీయాలను చర్చించటం, మాండలికంలో వస్తున్న రచనలను - సంప్రదాయ సాహిత్యం నేపథ్యంలో సమీక్షించటం, వాటిలో జారిపోయిన,లోపించిన విషయాలను గుర్తుచేయటం పంపిణి పెంచుకోటానికి ఈ పంటల, రుచుల ప్రచారానికి, ప్రామాణిక భాషలో చేస్తున్న రచనలలో లోపిస్తున్న మూలాలు, తెలుగుతనం ఎత్తిచూపటం ఇలా ఎన్నో విధాల తన్నుకొస్తున్న జనం వారసత్వం తెలియచేయటం మీద దృష్టి పెట్టాలి.


'గేర్లు ఎలాగా మార్చాలో ఎవరైనా ఒకసారి చెప్పేస్తే, హెలికాప్టరు కాదు, దాని అమ్మ బాబు నైనా నడిపేవచ్చునండి' 'అప్పన్న సర్దార్' లో రచయిత పతంజలి చెప్పిన మాటల్లో మర్మం గ్రహించి భాషాభిమానులు గేరు మార్చాలి.

'జడలు విచ్చిన సుడులు రెచ్చిన కడలి నృత్యం శమిస్తుందా నడుమ తడబడి, సదలి మునుగక - పడవ తీరం క్రమిస్తుందా … నిజంగానే…నిజంగానే…'శ్రీ శ్రీ.

భాషోద్యమ కథానిక

మందు చీటీ

సమ్మెట ఉమాదేవి
98494 06722



''రాజూ...ఇంకా పడుకునే ఉన్నావా.? కమాన్ గెట్ రెడీ...''

మంచంపై నిద్రమత్తుతో బద్ధకంగా దొల్లుతున్న రాజు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాడు. తల్లిని చూసి అదిరిపడి లేచి కూర్చున్నాడు.

"వాట్ మా...నవ్ ఇట్ ఈజ్ మై సమ్మర్ వెకేషన్...'' అసహనంగా అరిచాడు.

"అఫ్కోర్స్ ఐ నో. ఐ యామ్ గోయింగ్ టూ జాయిన్ యూ ఇన్ సమ్మర్ స్కూల్..."

"వ్హాట్ సమ్మర్ స్కూల్...వాట్ ఫర్?

"దేర్ దే గివ్..ఐ ఐ టీ కోచింగ్ అండ్ కండక్ట్ క్లాసెస్ ఆన్ మానేజ్ మెంట్ స్కిల్స్..."

రాజు కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవి అయినాయి. ఉక్రోషంతో ఎర్రబడినాయి. ఒక్క నిముషం తరువాత అతను రౌద్రంగా మారి పోయాడు. ఎప్పుడూ తన కొడుకును అలా చూడని మాయ విస్తుపోయి చూసింది. అంత లో రాజు విసురుగా మంచం మీద నుండి లేచాడు..

"అయ్యో డాక్టర్.. ఇవ్వాళా చాలా మంది అమ్మానాన్నల దృష్టిలో పెద్దవాళ్ళు ఇంట్లో ఉంటే పిల్లలు చెడిపోతారనే.. మేము పెద్దవాళ్ళ దగ్గరకు వెళ్ళినా వాళ్ళ బుద్దులూ మాటతీరు నేర్చుకున్నామనే తిట్లు.. తెలుగులోనే మాట్లడేస్తున్నామనే బాధ. తాతగారింటికి వెళ్తాను అంటే ఆ ముసలోల్లను కూడా తిట్టే పెద్దలు ఉన్నారు.."

"నో...నో...ఐ వొంట్ గో ఎనీ వేర్. చేతికందిన దిండ్లన్నీ విసిరేశాడు. దుప్పటిని నేలమీద పడేసి కాళ్ళతో తొక్కాడు..."

''ఆర్ యూ మాడ్.'' అరిచింది మాయ. "ఎస్ మామ్ ఐ యామ్ మాడ్... గెట్ లాస్ట్..."

మళ్ళీ అరిచాడు. ఎప్పుడూ ఎంతో సౌమ్యంగా ఉండే రాజు అలా ఎందుకు అరుస్తున్నాడో అర్థంచేసుకునే ప్రయత్నం చేయలనిపించాలేదామెకు. ఎప్పుడూ లేనిది తనను ఇట్లా ఎదిరిస్తాడా అని వెర్రెక్కి పోయిందామే.

"ఓసారిలా వస్తారా...?" హుంకరించింది. ఏమయ్యిందా అని హడలిపోయి ఒక్క ఉదుటున వచ్చాడు ఆమె భర్త మారుతిరావ్.

"వాట్ ఈజ్ దిస్. ఏంటి మీ అబ్బాయి నిర్వాకం.? రాత్రి వాడికి చెప్పలేదా సమ్మర్ స్కూల్ గురించి?"

"లేదు మాయ. నేను వచ్చేటప్పటికే వాడు నిద్రపోతున్నాడు. రేపు చెబ్దామని ఆగాను"

"ఏమిటి రేపు చెప్పేది. మనం ఆలస్యం చేస్తే అంత ప్రిస్టేజియాస్ స్కూల్ లో సీట్లు ఉంటాయా...? అయినా మనం చెప్పగానే హి హాజ్ టూ ఫాలో దట్సిట్...

"ఆ మాయా...డోంట్ వర్రీ. ఇట్స్ ఓన్లీ సమ్మర్ స్కూల్...యూ నో...

"అదిగో మళ్ళీ. పేరెంట్స్ మీటింగ్ లో ఏమన్నారు? మీవాడు దేనికీ సరిగ్గా రెస్పాండ్ అవ్వడం లేదు. ఫ్లూయెన్సీ లేనేలేదు అని చెప్పడం లేదా...? ఎన్నాళ్ళు వాడు తర్డ్...ఫోర్త్ రాంక్ లో ఉండిపోతాడు. అస్సలు మీరు కేపబుల్ అయితే ఇవ్వన్నీ నా తల మీదకు వచ్చేవా...?" ఆమెను అలా వది లేస్తే ఇంకా చాలా దారుణంగా మాట్లాడు తుంది అని తెలుసు.

"రాజూ నాన్నా..! వాట్ హపెండ్. కమాన్ గెట్ అప్..." మారుతీరావ్ అనునయంగా అరిచాడు. బిగదీసుకుని పడుకున్న రాజు కదలలేదు. "రాజూ మమ్మీ చెప్తున్నది కదా గెట్ రెడీ ఫర్ సమ్మర్ క్లాసేస్..." మారుతీ రావ్ మళ్ళీ బతిమాలాడు.

"నో..." రాజు రివ్వున లేచాడు. "నో...నో ఐ డోంట్ వాంటూ గో ఎనీ వేర్."

"నో రాజూ...డోంట్ సే లైక్ దట్ నీకు. సాయంత్రం నిన్ను ఫుడ్ కోర్ట్ కి తీసుకె ళ్తాను సరేనా.."

"నో...ఐ డోంట్ వాంట్ ఇట్"

"పోనీ జల విహార్..?"

"నో...నో...ఐ డోంట్ వాంటూ గో ఎనీ క్లాసెస్. ఐ డోంట్ వాంటూ కమ్ ఎనీ వేర్..."

"ఆర్ యూ మాడ్. ట్వంటీ థౌజండ్స్ అడ్వాన్స్ పే చేసాను అక్కడ..." అరిచింది మాయా

"గో టూ హెల్..." అంత కంటే గట్టిగా అరిచాడు రాజు అంతే మాయ లేచి వచ్చి పిచ్చిదానిలా రాజు చెంపలు వాయించి వాయించి కొట్టింది...

మారుతీ రావ్ అక్కడలేకుంటే రాజును ఏమి చేసేదో అన్నంత వెర్రిగా కొట్టేసింది.

మారుతీరావ్ ఆమెను బలవంతంగా కిందకు తీసుకొచ్చి సోఫాలో కూర్చోబెట్టాడు. ఆమెకు మంచినీళ్ళు ఇచ్చి కొడుకు దగ్గరకు పరుగు పెట్టాడు. రాజు చేతుల్లో ముఖం దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తూ...డోంట్ కమ్ టూ మీ..ఐ హేట్ యూ ఐ హేట్ ఆల్ ఆఫ్ యూ."

ఏడుస్తూ అరుస్తున్నాడు ఆ మంచం మీదే దొర్లి దొర్లి ఎదుస్తున్నాడేగానీ తండ్రిని దగ్గరకు రానివ్వలేదు.

మారుతీరావ్ మళ్ళీ కిందకు వెళ్ళాడు మాయ

..."ఏంటీ హేట్ యూ అంటాడా...? వీడి కోసం, వీడి చదువులకోసం ఎంత ఖర్చు పెడుతున్నాం...ఇప్పుడు హాయిగా ఇంట్లో కూర్చోలేక మళ్ళీ వీడి సమ్మర్ స్కూల్ కోసం బోలెడు డబ్బు ఖర్చుపెట్టి మళ్ళీ వీడిని తీసుకెళ్లడం తీసుకురావడం ఇదంతా వాడికి మాడ్ గా కన్పడుతున్నదా...? వాడు మనలను హేట్ చేస్తున్నాడా?" చేతుల్లో ముఖం దాచు కుని బోరుబోరున ఏడవసాగింది. అకస్మాత్తుగా యుద్ధ వాతావరణంలా మారిపోయిన ఇంటిని చూసి అయోమయంలో పడిపోయాడు మారుతిరావ్...

"చూడు మాయా. వాడికి ఏ క్రికెట్ మ్యాచ్ లోనో చేరాలానుందేమో. కాస్త సమయమిస్తే వాడే మెల్లగా సర్దుకుంటాడు."

"ఎంటండి సర్దుకునేది. చిన్నపిల్లాడు వాడు...వాడికేమి తెలుసు ఇది పోటీ ప్రపంచం. వి మస్ట్ బీ ఎలర్ట్ ఫర్ ఎవ్రీ మినేట్."

మారుతీరావ్‌కి ఏమిచెయ్యాలో అర్థం కాలేదు. దగ్గరకు వస్తే దిండ్లూ దుప్పట్లూ విసిరేస్తూ నానా అరుస్తూ ఏడుస్తూ భీభత్సం చేస్తున్నాడు రాజు. రోజులు గడిచిపోతున్నాయి. మంచి ప్రిస్టేజ్ స్కూల్ ల్లో క్లాస్ లన్నీ అయిపోతున్నాయి ఇప్పుడెలా అని పిచ్చెక్కిపోతున్నది మాయకు.

దిండ్లూ దుప్పట్లూ విసరడమే కాక ... ఇప్పుడు కొత్తగా తల బాదుకుంటూ ఏడుస్తున్నాడు రాజు. అన్నం కూడా సరిగ్గా తినడం లేదు. స్నానం చేసి మూడురోజుల య్యింది. మాయా వాళ్ళు వస్తే తలుపు తియ్యడంలేదు. మయాకు దిగులూ కంగారూ ఎక్కువయిపోయినాయి.

చివరకు మారుతీరావ్‌ని పిలిచి "ఇప్పుడు నేనొక విషయం చెప్తున్నాను. మీరు ఏమీ అనకూడదు" అన్నది

పిల్లల భవిష్యత్ అంటూ మొదటి నుండీ అన్నిటికీ నోరు మూయించడం ఆమెకు అలవాటే.

అక్క రాగిణిని బెంగళూర్ హాస్టల్ నుండి పిలిపిస్తే తనతో గడుపుతూ కాస్త కోలుకుంటాడు అనుకుంటుందేమో. వెళ్లి కూతురు రాగిణిని తీసుకు రమ్మంటుందేమో అనుకున్నాడు.

"నేను రాజును సైకాలజిస్ట్ దగ్గరకు తీసుకెల్దాము అనుకుంటున్నాను." అన్నది

మారుతిరావ్‌కి వల్లు మండి పోయింది. "రాజును కాదు ముందు నిన్ను చూపించాలి సైకాలజిస్ట్ దగ్గర..." కచ్చగా అనుకున్నాడు. మరోక్షణం ఆలోచించి "నిజమే రాజును తీసుకెళ్తే వాడి మనసులో ఏముందో అన్నీ కనుక్కుని ఏమి చెయ్యాలో చెప్తాడు కదా..." అనుకుని "సరే."

అన్నాడు. "కానీ రాజు ఇప్పుడు ఎక్కడికీ

ప్రజల భాషలో పరిపాలించలేని ప్రభుత్వాలు మనకు సిగ్గుచేటు

తీసుకెళ్ళే అవకాశమే ఇచ్చేటట్టు లేదు కదా..." అనుకున్నాడు ఎందుకయినా మంచిదని.. రాజు ముందు కూర్చుని "రాజూ...ఇదివరకెప్పుడూ నువ్విలా ఇలా ప్రవర్తించలేదు. ఇప్పుడు ఎందుకు ఇట్లా ప్రవర్తిస్తున్నావో అర్థంకావడం లేదు...ఒకసారి బయటకు వెళ్దామా...?" అను నయంగా అడిగాడు. మొదట రాజు ఏమీ జవాబు చెప్పలేదు.

"చూడు రాజు...సెలవలు ఇచ్చిన దగ్గరనుండీ నిన్ను ఎక్కడికీ తీసుకెళ్ళకుండా ఇంట్లోనే ఉంచేసాము. రియల్లీ సారీ నేను డాక్టర్ దగ్గరకు వెళ్ళాలి నువ్వుకూడా మాతో రా. నేను డాక్టర్ దగ్గరకు చూపించుకున్నకా ఏదయినా పార్క్ కి వెళ్దాము సరేనా."

అడిగాడు రాజుకు కూడా తానూ అట్లా ప్రవర్తించడం తనకే కూడా నచ్చడం లేదు. తానున్న మానసిక స్థితిలో తండ్రి ఎందుకు డాక్టర్ దగ్గరకు వెళ్దాము అంటున్నాడో కూడా ఆలోచించలేదు. బయటకు వెళ్దాము అన్నదే అర్థం అయ్యి "సరే..." అన్నాడు రాజు.

.....

రాజు ఏ స్కూల్ లో చదువుతున్నాడో తెలుసుకున్నాక.. చక్కటి ఇంగ్లిష్లో సంభాషణ మొదలు పెట్టాడు డాక్టర్ అరవింద్. అనాసక్తంగా జవాబులు చెప్పాడు రాజు. మాయా మారుతిరావ్ లను చూస్తే చాలా హుందాగా చక్కగా కనిపించారు. రాజును చూస్తే చాలా ఆరోగ్యంగా తేటగా ఉన్నాడు. సమస్యల్లా ఎనిమిదవ తరగతి చదువుతున్న రాజు...

అమ్మానాన్నలకు అనుగుణంగా ప్రవర్తించడంలేదు. ఇప్పటి పిల్లలా ఏ కోర్స్ లో చేర్పిస్తే ఆ కోర్స్ లో చేరడంలేదు. రాజు పరిస్థితి ఏమిటో ఎలా పరిష్కరించాలో మొదట అస్సలు అర్థంకాలేదు డాక్టర్ అరవింద్‌కి.

''మీరు ఏమయినా పనులుంటే చూసుకుని ఓ రెండుగంటలాగి రండి..." అని చెప్పాడు మాయా వాళ్ళకు. అమ్మ నాన్నా అలా తనను వదిలి వెళ్ళడం ఎందుకో స్వేచ్ఛగా అనిపించింది రాజుకు కూడా. అటూ ఇటూ హుషారుగా పచార్లు చేయ సాగాడు. ఈలోగా మిగితా వారితో మాట్లాడు తూనే ఒక వంక రాజును గమనించసాగాడు డాక్టర్ అరవింద్. ఇద్దరు ముగ్గురితో మాట్లాడి పంపాక స్టూల్ దగ్గరకు లాక్కుని రాజుతో సంభాషణ ప్రారంభించాడు.

చిత్రంగా రాజునే మాటలు మొదలు పెట్టాడు. రాజుకు తెలియకుండా ఫోన్ లో రికార్డర్ ఆన్ చేసాడు డా అరవింద్...

"ఒక మాట అడగవచ్చా అంకుల్." అన్నాడు. "అడుగు..." అన్నాడు. డాక్టర్.

"ఇది స్కూల్ కాదు. ఇల్లు కాదు. మీరెందుకు వచ్చిన వాళ్ళతో ఇంగ్లీష్ లో మాట్లాడుతున్నారు?" అని అడిగాడు

"అదేంటి గమ్మత్తుగా ఉందే ప్రశ్న... స్కూల్ కాదు కదా అన్నావు నిజమే. స్కూల్ లో ఇంగ్లీషే మాట్లాడుతారు. నువ్వేంటి అట్లా అంటున్నావు. ఇంగ్లీష్‌లో మాట్లాడడానికి ఇల్లు కాదు కదా అంటున్నావు. ఇంట్లో కూడా ఇంగ్లీషే మాట్లాడుతారా?"

"అవునంకుల్ ఇంట్లో కూడా ఇంగ్లీష్ మాట్లాడితేనే పిల్లలకు ఇంగ్లీష్ బాగ వస్తుందని పేరెంట్స్ మీటింగ్‌లో తల్లిదండ్రులకు చెప్తారు. దాంతో మా అమ్మానాన్నలాంటి వారంతా మాలాంటి పిల్లలతో ఇంగ్లీష్ లోనే మాట్లాడుతారు.

కొంత ఆశ్చర్యంగా అనిపించినా..

"సో వాట్... నిజంగానే ఇంగ్లీష్ బాగా వస్తుంది కదా..." రాజు ఏమీ మాట్లాడలేదు.

మౌనంగా కూర్చున్నాడు. "కమాన్ మాటాడు రాజు...డమ్‌లా అలా కూర్చున్నావేం...?

"ఎస్ ఐ యామె డమ్. అరిచాడు రాజు. "ఐ బికేమ్ ఏ డమ్...నో...నో దే మెడ్ మీ డమ్

"మళ్ళీ గట్టిగా అరిచాడు. డాక్టర్ మౌనం వహించాడు.

"అమ్మా వాళ్ళు అనుకుంటున్నారు.. నాకు ఏమీ రాదనీ. మిగితా పిల్లలకంటే నేను చాలా వెనకబడి ఉన్నానని. కానీ కాదు. నాలో వేలవేల భావాలూ ఉన్నాయి...మా అమ్మా నాన్న చేర్పించిన అతి 'పేద్ద' బడిలో మొదటి రోజున వాళ్ళు అడిగిన ఓ ప్రశ్నకు నేను చాలా సహజంగా హాయిగా తెలుగులో జవాబు చెప్పబోయాను. వాళ్ళు చాలా అవమానకరంగా మాట్లాడి నన్ను వారించారు. ఇక నుండీ ఏది మాట్లాడినా ఇంగ్లీష్ లోనే మాట్లాడమని కఠినంగా చెప్పారు. నేను చిన్నబోయి మరి మాట్లాడలేకపోయాను. అంతే ఆ రోజు నుండీ అసలు ఏమీ మాట్లాడబుద్ధి కాలేదంతే. పైగా అదే రోజున ఓ అమ్మాయి తెలుగులో మాట్లాడిందని..."ఐ స్పీక్ ఓన్లీ ఇంగ్లీష్" అన్న బోర్డ్ ఆమె మేడలో వేలాడదీసి స్కూల్ అంతా తిప్పారు. నాకెందుకో చాలా విరక్తిగా అనిపించింది. ఇంగ్లీష్ నేర్చుకోవడం, ఇంగ్లీష్‌లో మాట్లాడడం చాలా సులువు. మా పై చదువులకు మా భవిష్యత్తుకు ఇంగ్లీష్ చాలా అవసరం కూడా అయి ఉండవచ్చు. కాదనను. కానీ కన్న తల్లితండ్రితో కూడా ఇంగ్లీష్ లోనే మాట్లాడుకోమ్మని వారు సూచించడం.. దాన్ని శిలా శాసనంగా మా వాళ్ళు ఆచరించడం నన్ను లోలోన దహించివేసింది...అందుకే రాంక్ కోసం పడిపడి చదవను. నాకు చదవాలనిపించినప్పుడే చదువుతాను. నాకు జవాబు చెప్పలనిపించినప్పుడే చెబుతాను. చాలా సార్లు.. అవును చాలాసార్లు నేను మౌనంగా మిగిలిపోయాను. ఆర్ యూ ఏ డమ్...? అంటారు. నేను దానికీ ఏమీ మాట్లాడను."

"మరి ఎప్పుడు రాజు నువ్వు హాయిగా మాట్లాడేది..?" డాక్టర్ అనునయంగా అడిగాడు

"వేసవిలో డాక్టర్.. కేవలం వేసవిలో ... నేను హాయిగా మాట్లాడుకుంటాను. ప్రతి వేసవిలో మా నాయనమ్మా తాతయ్యాల ఊరికి వెళ్తాను. వాళ్ళ దగ్గర నోరారా హాయిగా మాట్లాడుకుంటాను. సంవత్సరంపాటు నాలో ఉన్నభావాలన్నీ అక్కడ మా వాళ్ళతో పంచుకుంటాను. మా నాయనమ్మ మాటల్లో ఎన్నెన్ని సామెతలో సంబరంగా వింటాను. మా తాత నోట పద్యాలు విని పరవశించి పోతుంటాను. మా అత్తలూ, మామాలూ సరదాగా మాట్లాడే మాటల్లో హాయిని పొందుతాను. నాకు ఎంతో ఇష్టమయిన వేసవి. ఎప్పుడో రానున్న విద్యా సంవత్సరాల్లో నేను చదవబోయే టెన్త్ క్లాస్ కోసం..

ఇప్పటినుండే కోచింగ్ అంటా... అది చాలక ఐ ఐ టీ కోచింగ్ అంటా, మానేజ్

వినియోగించేకొద్దీ భాష వికసిస్తుంది. వాడనిభాష వాడిపోతుంది

మెంట్ స్కిల్స్ అంటా... పిచ్చెక్కుతుంది డాక్టర్ ...”

“నిజమే రాజూ నువ్వు చెప్పినవన్నీ చాలా నిజం. మనసు విప్పి హాయిగా మన భాషలో మాట్లడుకోలేకపోతే ఇక మనసు మూగబోతుంటుంది. కానీ రాజూ...అమ్మా... సెలవలకు తాతగారింటికి వెళ్తాను అని ఓ చిన్నమాట అడగవచ్చుగా ఒప్పించి వెళ్ళ వచ్చుగా...ఎందుకంత చిరాకుపడి అరిచీ తల కొట్టుకున్నావు?”

“అయ్యో డాక్టర్.. ఇవ్వాళా చాలా మంది అమ్మానాన్నల దృష్టిలో పెద్దవాళ్ళు ఇంట్లో ఉంటే పిల్లలు చెడిపోతారనే...మేము పెద్దవాళ్ళ దగ్గరకు వెళ్ళినా వాళ్ళ బుద్దులూ మాటతీరు నేర్చుకున్నామనే తిట్లు...తెలుగు లోనే మాట్లదేస్తున్నామనే బాధ. తాతగారింటికి వెళ్తాను అంటే ఆ ముసలోల్లను కూడా తిట్టే పెద్దలు ఉన్నారు...”

“అసలు తెలుగు మీడియం చదువులు వద్దు సరే. ఇంగ్లీష్‌లో బాగా మాట్లాడాలి అదీ సరే డాక్టర్.. కానీ ఇంట్లో కూడా నా మాతృ భాషను నా తల్లిదండ్రులే లేదా నా తల్లి దండు లవంటి వారే అనుమతించడం లేదు. ఇది ఎంత ఘోరం ఆఫీసులు, బస్‌లూ, బాంకు లూ అన్నీ అంగ్లమయం చేసేసారు సరే... బంధుమిత్రులు నలుగురు కలిసినా అదే ఇంగ్లీ ష్‌లోనే క్షేమ సమాచారాలు పలకరింపులు నూ...అవసరం ఉన్నా లేకున్నా అందరూ ఇంగ్లిష్‌లోనే మాట్లాడాలనే చూస్తారు. బదు లన్నీ ఉద్యోగాల రాబడులే. వారి ప్రయోజ నాలు వేరే.

కానీ తెలుగు లోగిళ్ళు కూడా ఆంగ్ల మయమే డాక్టర్.

ఇంత చిన్నవానిలో ఎంత స్పష్ట మయిన ఆలోచనలు ఉన్నాయి. అవి ఇన్నాళ్ళు అతనిలో అణిగిపోయి ఎంత మూగవాన్ని చేసాయి. తను తెలుగులో పలకరించేసరికి ఆ భావాలన్నీ ఎలా వెల్లువయి వెలికి వచ్చా యి...ఆశ్చర్య పదుతూనే చాలా సేపు రాజుతో డా.అరవింద్ హాయిగా మాట్లా డాదు...

కాస్సేపటికి భయం భయంగా మాయా, మారుతీరావ్ లు వచ్చారు. డాక్టర్ ఏమంటాడో అని అతని వంకే చూస్తూ నించున్నారు...

డా. అరవింద్ “మీ అబ్బాయికి ఓ నెలరోజులు స్థలమార్పిడి కావాలి...” అన్నాడు

“చెప్పండి డాక్టర్. ఎక్కడకు పంప మంటారు..? బెంగళూర్... ?

“బెంగళూర్‌కేం మీరు తలుచుకుంటే బాంకాక్‌కి కూడా మీరు పంపగలరు. నాకు తెలుసు. కానీ రాజును ఇదిగో ఇక్కడికి పంపండి చాలు రాజాలా ఉంటాడు...” అని ప్రిస్క్రిప్షన్ పై తెలుగులో అని రాసిచ్చాడు. వాళ్ళిద్దరూ దాన్ని ఆత్రంగా అందుకుని చూసారు..

“కపిలేశ్వరపురం....”

అది చదివి “అక్కడికి దేనికి డాక్టర్..? అసహనంగా అరిచింది మాయ

“తెలుగు లోగిలి కోసం.. మూగవాని గా మారిపోతున్న రాజు స్వరం తెలుగును రవలించడం కోసం...”

“డాక్టర్...” మాయ ఎదో అనబో తుంటే వినిపించుకోకుండా వెలుగులీనుతున్న రాజు మోమును తృప్తిగా చూస్తూ పోన్ అందు కుని “శారదా...పిల్లల బట్టలు సర్దు. ఓ పది రోజులు వాళ్ళ తాతగారింటికి వెళ్లోద్దాం” అని చెప్పాడు.

డా. వి. నాగరాజ్యలక్ష్మి
9394113848

మాత్సర్యభావోన్మత్తులలో సౌమనస్యం నింపగల "వేమ" శతకం

"లోకులు బాకులు దూసిన
నాకేమని సత్యమనుచు నమ్మినదానిన్
వాకొను సుస్థిరధైర్యము
నాకొసగుమునిన్ను నమ్మినాడను వేమా!"

తాను దర్శించిన సామాజిక సత్యాన్ని నిర్భీతితో వెల్ల డించిన సమాజాభ్యున్నతిని కవిత ద్వారా కాంక్షించిన వేమన వ్యక్తిత్వ వైభవాన్ని కవిత్వ రచనకు ఆదర్శంగా భావించి, అనుసరించి కొండవీటి వేంకటకవి రచించిన "త్రిశతి" లోని బుద్ధ, వేమ, గాంధి శతకాలలో ద్వితీయ శతకం 'వేమ'.

మహావక్తగా, ప్రాచీనకావ్య పరిష్కర్తగా, సరస మిమర్శ కుడిగా, ఆదర్శ అధ్యాపకుడిగా, సత్కావ్య నిర్మాతగా శతక కర్తగా తెలుగు సాహిత్యనందనోద్యానంలో పరిమళాలను ప్రసరింప చేసిన కవిరాజు కొండవీటి వేంకటకవి.

"కావ్య నాటకాది బహురూప వాఙ్మయశాఖలను నవరస సంభరితంగా నిర్మింప సమర్థుడయినవాడు కవిరాజు" అని రాజ శేఖరుని కావ్యమీమాంస పేర్కొంటుంది. ఇబ్బడిముబ్బడిగా కవితలు పండించిన విద్వత్కవులు తెలుగుగడ్డపై పలువురుం డవచ్చు. కానీ అధీతి బోధాచరణ ప్రచారాలపట్ల సార్థకమైన సమన్వయం సాధిం చినవారు అరుదు. ఈ నాల్గింటికి సముచితమైన సమన్వయం కుదుర్చుకొని సాహిత్యసేవచేసి చరితార్థులైన విద్వత్కవులలో కొండవీటి వేంకటకవి అగ్రగణ్యులు. వీరి కవితావ్యవసాయం నిత్య ప్రవర్ధమానం అయింది. కర్షకా! హితబోధ, చెన్నకేశవశతకం, భాగవతులవారి వంశావళి, ఉదయలక్ష్మీ నరసింహతారావళి, భావనారాయణ చరిత్ర, దివ్యస్మృతులు, త్రిశతి, నెహ్రూ చరిత్ర మొదలైనవి వీరి కవితామాగాణంలో పండిన బంగారు పంటలు. లోక ప్రచారకుల బూటకాలను మొగమాటం లేకుండా రచ్చకీడ్చిన వేమన రచనా ప్రభావంతో వేంకటకవి రచించిన శతకం 'వేమ' శతకం.

సంస్కృతంలో భర్తృహరి సుభాషితత్రిశతి నీతి, శృంగార, వైరాగ్య శతకాలతో కూడిన శతక త్రిశతి. మత మహామారి దంష్ట్రల, మాత్సర్య భావోన్మత్తులను నిరసించి సౌమనస్యాన్ని జనులకు అలవర చాలని, వర్ణాశ్రమాచారాలను ఎదిరించి హేతువాద దృక్పథాన్ని పెంపొందించాలని కలాన్ని ఆయుధంగా చేపట్టిన వేంకటకవి తమ లక్ష్య సాధనను 'త్రిశతి'లో సమరంగా నిర్వర్తించారు. ఈ కృతిని ప్రముఖ సంఘ సంస్కరణాభిలాషి అయిన శ్రీ పాములపాటి బుచ్చి నాయుడుగారికి అంకిత కావించటం కవి రచనాలక్ష్యానికి ధీటైన తార్కాణం.

సాంఘిక దౌష్ట్య వృత్తిని అట్టాకమొనర్చ సమకట్టిన సాంఘిక విప్లవ యోధుడు యోగివేమన వేంకటకవికి సందేశకర్త. శతకం ఆంధ్ర భాషా వ్యక్తిత్వాన్ని నిలబెట్టగల విశిష్ట ప్రక్రియ. ఆత్మాశ్రయాను భవాలను ప్రత్యక్షంగా వినిపించటానికి వీలు కల్పించిన ప్రక్రియ తెలుగునాట, తెలుగువారి నోళ్ళలో పుట్టి, తెలుగుజాతి సంస్కృతిని ప్రతిఫలించే సుభాషితాల సౌందర్యాలను సామెతల సోయగాలను, నానుడుల, లోకోక్తుల విలాసాలను పదిలంగా భద్రపరచి భావి తరాలకు అందించటానికి అనుగుణమైనది శతక ప్రక్రియ. సాంఘిక విప్లవానికి తేటతేట ఆటవెలది ఛందస్సును వాహకంగా స్వీకరించి వేలకొలది పద్యరత్నాలను తెలుగుజాతికి అందించిన వేమన ఆద ర్శంగా వేంకటకవి ఆటవెలదులలో ముచ్చటగా రచించిన త్రిశతిలోని 'వేమ' శతకం బహుధా ఆదరణీయం.

వేమన జీవితగాథను వేమన బోధనలోని ప్రధానాంశాలను ఈ శతకంలో వేంకటకవి వర్ణించారు. కవి ఆకాంక్షించిన వినూత్న సమాజావిష్కరణ మార్గదర్శక సూత్రాలకు అందమైన ఆకృతి 'వేమ' శతకం.

"కులబలమ్ము పుంజికొనువేళ జనియించి
పైకులాల టెక్కు బాఱద్రోలి
బీదబిక్కి కింత విన్నాణముంగూర్చి
నేర్పితీవు పజ్జనిలువ వేమ" – 6 ప

సమాజంపై కులభేదం తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్న కాలంలో జన్మించినా తన సాహసోపేతమైన బోధనలతో అగ్రవర్ణాల దురహంకారానికి అడ్డుకట్టవేసి బీదబిక్కి జనులకు విజ్ఞానాన్ని పంచిన మహనీయుడు వేమన అని తన అంతరంగంలో గూడుకట్టుకున్న గౌరవభావాన్ని ప్రకటించారు వేంకటకవి.

ప్రజాకవి వేమన జనులను అజ్ఞానాంధకారంనుండి జ్ఞాన చైతన్యందిశగా నడిపించటానికి కవితామార్గాన్ని ఎంచుకున్నాడు. నిరక్షరాస్యుల హృదయాలలో విజ్ఞానవీచికలను ప్రసరింపచేయటానికి

సహజసిద్ధమైన పల్లెభాషను ఉపకరణం చేసుకున్నాడు. జానపదుల నోళ్ళలో నానుతున్న నానుడులను ప్రయోగించాడు. అత్యంత విలక్షణ మైన వేమన కవితారీతిని ఆదరించిన వేంకటకవి అతడి కవితారీతిని, కవితాలక్ష్యాన్ని ప్రశంసించారు.

"అలతియలతి పలుకులందు జీవమునూది
ఘనులు సెప్ప నలవికాని వాని
వినిచితివి విశుద్ధ వేదాంత బోధల
నరటిపండు నొలిచినట్లు వేమ" – 10 ప

పదాలకు జీవం పోయటం వేంకటకవి వినూత్నమైన అభి వ్యక్తికి దర్పణం. సహజరమణీయమైన ఉపమాలంకారం భావానికి మెరుగులుదిద్దింది.

సమాజంలో కవికి నిండైన గౌరవం కావాలని, ఇతరుల మెప్పు కోరి కవిత్వం చెప్పేవారి వెట్టిపోకడలకు విసిగివేసారి వేమనకలం సత్యశోధనకు పూనుకున్నదని, కవి అంతరించిపోయినా సమాజంలో శాశ్వతస్థానాన్ని అర్జించేది కవిత్వమేనని వేంకటకవి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

"బిచ్చమెత్తి సిగ్గుబిడియమ్ముపోనాడి
పరులనాశ్రయించి పల్లకీలు
పొందవచ్చు దానుబోయిన పిమ్మట
నిలువ వలయుకవిత విలువవేమ" – 14 ప

వేమన తన ఆటవెలదులలో సమాజంలో అమాయకులను, స్త్రీలను మోసగించే దుర్మార్గులను చీల్చి చెండాడాడు. సర్వసంగ పరిత్యాగులయిన స్వాముల, సాధువేషాలతో సంచరించే కపట వర్త నుల గుట్టు బయటపెట్టాడు. వేంకటకవి తనశతకంలో కపట సన్యా సుల ప్రవర్తనలను, మోసాలను బయటపెట్టి జనులను హెచ్చరిం చారు. అరిషడ్వర్గాలను ఉపశమింపచేసికోలేని వారి నైజాన్ని ఖండిం చారు.

"కావిగుడ్డమొలకు గాళ్ళకు బాదుకల్
మెడకు లింగకాయ దొడుగుయోగి
పట్టు బట్టి వెండిపాదుకల్ బంగారు
లింగమందజూచు లెస్స వేమ – 3 ప

సర్వసంగపరిత్యాగికి పట్టు బట్టలు, వెండి పాదుకలపై వ్యామో హాన్ని నిరసించారు. ప్రస్తుత సమాజంలో స్వామి, ఋషి, మహర్షి శబ్దాల గౌరవప్రదమైన అర్థాలు వికటించాయని, చిత్తశుద్ధిలేని జీవులకు కూడా అవి బిరుదులై స్థిరపడ్డాయని వ్యవస్థపై అధిక్షేపాన్ని వ్యక్తం చేశారు.

"స్వామి ఋషి మహర్షి శబ్దమ్ములేనాడొ
పొగిలిపోయి సారమును దొఱంగె
చిత్తశుద్ధిలేని జీవుల నివిచేరి
బిడియపడక గట్టిపడియె వేమ" – 9 ప

'వేమ' శతకం అంతటా వేంకటకవి లోకరీతిని వెల్లడించారు. మనుషుల వర్తనలోని లోపాలను ఎత్తిచూపారు. మనిషి మనీషిగా ఎదగటానికి అనుసరించవలసిన మార్గాలను బోధించారు. సమాజా భ్యుదయం కోసమే తీవ్రంగా తపనచెందారు.

"తల్లిదండ్రి గురువుదైవమ్మటందురు
మొదల తల్లిదండ్రులుదిల కొనగ
దేవతలకు గుళ్ళు దీర్తురేమిదివెఱ్ఱి
యిరుగుపొరుగుమెప్పుకొఱకు వేమ" – 16 ప

తల్లిదండ్రులను గౌరవించవలసిన బాధ్యతను విస్మరించిన సంతానానికి చురక అంటిస్తూ ఎల్లప్పుడు సజ్జనసాంగత్యమే మనిషి ఔన్నత్యానికి బాటలు వేస్తుందని సందేశం ఇచ్చారు.

"వేమ"శతకానికి ప్రాణశక్తిని అందించిన లక్షణం తెలుగు నుడికారపుసొంపు. మహాకావ్యాలను, అత్యద్భుత పాండితీ ప్రపూర్ణ విమర్శనా గ్రంథాలను భాషామతల్లికి నైవేద్యంగా సమర్పించిన వేంకటకవిగారు శతక రచనలో లలిత మధురమైన శైలిని అనుస రించారు. తాము జాగృతమొనర్ప బూనిన సమాజానికి హితవు కూర్చే రీతిలో తెలుగు భాషా మాధుర్యాన్ని ఈ శతకంలో నర్తింప చేశారు.

"మెఱుగుబెట్టువారు దొరకినమెఱయును
దొరకకున్న ముదుగుదుర్భలుండు
గోగునీట దుడువ రాగిల్లు నిత్తడి
తుడువకున్న గాంతి దొఱగు వేమ" – 23 ప

తళతళమెరిపించే తీరు అర్థాంతరన్యాస అలంకారమై ఈ పద్యంలో అభివ్యక్తి నవ్యతను సాధించింది.

'వేమ'శతకంలోని ప్రతిపద్యంలోను తెలుగువారి జీవనశైలి, సామెతలు, లోకోక్తుల విందుల చమత్కారాలు సహృదయులను ఆనందపరవశులను చేస్తాయి.

పనియు పాటులేని పలుగాకిమూకల
తలపులందు జెడ్డ మొలకలెత్తు
బదుగురెక్కనట్టి బాటలో గాదమ్ము
మోసులెత్తి దారిముంచు వేమ" 24 ప.

అని శ్రమజీవనంలోని సౌందర్యాన్ని చవిచూపించారు.

"ముసిడికాయ దెచ్చి మసిపూసిమారేడు కాయ చేసే" వారిని "అన్నమైనా సున్నమైనా ఒక్కటే అని వాగే కర్మయోగులను," గడపగడప ముందు బుడుబుడుక్కని కొంకులేని కూతలుకూసి" మోసగించేవారిని "ఫలములేని పనికి బారలు చాపి తప్పుదారి పట్టించేవారిని, ఈ శతకంలోని సామెతల్లో దర్శింపచేశారు కవి.

వేంకటకవి గారి అపారమైన తెలుగుభాషాభిమానం ఈ శతకంలో వేళ్ళూనుకొన్నది. తెలుగుభాష పరభాష పరదేశస్థుల చేత గౌరవింపబడుతూ ఉండగా తెలుగు నేలపై తెలుగు పలుకలేని వారిని, తెలుగును ప్రేమించలేని వారిని తీవ్రంగా నిరసించారు.

"లాతిదేశములకు బ్రీతిచేకూర్చును
దెలుగుబాసలోని తియ్యదనము
నొగులు సెందు ముందు నోరార బల్కగా
దెలుగువాని కేమితెగులు వేమ". 62 ప.

విజయవాడలో కందుకూరి వీరేశలింగం శతవర్ధంతి సమాలోచన



మే 26న విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో కందుకూరి వీరేశలింగం శతవర్ధంతి సమాలోచన సభ ఉత్తేజ భరితంగా జరిగింది. రోజంతా జరిగిన కార్యక్రమంలో స్థానికులే కాక దూర ప్రాంతాల నుంచి కూడా సాహిత్య సామాజిక సాంస్కృతిక కళా సంస్థల ప్రతినిధులు 800 మంది పైగా పాల్గొన్నారు. 100 సాహిత్య సంఘాల భాగస్వామ్యంతో జరిగిన ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా సి.ఉమామహేశ్వరరావు, సాహితీ స్రవంతి అధ్యక్షులుగా వొరప్రసాద్‌లు వ్యవహరించారు. కందుకూరి రూపకాన్ని ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో కందుకూరి శతవర్ధంతి సభలు ఘనంగా జరిగాయి.

జానపదుల నిత్యజీవన వ్యవహారంలో సజీవంగా నిలిచిఉన్న తెలుగు పదబంధాలను, తెలుగు జాతీయాలను ప్రయోగించటంపై కవిగారికి అపారమైన అభిమానం. మొదట తాను పుట్టినగడ్డను, తన తల్లిభాషను గౌరవింపలేని వాడు దారితప్పి తిరిగేవారని నిష్కర్షగా అధిక్షేపించిన అపరభాషా ప్రేమికులు కొండవీటి వేంకటకవి. మొదట తల్లి బాస నేర్చి ఆపై పరులబాసను నేర్చినట్లయితే మేలు కలుగుతుం దని అలాకాక "నేలవిడిచి సామునే జేయుదు నటన్న పుట్టు వెట్టి నవ్విపోడె వేమ", అంటారు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వంటి మహాకవులు తల్లిబాసను నేర్చుకోవటం వలన కలిగే ప్రయోజ నాలను పలురీతుల వెల్లడించారు. వేంకటకవి భావవ్యక్తీకరణలో చూపిన విలక్షణత ఈ సందర్భంలో భాషాభిమానుల మనస్సులకు హత్తుకుంటుంది.

"తేనెసోన వంటి తెనుగును దెగనాడి
యొౌత్తరాహుల కును నంజలించి
తిరుగుచున్నవారు తెనుగమ్మ బిడ్డలై
మొప్పెలగుచు దారి తప్పి వేమ."   87ప.

తేనె వంటి తెనుగును ఆదరించలేనివారు 'మొప్పెలు'గా వేంకటకవిగారికి కన్పట్టారు.

వ్యవహారంలో జారిపోతున్న, కనుమరుగవుతున్న విశేషమైన, అర్థవంతమైన పదప్రయోగాలు, సామెతలు 'త్రిశతి' రచనకు వన్నె చేకూర్చిన అంశాలు.'బుద్ధ, వేమ, గాంధి' – మూడు శతకాలు తెలుగు నుడికారపు సొంపును కమనీయంగా అద్దుకున్నాయి.

"గంజిగట్రద్రావగాలని నిఱుపేద
యందలములనెట్లు పొందగలడు
కూటిరాయి దీసికొనలేని బలహీను
డేటిరాయి తీయుటెట్లు వేమ."   70 ప.

'గంజి – గట్ర' ద్వంద్వ ప్రయోగం, బడుగువర్గాల జనజీవన స్రవంతిలోని వ్యవహారాన్ని పట్టి ఇస్తుంది. 'కూటిరాయి – ఏటిరాయి' వంటి సామెతలు తెలుగు వారికి వంశపారంపర్యంగా సంక్రమించిన ఆస్తి.

పద్యంచెప్పినా, గద్యం చెప్పినా, ప్రసంగం చేసినా సర్వాత్మనా తమ వ్యక్తిత్వాన్ని, ప్రత్యేకతను వెల్లడించు కున్న స్వేచ్ఛాపరులు వేంకట కవిగారు సాధారణంగా కవులకు రచన ఒకదారి, నిత్యజీవనగమనం ఒకదారి కావచ్చు. కాని కళాప్రపూర్ణ వేంకటకవిగారిలో రెండు మార్గాలు గంగా యమునల సంగమమై ప్రవహించాయి. ఆ సంగమ ప్రవాహానికి అంతఃస్రోతస్వినిగా వీరి ప్రజ్ఞా సరస్వతి భాసిస్తూ ఉంటుంది.

అలనాడు కొండవీటి రెడ్డిరాజుల అండదండలతో తెలుగు కవితా తరుణి గణుతికెక్కింది. ఈనాడు కొండవీటి సుకవి కుంజరుని తెలుగునుడికారంలో ఆటవెలది నాట్యమాడింది. తెలుగు యువత హృదయాలలో చేవను, స్వయంకృషిని ఉద్బోధించారు. మాత్సర్యా లను విడనాడి సౌమనస్యంతో సంచరించాలని సూచించారు.

తలపులకునెపుడు తఱిమెన వట్టిన
బాదరసమురీతి పరువులెత్తు
జూచి చూడకున్న సోమరితనమెచ్చి
భావములను మొండి పాఱు వేమ.   54 ప. అంటారు.

1960లో వేంకటకవి రచించిన 'త్రిశతి' లో వర్ణింపబడిన సామాజిక స్థితిగతులు నేటికీ సమాజంలో ఎదురవుతూనే ఉన్నాయి. క్రాంతదర్శనులు సంస్కర్తలు అయిన కవులు సమాజాభ్యుదయాన్ని కాంక్షించి చెప్పిన కవిత్వం అచ్చమైన అభ్యుదయాన్ని సాధించి జనులు వారి ఆలోచనలకు కార్యరూపాన్ని సంతరించటమే 'కవిభూషణుల'కు జాతి అందించే ఘనమైన నివాళి.

డా. బి. నాగశేషు
9985509053

ఉత్పత్తి కులాల కథలు

'నీకు ఇతరులు ఏంచేయకూడదని అనుకొంటావో అది నువ్వు ఇతరులకు చెయ్యకపోవడమే మహాభారత నీతి'

'నీవలెనే నీ పొరుగు వారిని ప్రేమించు – బైబిలు'

'బహుజన హితాయ బహుజన సుఖాయ. – బౌద్ధమతం'

'మసీదులో వరుసగా నిలబడి ప్రార్థించడం వెనుక మర్మం అందరూ సమానులే అనే సమానధర్మాన్ని బోధిస్తుంది ఖురాన్.'

ఈదేశంలో పేదవాడు తిండికి ఎతుక్కోవాలి, బట్టకు పాకు లాడాలి, ఇవి రెండూ కొంచెం తక్కువైనా పరవాలేదు సంపాదించు కోవచ్చు కానీ కులం తక్కువ కాకూడదు ఎందుకంటే ఇక్కడ గుణం కంటే కులమే ప్రధానం, భారత దేశంలో పరిపాలన చేస్తున్నది కులాలే. మనిషి జీవనానికి కారకాలైనవేవి ఎక్కువ తక్కువలు చూపవు, కానీ మనిషి మనిషిగా ఎదగడానికి కులాన్ని, మతాన్ని వాడుతూ హెచ్చు తగ్గులు సృష్టించేశాడు. కులం మురికి ఎన్ని సబ్బులతో ఉతికినా బండబారిన సమాజం అంత సులభంగా వదలదు.

కరుడుగట్టిన సామ్రాజ్యవాద భావాల్ని మనసునిండా నింపు కొన్న తెల్ల దొరలను కూడా వెల్లగొట్టగలిగాం. మనలోవుండే అనాగరిక ఆలోచనావిధానాల్నివీడలేకున్నాం. పూలే, అంబేద్కర్, గాంధీ జాషువా, భీమన్నలాంటి సంస్కర్తలు కులజాడ్యాన్ని రూపు మాపాలని, వారి ఉపన్యాసాలతో, రచనలతో విరామం లేకుండా కృతనిశ్చయంతో పోరాడారు, ప్రారంభకాలంలో నిరక్షరాస్యత, పేదరికం, మతం, దైవం, మూఢాచారాలతో జనం గాఢనిద్రలో వున్నారు తేరుకొనేలోపు తీరని నష్టాన్ని మూట కట్టుకొని ఇప్పటికీ మోస్తున్నారు.

చదువును కులవృత్తిగా చేసుకొన్న కులాలు ఉత్పత్తి కులాలపై పెత్తనం చలాయించడం మొదలు పెట్టారు ఈ ఆదిపత్యం అనేది అక్కడనుండి ప్రారంభం అయ్యింది దీనికి తోడు సాహిత్యం అంతా అగ్ర కులాలవారిదే, ధిక్కారణకి అవకాశం లేకుండా పోయంది తిరగబడే తెగింపు బొత్తిగా రాలేకపోయింది దేశానికి తిండి పెట్టేవారు పనిలో నిమగ్నమైపోతే చదువుకొన్నకులాలు శ్రామికుడి కులాన్ని కుత్సిత కలాలతో కలుషితం చేశారు. ఉత్పత్తి కులాలు వారి గురించి తెలుసుకోనేలోపు జరగాల్సిన నష్టం జరిగిపోయె, సాహిత్యంలో మార్పుకోసమో సానుభూతికోసమో 1925 నుండి దళితుల్లో చైతన్యం నింపే కథలు దూసుకు వచ్చాయి. శ్రీపాద 'సాగరసంగమం' 'పుల్లం రాజుకథ' ఇలాంటి తవ్వాయివస్తే వేలూరి శివరామశాస్త్రి, మాలదాసరి కథ 1933,

కరణకుమార, ప్రోలయ్య 1937 అనిశెట్టి సుబ్బారావు, పాకిది 1943, చలం ఆరాత్రి 1945, మాగోఖలే 'మత్తాలుకూతురు' 1956, కరుణకుమార 'కొత్తచెప్పులు' 'సేవాధర్మం' కా.రా. జీవధార, కాలువ మల్లయ్య, అగ్నిగుండం, కొత్తకులాలు, దొరగారిదొడ్డి, వెలి, భస్మాసుర హస్తం, బాకీబతుకు, టి. గోపి అమ్మగార్లేనా మనుషులు, కలువ కొలను సదానంద 'మాలమనిషి' బమ్మిడి జగదీశ్వరరావు, జలగ కథలు, పులికంటి కృష్ణారెడ్డి 'కోటిగాడు స్వతంత్రుడు' సబ్బు కీచక వధ, చెంబుకోగంగ మధురాంతకం రాజారాం, అజ్ఞాతవాసం బి. ఎస్. రాములు 'బంది' దక్షయజ్ఞంపాలు, సదువు. సింగమనేని నా ముఖసముఖం, ఉచ్చు ప్రజాపోరాటాలే జీవితంగా భావించే అల్లం రాజయ్య, ఎదురుతిరిగితే, రాసాని, హెూమం, అక్షింతలు సుంకిరెడ్డి వెంకటరెడ్డి చనుబాలు, కేతు విశ్వనాథరెడ్డి 'ఒకజీవుడి వేదన' శిలువ వేసిన మనుషులు, చీకటినాడి, మరిగేనెత్తురు మార్పు, మంత్రసాని, శాంతినారాయణ, బొమ్మా – బొరుసు విద్వాన్ దస్తగిరి, రొట్టెముక్క రాజగోపాల్ ఒక్కపిడికిలిచాలు ఈ కథలన్నీ కులం నిర్మూలన జరిగి మనుషులంతా సమాలనులే అని చాటడానికి ఉద్భవించిన కథలే.

సమస్యను స్వతహాగా అనుభవించి రాసినవారు బోయభీమ న్నతో ప్రారంభమై దళిత ఉద్యమ పతకాన్ని ఎగరవేసే స్థాయికి కథను తీసుకొన్చిన ప్రముఖ కథకులు కొలకలూరి ఇనాక్.ఊరబావి 1969. ఆకలి, క్షమాభిక్ష, కొలుపులు, అస్పృశ్యగంగ, విఘ్న వినాయ కుడు మొదలయిన కథలన్నీ కనీస అవసరాలకోసం పోరాడే కథలే. ఇనాక్ గారి తరువాత నాగప్పగారి సుందర్రాజు 'మాదిగోడు' కథలు తీవ్రంగా తిరగబడేలావుంటాయి. ఎండ్లూరి 'దరువు' బతుకు – మెతుకు, కథల్లో ప్రశ్నించేతత్వం కనిపిస్తుంది ఈ దేశంలో పొలాలకు కులాలుంటాయి. కులాలకు పొలాలుంటాయి. ధైర్యముంటే గవర్న మెంట్ని ఈ రెంటిని రద్దు చేయమనండి అంటాడు.

రాయలసీమ కక్షల్లో మాల, మాదిగులు ఎలా సమిధుల య్యారో చిలుకూరి దేవపుత్ర కథల్లో కనిపిస్తుంది.

మనిషి కనీస అవసరమైన తాగునీటికి కూడా నోచుకోని దళిత ఉదంతాలు చెంబుకోగంగ, చెలిమి, ఆఖరుతడి, మృత్యుజలం, ఊరబావి, ఊటబాయి, హెూమం, కయ్యకాలువ చెలమ, లాంటి కథలే కాకుండా దళితుల నీటి అవస్థలు అడుగడుక్కి కనిపిస్తాయి. దళిత కవయిత్రులు కూడా దళితుల స్థితిగతులపై తమ వాణిని వినిపించారు, మంగాయమ్మ 1935 అయ్యోపాపం కథానిక తాగ దానికి గుక్కెడు నీళ్ళివ్వని కథ, చుండూరు రమాదేవి ధర్మతల్లి, అయ్య పెళ్ళి వారులక్ష్మి, ధన్యజీవు, దూతుర్తి లక్ష్మీనరసమ్మ, ప్రణయత్యాగం లాంటి కథలు దళితుల సమస్యలను, అస్పృశ్యతా నివారణా అవస రాన్ని తెలుపుతాయి. జాజులగౌరి, మన్నుబువ్వ. దావినోదిని, బాగలేదు జరమొచ్చింది. జూపాక సుభద్రరాసిన, శుద్ధి జెయ్యాలె. దాసరి శిరీషరాసిన 'వ్యత్యాసం' కథ గోగుశ్యామల రాసిన ఏనుగంత

తల్లికన్నా ఏకుల బుట్టంత తల్లినయం ఈ అన్ని కథల్లోను ఆకలి, అంటరానితనం, పేదరికం సమస్యలు దళితుల్ని ఎంతగా కిందకు పడేశాయో తెలుపుతాయి. దళితుడు కులసమస్య మిగతా సమస్యల్ని ఎదుర్కొని నిలబడాలి, దళితేతరులు కూడా పై సమస్యలను ఎదుర్కో వాల్సి వుంది కాకపోతే డోసు కాస్త తక్కువ. అందువల్లే ఈ కింది కులాలన్నీ ఏకమైతే, చరిత్రను తిరగరాయొచ్చని మంది కలిశారు ఆమందికే బహుజనులు అనే పేరు. పూర్వం మూలవాసులే ఇప్పుడు బహుజనులు అనుకోవచ్చు

"భారతదేశంలో బహుజనులు" అనే మాట 1984 ఏప్రిల్ 14వ తేది దాకా వినడబడలేదు. బహుజన సమాజ్ పార్టీ స్థాపనతో ఆ భావన వచ్చింది. మనువాద వ్యవస్థవల్ల భంగపడ్డ షెడ్యూల్డు కులాలు షెడ్యూల్డు తెగల వెనకబడిన తరగతులతో పాటు మత పరంగా అసంఖ్యాకులైన ముస్లిం, క్రైస్తవ పార్సీ, బౌద్ధులంతా బహుజనులవుతారని పార్టీ ప్రణాళికలో చేర్చింది. అగ్రవర్ణ హిందూ భావజాలం కులం, మతం పేరుతో నష్టపోయిన వాళ్ళందరూ బహు జనులే. కంటికి కాయ గడ్డలుగా ముడి పదార్థాలను ఆహారంగా మార్చిన ఆదివాసుల అన్వేషణ భారదేశ సంస్కృతికి తొలిమెట్టు, చర్మాన్ని తోలుగమార్చి, ఆ పరిశ్రమలో చెప్పుడప్పునుసృష్టించిన మాదిగ పరిశ్రమ ఈ దేశ చరిత్రకు రెండవమెట్టు. ప్లేటోకుసైతం కర్రా, కత్తిసాము తెలియనిరోజుల్లోనే సభ్యసమాజంగా రూపొంది. గ్రామ రక్షణకు పూనుకొన్న మాలతత్వం మూడోమెట్టు, మురికిలో జీవించే సన్యాసికి బట్టశుభ్రత నేర్పిన చాకళ్ళు తిన్నతిండి ఒంటబట్టకుండా చేసి తలబరువును వదిలించే మంగళ్ళు ఈ చరిత్రకు నాలుగోమెట్టు, గొడ్డు మాంసం, గొర్రెమాంసం, బర్రె పాలు, ఆవు పాలు, ఆహారంలో భాగంగా మార్చిన గొల్ల కురుమలు ఐదోమెట్టు, మట్టి ముద్దను నాగరికతకు గుర్తుగా మార్చినకుమ్మరి, ఇనుమును కాల్చి కత్తిగా, సుత్తిగా మలచిన కమ్మరి, కర్రను నాగలిగా మలచిన వడ్రంగి ఈదేశపు మెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రాణం పోసిన వాళ్ళు వాళ్ళు ఆరోమెట్టు. అంటూ కంచెఐల య్య శ్రమజీవులు ఈ దేశ ఉత్పత్తికి అభివృద్ధికి ఆరోమెట్టూ అంటూ ఉత్పత్తి కులాల ప్రాధా న్యాన్ని, సమాజానికి వీరు ఎంత ముఖ్యమో కూడా తెలియజేశారు.

1960 దాక కథా సాహిత్యంలో చదువుకొన్నవారందరూ బ్రాహ్మణవర్గం కావడంతో వాళ్ళ కథలే వచ్చాయి. శ్రామిక వర్గకథలు రాలేదు. 1920 – 25 మధ్య చింతా దీక్షితులు రచించిన 'దాసరి పాట' తొలి తెలుగు వృత్తికథ. 1928లో ఆదిరాజు వీరభధ్ర రావు ఆదిలక్ష్మికథ. 1932లో దామర్ల కాంతారావు రాసిన భగ్నప్రేమ, 1954లో జి. రాము రాసిన ఆత్మఘోష పద్మసాలీ జీవనపోరాటాన్ని చిత్రిస్తూ బహుజన జీవితాల వాస్తవికతకు నాంది పలికిన కథగా చెప్పుకోవచ్చు. తరువాత పెరటిచెట్టు 1954లోనే వచ్చింది. ఇది గీతకార్మికును చిత్రించిన కథగా మొదటిది అని చెప్పవచ్చు 1953లో విశ్వ కర్మల (వడ్రంగి, కమ్మరి, కంచరి, శిల్పి, స్వర్ణకారి పారిశ్రామికీ కరణ వీరిలో చాలామంది బతుకులు పోగొట్టుకున్నారు. వీరిలో వడ్రంగి జీవితాన్ని చిత్రించే కథ. 1953లో బొమ్మరెడ్డి పల్లి సూర్యరావు రాసిన విశ్వకర్మ అకలిని తెలిపేకథ. 1956లో కెకె. వెంకటరావురాసిన కొత్తగాలి రైతు, వడ్రంగి అనుబంధాన్ని తెలిపే కథ. పై వృత్తులను చేసే వారందరినీ ఊరమ్మడి వ్యక్తులుగా భావిస్తారు. దళితవాదంతో ఎంట్రీ ఇచ్చి బహుజన వాదాన్ని కూడా తన రచనలద్వారా తీసు కొచ్చిన కొలకలూరి ఇనాక్ తలలేనోడు కథ శిల్పంలోను వస్తువులోను కథా సాహిత్యంలో ఒక పెనుమార్పు. 1989లో డాక్టర్ లంకిపల్లె కన్నయ్యానాయుడు రాసిన వెన్నెల బొమ్మలు, మత్స్యకారుల జీవితాలను తెలిపే కథ, సురవం ప్రతాపరెడ్డి రాసిన నిరీక్షణ,1958లో జి. రామ కృష్ణ రాసిన గంగపుత్రుడు సముద్రంలో చేపలు పట్టే వ్యక్తి. అతని వృత్తిని గ్లోబలైజేషన్ ఎంతప్రభావితం చేసిందో చెప్పేకథ.

అడవి బాపిరాజు రాసిన బొమ్మలరాణి 1935లో వచ్చింది. తోలుబొమ్మలాట లాడి జీవించేవారికథ. వడ్డెర్ల జీవితాను చిత్రించిన మొదటికథ 1984లో వచ్చింది పప్పల నరసింహం రాసిన కను పాపను కబళిస్తే. దొమ్మర్ల జీవితాన్ని చిత్రించేకథ 1985లో వచ్చింది బందరు దుర్గాప్రసాద్ రాసిన తప్పెవరిది. యాదవులకథ

గ్లోరామప్ప, పాలముర్తి వెంకటనరసింహారావు, కిశోర్ శత్రు నేర్పిన పాఠం, బోయజంగయ్య దొంగలు తోడేళ్ళు, కె. రామ మోహన్ రాజు గొల్లకథ, వి.ఆర్. రాసాని నేరాలిన వసంతం, సొతం త్రదినం. కె.కె. మీనన్ భయం, భూపాల్,

అంబల్లబండ, కాలువమల్లయ్య, అడవికాచినవెన్నెల కె.వర లక్ష్మి, మట్టిబంగారం, పెద్దింటి అశోక్ కుమార్, ఇగురం, నందిని సిద్ధారెడ్డి, పుల్లర, నల్లభూమయ్య, గొల్లమల్లక్క మొదలైన కథలు యాదవుల జీవితాల్లోని అనేక పార్వాలను పొడచూపాయి. కథా సాహిత్యంలో బి.సి. కథా సాహిత్యం ఒక మైలురాయి. దేశానికి పాలు పెరగు మాంసాన్ని ఉత్పత్తి సరఫరా చేసే అంశంలో యాదవుల కురుబల పాత్ర కీలకమైనది. వీరి కథలు ఇంకా రావాల్సిన అవసరం వుంది.

వృత్తికథల్లో విరివిగా వచ్చిన కథలు చేనేత వృత్తిమీద, బహుశ వీరి ఆకలి కేకలు కూడ ఎక్కువని చెప్పవచ్చు. వరలక్ష్మమ్మ కుటీర లక్ష్మితో ప్రారంభమై దామెర్ల రమాకాంతరావు, భగ్నప్రేమ,టేకుమట్ల కామేశ్వరరావు అవకాశముంటే, అందె నారాయణస్వామి శిల్పి సన్మానం, కనకసుందరరావు హత్య, ఎన్నార్ఛాలా, నూలుపోగు, రావూరి వెంకట సత్యనారాయణరావు మధుపర్కాలు, కేశకరువు ఐతా చంద్రయ్య చిలకపట్టుచీర, అమ్మమ్మ ఆరాటం, జూకంటిజగన్నాథం. మునిపల్లెరాజు చేనేత చిత్రం, దాదాహయత్ ఏడుఒడ్డు చేపలు, ఇంకా అనేక కథల్లో చేనేత వృత్తిదార కష్టాలు తెలియచేశారు.రజక కులాల కథలు 1970లో పిండీకృతశాటి చాకలివాళ్ళ సమగ్ర జీవనాన్ని తెలిపేకథ, అట్టాడ అప్పలనాయుడుగారి పువ్వుల కొరడా, ఏ.వి. రెడ్డి శాస్త్రి, ఈమంటలుచల్లారవు. కాలువ మల్లయ్య దొరసాని చీర. గంటేడు గౌరవనాయుడి విముక్తి, పెద్దింటి అశోక్ చాకిరేవు, జి. వెంకటకృష్ణ కాలినగూడు ఇలా రజకుల వృత్తి జీవితాల్లోని సుడిగుండా లను తెలిపారు.

(తరువాయి 46వ పుటలో...)

లయ
9494393764

ఆదివాసీ ప్రాంతాల్లోని వివిధ రకాల ఆహార పదార్థాలు

ముందుమాట : గత సంవత్సరం లయ సంస్థ 'కమ్యూనిటీ కాలేజి' మొదటిగా 'కమ్యూనిటీ ఆయుర్వేద ప్రాక్టిషనర్స్ (కాప్) 'ప్రజా ఆయుర్వేద వైద్యులు' - అనే సర్టిఫికెట్ కోర్సు (వృత్తి విద్యతో) ప్రారంభించింది. మొదటి బ్యాచ్ ఆగస్టు 2018 నుండి ఫిబ్రవరి 2019 మధ్య పూర్తి అయ్యింది. 20 మంది ఆదివాసీ యువతీ యువకులు ఈ కోర్సులో శిక్షణను పూర్తి చేసుకొన్నారు.

శిక్షణలో భాగంగా ఆదివాసీ అభ్యర్థులు తమ ఆదివాసీ ప్రాంతాలలో దొరికే ఆహారం. అడవిలో సహజ సిద్ధంగా లభించే మరియు ఆదివాసీ రైతులు సాగుచేసే వివిధ రకాల పండ్లు, ఆకు కూరలు, దుంపలు, చిరు ధాన్యాలు, పప్పు ధాన్యాలు, అవి దొరికే కాలాలు, వినియోగం, వాటి ఉపయోగాలపై వారి వారి గ్రామాల్లో పెద్దలతో చర్చించి, ఆ సమాచారాన్ని తిరిగి తరగతులలో పంచుకొన్నారు. ఇది ప్రధానంగా తూర్పు గోదావరి మరియు విశాఖ జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాలకు సంబంధించిన సమాచారం. ఆ సమాచార సారాన్ని లయ సంస్థ, ఆరోగ్య విభాగం (హెల్త్ యూనిట్) ఒక పట్టిక రూపంలో అమర్చింది. దీనిని 'మన్నెంలో' పాఠకుల కొరకు అందిస్తున్నాము.

పండుపేరు	దొరికే కాలం	ఉపయోగాలు
1. మామిడి	ఎండాకాలం	శరీర వేడిని నియంత్రిస్తుంది. బలాన్నిస్తుంది.
2. పనసపండు	ఎండాకాలం	జీర్ణశక్తి పెరుగుతుంది. మల విసర్జన సులభంగా అవుతుంది.
3. సీతాఫలం	వర్షా, శీతాకాలం	ఆరోగ్యకరం, పిల్ల తల్లులకు పాలు పడతాయి.
4. రామాఫలం	ఎండాకాలం	సూక్ష్మ క్రిముల (బాక్టీరియా)ను నివారిస్తుంది.
5. లక్ష్మణఫలం		కేన్సర్ నయం చేస్తుంది
6. జీడిమామిడి	ఎండాకాలం	బలాన్నిస్తుంది, పోషకాహారం
7. నల్ల జీడిపళ్ళు	ఎండాకాలం	కాళ్ళ పగుళ్ళు, నొప్పులను నివారిస్తాయి (పిక్కలు)
8. నేరేడు పళ్ళు	శీతాకాలం	మధుమేహాని(షుగర్)కి, రక్తపుష్ట, కడుపులోని తల వెంట్రుకలను కరిగిస్తుంది.
9. జామకాయ	శీతాకాలం	మధుమేహాని(షుగర్)కి, జీర్ణశక్తికి, సులభ మలవిసర్జనకు, కడుపునొప్పి నివారిస్తుంది.
10. బొప్పాయి	అన్నికాలాలు	చలువ చేస్తుంది. కంటి చూపు పెరుగుతుంది. పిల్ల తల్లులకు పాలు పడతాయి.
11. దానిమ్మకాయ	శీతాకాలం	జీర్ణశక్తి, రక్త పుష్టికి సహకరిస్తుంది.
12. బత్తాయి	శీతాకాలం	శరీరానికి చలవ చేస్తుంది, బలం
13. నారింజ	శీతాకాలం	రక్తపుష్టి, గర్భిణీలు తినడం వల్ల సులభ ప్రసవం
14. కమలాపండు	శీతాకాలం	రక్త ప్రసరణకు తోడ్పడుతుంది
15. దబ్బపండు	ఎండాకాలం	పైత్యాన్ని / కఫాన్ని తగ్గిస్తుంది
16. అనాస(పైనాపిల్)	అన్ని కాలాలు	శరీర వేడిని తగ్గిస్తుంది
17. తుమ్మిక పళ్ళు	శీతాకాలం	రక్తపుష్టి కలుగుతుంది
18. కాండ్రేగి పళ్ళు	శీతాకాలం	
19. పరిమిత పళ్లు	ఎండాకాలం	
20. పిల్లిబొడ్డపళ్ళు	ఎండాకాలం	
21. జాలిక పళ్ళు	ఎండాకాలం	
22. అల్లి పళ్ళు	వర్షాకాలం	షుగర్ వ్యాధి తగ్గిస్తుంది, రక్తపుష్టి
23. బల్లి పళ్ళు	శీతాకాలం	
24. బొడ్డపళ్ళు	అన్ని కాలాలు	
25. పాలపళ్ళు	వర్షాకాలం	మంచి పౌష్టిక ఆహారం

[redacted]

ఆకు కూరలు

ఆకు పేరు	దొరికే కాలం	సుమారుగా నెలకు ఎన్నిసార్లు తింటారు/తినేవారు	ఉపయోగాలు
1. మండి కూర	అన్ని కాలాల్లో	4-5	జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చేదుగా ఉండడం వల్ల కడుపులో బాక్టీరియా నశిస్తుంది
2. గొడ్డుకూర	ఎండాకాలం	6-7	ఆకలిని పెంచుతుంది. బలాన్నిస్తుంది. మల విసర్జన సులభంగా అవుతుంది. మూలశంఖను నివారిస్తుంది.
3 సారు కూర	అన్ని కాలాల్లో	10-15	కీళ్ళ నొప్పులు తగ్గిస్తుంది. చలవ చేస్తుంది
4. రాయిసారు కూర	ఎండాకాలం		
5. తెడ్డు కూర	వర్షాకాలం	7-8	
6.గుమ్మడి కూర	వర్షాకాలం	6-7	శరీరంలోని బాక్టీరియాను నివారిస్తుంది.
7. గుమ్మ కోనలు	శీతాకాలం		కంటి చూపుకు మంచిది.
8.కొంకడి కూర	వర్షాకాలం	5-6	మలబద్దకం, అజీర్ణం తగ్గిస్తుంది
9. బచ్చలి కూర	అన్ని కాలాల్లో	5-6	శరీరంలో రక్తం పెరగడానికి సహకరిస్తుంది.
10. తోటకూర	ఎండాకాలం	7-8	విటమిన్ - ఎ, మలబద్దకం తగ్గుతుంది.
11. పాలకూర	ఎండాకాలం	2-3	రక్తం, కంటి చూపు, జ్ఞాపకశక్తి పెరుగుతాయి.
12. గురుగుకూర	వర్షాకాలం	7-8	రక్తశుద్ధి, వృద్ధి, కంటి చూపు, జ్ఞాపకశక్తి పెరుగుతాయి
13. డోగ్గలి కూర			ఆయాసం తగ్గుతుంది
14. చేమ ఆకుల కూర			మల, మూత్ర సమస్యలు తగ్గుతాయి.
15. గోంగూర	వర్షాకాలం	5-6	విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇది యాంటీ - వైరస్‌గా పనిచేస్తుంది
16. కొడ్లెపు కూర	ఎండాకాలం	2-3	నోటి పూతను నివారిస్తుంది
17. గాజు కూర	ఎండాకాలం	2-3	ఒంట్లో నీటి శాతాన్ని పెంచుతుంది

దుంపలు

దుంప పేరు	దొరికే కాలం	నెలకు ఎన్నిసార్లు తింటారు/తినేవారు	ఉపయోగాలు
1. కంద దుంపలు	ఎండాకాలం	4-5	బలానికి ఉపయోగపడతాయి.
2. చవిడి దుంపలు	ఎండాకాలం	3-4	డయేరియాను నివారించి, బలాన్నిస్తాయి.
3.పిండి దుంపలు	ఎండాకాలం	5-6	విరోచనాలను తగ్గిస్తాయి, బలాన్నిస్తాయి.

దుంప పేరు	దొరికే కాలం	నెలకు ఎన్నిసార్లు తింటారు/తినేవారు	ఉపయోగాలు
4. చేద దుంపలు	శీతాకాలం	3-4	నులి పురుగులకు మంచి మందు
5. చేమ దుంపలు	అన్ని కాలాల్లో		మలబద్ధకాన్ని నివారిస్తాయి.
6. మాటుం దుంపలు /పెండలం	శీతాకాలం, ఎండాకాలం	4-5	కండరాలకు బలాన్నిస్తాయి
7. కుంద దుంపలు	శీతాకాలం	3-4	శరీరానికి బలాన్నిస్తాయి
8. సలువ దుంపలు	అన్ని కాలాల్లో	5-6	
9. తియ్యదుంపలు	ఎండాకాలం	5-6	
10. సారు దుంపలు	ఎండాకాలం	5-6	
11. నాగలి దుంపలు	ఎండాకాలం	5-6	
12. గుల్లి దుంపలు	ఎండాకాలం	3-4	
13. కర్ర పెండలం	శీతాకాలం	3-4	
14. తేగ దుంపలు	వర్షాకాలం	5-6	ఉబ్బసాన్ని, శరీరంలో నీటి శాతాన్ని తగ్గిస్తుంది. బాలింతరాళ్లకు మూత్ర సమస్య నివారణకు పనికి వస్తుంది.
15. వైప దుంపలు	శీతాకాలం		కండరాలకు బలాన్నిస్తుంది. మల విసర్జన సులువుగా అవుతుంది.
16. నార దుంపలు	శీతాకాలం		రక్తం ఏర్పడుతుంది, బలహీనత తగ్గుతుంది.

చిరు ధాన్యాలు, పప్పులు, పిక్కలు

దాన్యం/పిక్కపేరు	దొరికే కాలం	నెలకు ఎన్నిసార్లు తింటారు/తినేవారు	ఉపయోగాలు
1. చోళ్ళు / రాగులు	శీతాకాలం	5-6	రక్తపుష్టి బలం, రక్తపోటును తగ్గిస్తాయి
2. సామలు	శీతాకాలం	5-6	బాలింతలకు మంచిది, బలాన్ని, వేడిని ఇస్తాయి. కంటి చూపుకు మంచిది.
3. గంటెలు	వర్షాకాలం	5-6	బలాన్నిస్తాయి, విటమిన్లు ఉంటాయి.
4. కొర్రలు	శీతాకాలం	5-6	పురటాలకు మందుగా ఉపయోగపడతాయి
5. జొన్నలు	శీతాకాలం	5-6	శరీరానికి వేడిని, బలాన్నిస్తాయి
6. బొంతలు		5-6	
7. బుడమలు	శీతాకాలం	3-4	
8. వెదురు కటుకులు (బియ్యం)			బలాన్నిస్తాయి
పిక్కలు / పప్పులు			
9. చింత పిక్కలు	ఎండాకాలం	5-6	కీళ్ళనొప్పులు తగ్గుతాయి.
10. చిక్కుడు పిక్కలు	ఎండాకాలం	5-6	బలవర్దకమైన ఆహారం
11. అడ్డ పిక్కలు	ఎండాకాలం	3-4	జిగట విరోచనాలు, ఎర్రబట్ట నివారణ
12. టంగుడు పిక్కలు	ఎండాకాలం		
13. టెంక అంబలి	ఎండాకాలం	5-6	మూలశంకకు వాడతారు, బలాన్నిస్తుంది, తెల్లబట్ట వ్యాధి నివారిస్తుంది
14. జీరుగు అంబలి	ఎండాకాలం		తెల్లబట్ట వ్యాధి నివారిస్తుంది.
15. రాజమా/నేలచిక్కుళ్ళు	”		బలవర్థకమైన ఆహారం

పిక్కలు / పప్పులు	దొరికే కాలం	నెలకు ఎన్నిసార్లు తింటారు/తినేవారు	ఉపయోగాలు
16. బొబ్బర్లు	ఎండాకాలం	5-6	కాళ్ళ వాపులు తగ్గిస్తాయి, మంచి బలం
17. అలసందలు	ఎండాకాలం		కిడ్నీలను శుభ్రపరుస్తాయి
18. మినుములు	శీతాకాలం		బలాన్నిస్తాయి, రొంపను నివారిస్తాయి
19. బస్తరు పిక్కలు	శీతాకాలం		
20. జొట్ట పిక్కలు	శీతాకాలం		బలాన్నిస్తాయి, రొంపను నివారిస్తాయి
21. కొండ కందులు	శీతాకాలం		శరీరానికి వేడిని, శక్తిని అందిస్తాయి
22. ఉలవలు చలవల	శీతాకాలం		చిన్నపిల్లలకు, బాలింతలకు శక్తిని ఇస్తాయి. గర్భినీ స్త్రీలకు మంచిది, చేస్తుంది. ఫిట్స్ వ్యాధి నివారణకు, ఊబకాయం తగ్గడానికి వాడుతారు.
23. అనుములు	శీతాకాలం		
24. తిమిరేలు	శీతాకాలం		చర్మానికి వేడినిస్తాయి.
25. తొండగుడ్ల కందులు	”		
26. కందులు			వేడిని పెంచుతాయి. బలాన్నిస్తాయి
27. పెసరాలు			మలేరియాను తగ్గిస్తాయి.
28. శనగలు			బలాన్నిస్తాయి
29. నువ్వులు			బలాన్నిస్తాయి, తలలో వేడిని తగ్గిస్తాయి.

ముగింపు :

పైన పేర్కొనబడిన అన్ని రకాల ఆకు కూరలు, సహజ సిద్ధమైన పండ్లు, పిక్కలు / పప్పులు, దుంపలు మొదలైనవన్నీ గతంలో ఎంతో విస్తారంగా దొరికేవి, కానీ నేడు అవి చాలా పరిమితం అయిపోయాయి. కొన్ని రకాలు దాదాపుగా నశించిపోయాయని చెప్పవచ్చు. ఇందుకు ప్రధాన కారణం రోజు రోజుకూ అటవీ విస్తీర్ణం తగ్గిపోవడమే. అలాగే ప్రస్తుతం ఆదివాసీ సమాజంలో ముఖ్యంగా యువతరంలో వస్తున్న ఆహారపు అలవాట్లలోని మార్పు కారణంగా అడవిలో దొరికే ఫలాలు, ఆకులు, దుంపలు తినడం అనేది బాగా తగ్గిపోయింది. నిజానికి, దుంపలు త్రవ్వడం చాలా కష్టమైన పని. అయితే అప్పట్లో, ఆహారం దొరికేది కాదు కాబట్టి తప్పనిసరై అడవికి వెళ్ళి వాటిని సేకరించుకోవడం తప్పా వేరే మార్గం ఉండేది కాదు. అయితే ఇప్పుడు ఇతర రకాల ఆహారం దొరుకుతుండడం వల్ల యువత ఎవరూ కష్టపడి ఈ దుంపలు త్రవ్వి తెచ్చుకోవడానికి ఇష్టపడడం లేదు. అలాగే తినిడం లేదు కూడా. అలాగే ఆదివాసీ రైతులు సాగు చేసే వివిధ రకాల పప్పు దినుసులు కూడా క్రమేపీ తరిగి పోతున్నాయి. (ఉదాహరణకు పై పట్టికలో మార్కుతో గుర్తించబడిన ఆహార పదార్థాలు ప్రస్తుతం చాలా అరుదుగా కన్పిస్తున్నాయి. 25 సంవత్సరాల క్రితం ఇవి అధిక మొత్తంలో కనిపించేవి). ఇందుకు కారణాలు అనేకం.

ఆ రోజుల్లో పప్పు దినుసులు ముఖ్యంగా శీతాకాలంలోనే ఎక్కువగా చేతికి వచ్చేవి. అయితే వాటిని దాచుకొని, ఇంచుమించు సంవత్సరం పొడవునా నెలకు రెండు మూడుసార్లు ఒకప్పుడు ఆదివాసీ ప్రాంతాలలో మంచి పౌష్టికాహారం అందించిన ఈ ఆహార పదార్థాలు నశించిపోవడం బాధాకరం, వాటిని ఎలాగైనా కాపాడుకోవడం ఎంతైనా అవసరమనేది ఆయా ఆదివాసీ గ్రామాల్లోని పెద్దల అభిప్రాయం.

(**'మన్నెంలో'** పత్రిక
జనవరి - మార్చి 2019 సంచిక సౌజన్యంతో)

**శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు
మానసిక వికాసానికి తల్లి భాష
గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు
విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.**

తెలుగులో రాయలేని, రాయని అధికార్లను నిలదీయండి

నంద్యాల నారాయణ రెడ్డి
9360514800

సొతంత్రకాల సదువులు

'అమ్మనుడి' చదువరులకు నంద్యాల నారాయణరెడ్డిగారి గురించి, ప్రత్యేక పరిచయం అవసరం లేదు. హోసూరు ప్రాంత తెలుగు భాషోద్యమంలో వారిది పెద్ద పాత్ర. కృ.ష్ణ.రసం (కృష్ణగిరి జిల్లా రచయితల సంఘం' లో వారిది ముందు నడక. కతలను, కవితలను, వ్యాసాలను, వ్యంగ్య బాణాలుగా భాషోద్యమంలో గురిపెట్టడంలో అందెవేసిన చేయి. ఎనిమిదేళ్ల క్రితం 'నడుస్తున్న చరిత్ర' లో వీరు వ్రాసిన 'ఇరుల దొడ్డి బతుకులు' ధారావాహికగా వెలువడి, చదువరుల మన్ననలను అందుకొన్నాయి. అటువంటి మరొక రచన 'సొతంత్రకాల సదువులు'. పొరుగు తెలుగు బతుకులలోని ఒక సాంఘిక చరిత్ర ఈ రచన. ఇది కూడ అమ్మనుడి చదువరులను అలరింపజేసి, ఆలోచింపజేస్తుందని మా నమ్మకం. – సంపాదకులు



అందరికీ దండాలు. మాది హోసూరు తావు. నూటికి అరవైమంది తెలుగువాళ్లే బతకతుండే తెలుగురాజ్యం ఇది. కన్నడ, తమిళ, మరాటి, ఉరుదూ నుడులవాళ్లు కూడా ఇల్లుదాటి బయటి కొచ్చినంక తెలుగునే నుడివే నాటుతెలుగు నేల మాది. ఇక్కడ తెలుగు వాళ్లము ఎప్పటినింకా ఉంటా వుండామో తెలుసా? తెలుగు పుట్టిన పుటినింకా, మనిషి గొంతులో నుడి పుట్టినప్పటి నింకా. అంత వెనిక్కి మిమ్మల్ని తోడుకొనిపోయే సత్తువ లేని వాడిని. దానికనే సొతంత్రకాలం కంటా పోయేసి వద్దాము.

అరవై దెబ్బై ఏండ్ల కిందటి అందమైన కాలం అది. అరవం అనే మాటే మా చెవుల్లో పడని కాలం అది. తమిళ దొరతనపు పెనురక్కసి తొక్కిడికింద తెలుగమ్మ నలిగిపోని కాలం అది. ఆకాలంలో ఓసూరు పేటకు ఐదుమైళ్ల దూరంలోని మా నల్లూరు అగ్రహారం ఎట్లుండేదో తెలుసా?

వీదికి రెండు పక్కలా సోలు (వరుస)గా పెంకులిండ్లు; ఇంటింటికీ ముందు నిలువెత్తున నిలిసిన జగుల్లు (అరుగులు); నాలుగీదులకూ నడుమన లక్ష్మీనారాయణుని గుడి; ఆ పక్కనే రచ్చ; రచ్చమీద పెనేసుకోని ఎదిగిందే వేప, రాగి మానులు; మాను నీడన నాగుల అశ్వత్తులు ఉండే చిన్నగుడి; మానులపైన చిలిపిలి పలుకుల వేలాది చిలకలు, కోకిలలు, కాకులు, గువ్వలు; పదూర్ల జనం సంత తావున కూడినట్ల, పొద్దునా మాపునా ఆ గువ్వల కూతల సందడి; వాళ్లు లేసి కోళ్లను లేపే మా అమ్మట్లా తల్లులు; అంత పొద్దుకే 'అమ్మమ్మా మాయమ్మా మము గన్నతల్లీ' అంటా రాగుల్నీ గింజల్నీ విసురుకొంటా రాగరాయి (విసుర్రాయి) తావ పదం ఎత్తుకొనే వాళ్లు; 'సువ్వీ కస్తూరి రంగా సువ్వీ కావేటి రంగా' అంటా రోట్లోని వడ్లను రోకలితో దంచతా సువ్విపాటను పాడేవాళ్లు; 'వన్నమ్మ చెన్నమ్మ వదినమరదాళ్లూ...' అంటా చల్లగుత్తి (కవ్వం) కి వంత పలికేవాళ్లు; ఊరుబావి తిరిగెన్ల (రాట్నాల) తాళాలకు 'నోమి నోమన్నాల నోమన్నలాల...' అంటా రాగాన్నందించేవాళ్లు; ఆవులింట్లో పేడనూ చెత్తనూ బెవరి (జవిరి) మక్కర్లకు (గంపలకు) నింపతా 'ఎందుండి వస్తీవి తుమ్మీదా ఏవూరు నీవూరు తుమ్మీదా' అని కైవారం తాతగారి తత్వాలను పాడుకొనేవాళ్లు; ఆవుల నోళ్లకు జొన్నకడ్లను అందిస్తా 'ఇచ్చాకు కుల తిలక ఇకనైన పలకవే రామసెంద్రా' అని రామదాసులయిపోయి వగసేవాళ్లు; గంగెద్దులు, బుడిబుడికలు, చెన్నదాసర్లు, బుడిగ జంగాలు, దొమ్మరోళ్లు, రోకలాటలు, నయ్యాండి కుణుసులు (చిందులు), వీరబద్ర పూనకాలు,



కోలాటలు, కేళికలు, పండరి బజనలు, తోలుబొమ్మలాటలు, కొయ్యబొమ్మలాటలు, యచ్చగానాలు; పండగలో ఎద్దులకు కుచ్చులు పెరికేది; వరసతడుకు పండగనాడు వసంతాలు చల్లుకొనేది; అడుగడుక్కీ తెలుగుపాటే, పలుకుపలుకూ తెలుగుమాటే. అట్లుండిన మా వూరికి పొయ్యేసొద్దాం పదండి.

బడులు పోయి ఇస్కోళ్లొచ్చె

"ఒరే పుట్టిగా, ఏమిరా సేస్తా ఉండావు? దినమూ పొద్దున్నే పొయి అందరు సిన్నోళ్లనీ తోడుకొనిరారా అని ఎన్నాళ్లు సెప్పేది నీకి?" అని గదర్తా ఉండాడు అనుమంతప్ప అయ్యవారు. సిన్నోళ్లకి రవంచ సదువు సెప్పిమని పక్కూరినింకా ఈయప్పని తోడుకొని వచ్చిండిరి మా నల్లూరు అగ్రారము ఊరి పెద్దోళ్లు.

సొతంత్రపోరాటము జరగతా ఉండిన కాలమది. ఈ అయ్య వారు ఊరికే ఉండకుండా ఒకనాడు 'గాంధీజీకి జై' అనెనంట. అంత మాత్రానికే కుంపిణి సర్కారోడు ఈయప్పని తడుకుతా (వెతుకుతా) ఉంటే, గుట్టుగా తలదాపుకొన్నట్లుంటుంది, సిన్నోళ్లకి సదువు నేర్పినట్లుంటుంది అని మావూరికొచ్చి టికాణేసిండాడు.

మా అయ్యవారట్లా వాళ్లని తడికేకి, సర్కారు కోలుగార్లు (పోలీసులు) ఊరూరికి వస్తా ఉండిరి. "రేయ్ బద్రంరా, అయ్యవారు మనూర్లా ఉండాడని ఎవరికీ సెప్పద్దండ్రా" అని మా పెద్దోళ్లు మాకు ఎచ్చరిక సేస్తా ఉండిరి.

సదివే సిన్నోళ్ల అబ్బోళ్లు, ఏడాదికింత దవసము (ధాన్యం), కూరాకులూ కాయాకరుసులూ ఈ అయ్యవారికి ఇచ్చేనట్ల మాట్లాడి పెట్టిండారు. ఊరినడుమన కరేదారుని (మునసబు) జగిలి (అరుగు) ఇసిరం (విశాలం) గా ఉండె. ఆడ మా తొలి సదువు సురువయింది.

మా జగిలి బడిలో పది పద్దైదుమంది సిన్నోళ్లము సేరింటిమి. మిగిలిన సిన్నోళ్లని వాళ్ల పెద్దోళ్లు బడికి అంపలేదు. ఇంట్లో పసిబిడ్డల్ని సుదారించేకీ, ఆవుల్నీ గొర్రెల్నీ మేపేకీ పెట్టుకొనేసిరి. మా బడిలో పుట్టిగాడు అనేవాడు, ఒకేడాదో రెండేండ్లో మాకందరికంటే పెద్దోడు. బడి జగిలికి ఇసక తెచ్చేది, ఇల్లిల్లు తిరిగి సిన్నోళ్లని ఈడ్సుకొని వచ్చేది వాని పని. అయ్యవారు లేనబుడు వీడే సిన్న అయ్యవారు. మా అందరి ముందర దోసెడు దోసెడు ఇసకను పోసి నెరిపేదీ వీని పనే.

మొట్టమొదలునాడు మా పెద్దోళ్లంతా ఒకొక సేరు బియ్యమూ, కడ్డీ కర్పూరమూ, పసుపూ కుంకుమా, పువ్వులూ అంటి పండ్లూ తెచ్చిండిరి. అయ్యవారే అందరి ముందూ సేరు సేరు బియ్యాన్ని పోసి, పసుపు కుంకుమ పూలు పెట్టి, కడ్డీ కర్పూరము అంటించి పూజ చేసి, అంటిపండ్లకు సాంబ్రాణికడ్లను కుచ్చినాడు. గమ్మనే గముల నడుమ సరస్వతి, విగ్నేశ్వరుల పద్యాలను పలికించినాడు. ఆమీట (తరువాత) మా వేలుని పట్టుకొని మా ముందరుండిన బియ్యములో 'ఓం' అని రాపించినాడు. అందరి చేతా రాపించినంక, వచ్చిండే వాళ్లకందరికీ ఒకొక అంటిపండుని ఇచ్చి, కండ్లకు అద్దుకొని తినమ న్నాడు. మా పెద్దోళ్లంతా మా చేత గోవిందా గోవిందా' అని గోవిం దలు పెట్టించి, ఇండ్లకు పోయిరి.

అనెంక, ఆ బియ్యాన్నంతా ఎత్తి సంచికి నింపి, ఇంటికి సేరిపించినాడు అయ్యవారు. పుట్టిగాని సేత మా ముందు దోసెడు దోసెడు ఇసకను పోపించి, ఇసకలో మా సేత 'ఓం' రాపించినాడు. ఇట్ల ఒక పదిదినాల్లో అందరమూ 'ఓం' రాసేది బాగా నేరిస్తిమి. అనెంక, ఇంకొక అచ్చరము 'న' పది దినాలు అటెంకటెంక (తరువాత్తరువాత) పదిపది దినాల్లో 'మః, శి, వా, యః, సి, ద్ధం, న, మః' అచ్చరాలని నేరిసేస్తిమి. ఇంకొన్నాళ్లకు ఇసకను వెలుపుగా పోపించి, అన్ని అచ్చరాలనూ కలగలిపి రాసేది నేర్పించినాడు అయ్యవారు.

ఇట్ల ఒక ఆరునెలలకు అందరమూ ఓనమాలను నేర్చుకొనే స్తిమి. మా పెద్దోళ్లకంతా బలే కుసీ (సంతోషం) అయిపోయె. "మా సిన్నోడు ఓనమాలు నేర్సేసెనప్పో" అని సెప్పుకొంటా ఉండిరి. కొందరి అబ్బోళ్లు అయితే "ఇంకేమి, మా సిన్నోడు ఓనమాలు నేర్సింది ఆయె కదా" అని గొర్రెలు మేకల్ని మేపేదానికి వేసుకొనేసిరి. "ఇంతే కాదప్పో, ఇంకా శానా నేర్పాల, సిన్నోళ్లని అంపియ్యండి" అని అయ్యవారు నోరు కొట్టుకొంటేనూ విన్లేదు. కొందరు పోయినా, కొత్తగా ఇంకొందరు చేరేసిరి. అయ్యవారి గాసానికి కుందకం (లోటు) కాలేదు.

ఇట్లా సమయములోనే, ఒకనాడు ఓసూరు సంతకు పోయిండిన మాయబ్బోళ్లు, ఏలనో రాత్రికంటా (వరకూ) రానేలేదు. ఎబుదు సంతకు పొయినా మట్టమద్దేనముకే వచ్చేస్తా ఉండిరి. వచ్చి, ఎవర్నీ దగ్గరకు రానీకుండా పొడిసే ఎద్దులకూ గూళికుర్రలకు (గిత్తలకు) నీళ్లూ మేపులూ సూస్తా ఉండిరి. 'ఏల ఈపొద్దు వీళ్లు ఇంకా రాలేదే' అని ఆడోళ్లూ, బోండాల ఆశతో సిన్నోళ్లూ దోవలు సూసిసూసి సాలాయె. పొద్దుగువ్వ పడమటి గూట్లో ముడుక్కోని శానా పొద్దాయె. రెయ్యి సంగటి పొద్దుకు అంతా వచ్చి ఇండ్లు చేరిరి.

"ఈపొద్దే మన దేశానికి సొతంత్రం వచ్చిసెనంట. ఓ సూరంతా, సంతపేటంతా, వీదుల్లో అంతా బలేబలే వినోదాలూ విసిత్రాలూ నడస్తా ఉండె. రోకలాటలు, కోలాటలు, కీలుగుర్రాలు, డికాంబరాటలు, పలకలాటలు, నెమిలాటలు, ఎద్దాటలు, నయ్యాండి కుఙుసులు (చిందులు) సిక్కినోళ్ల నోట్లో అంతా తీపులు కుక్కేది, పానకాలూ పెసర బేడలూ (వడపప్పు) పంచేది జరగతా ఉంటే తినుకోని సూసుకోని ఉండిపోతిమి. దానికే ఇంత పొద్దాయె" అని సెప్పిరి పెద్దోళ్లు. ఆ రెయ్యీ మరుసనాడూ ఇంకోనాడూ, మూనాళ్లూ అన్ని ఊర్లల్లానూ సందడే సందడి. సిన్నోళ్లూ పెద్దోళ్లూ అందురూ 'గాంధీజీకీ జై, భారతమాతకూ జై" అని కుశాలుగా కూతలు పెట్టిందే పెట్టింది. మా అయ్యవారిని అయితే మా వూర్లో వాళ్లూర్లో పక్కూర్లల్లో అంతా పొగిడిందే పొగిడింది.

ఓనమాలు అయినంక అ ఆ ఇ ఈ లు నేర్పేకి సురువు సేసిరి అయ్యవారు. ఇంకో ఆర్నెల్లకు ఒక పద్దైదుమంది సిన్నోళ్లం గుణిం తాల్లోకి వస్తిమి. 'క, క కు దీర్గమిస్తే కా, క కు గుడిస్తే కి, గుడి దీర్ఘమిస్తే కీ, క కు కొమ్మిస్తే కు, కొమ్ము దీర్గమిస్తే కూ' అని రాగాలు తీసితీసి రాసి రాసి వాటినీ ఆరునెలల్లో నేర్సేస్తిమి.

అనెంక ఒకనాడు అయ్యవారు మా పెద్దోళ్లని పిలిపించుకొని "సూదండప్పా మీ సిన్నోళ్లంతా వాచకాలకు వచ్చిసిరి. ఒకటో తరగతి వాచకాలు మదరాసునింకా ఓసూరికి తెప్పించి పెట్టింటారు. మీరంతా నాలుగునాలుగణాలు ఎత్తుకోనిపొయి, వీళ్లందరికీ వెంకట్రామా అండ్ కో వాచకాలను ఈపొద్దే కొనిక్కోని వస్తే, రేపు శుక్రారంనాడు సరస్వతి పూజ పెట్టి, ఆరంబము సేసేస్తాను" అని పురమాయించె. మాయబ్బోళ్ల కుసీని సెప్పేకి కాదు, "ఇంకేల, మా సిన్నోడు వాచకము సదివే వాడాయెనప్పో" అని సిక్కినోళ్ల దగ్గరంతా సెప్పుకొనేదే.

ఇంతలో సర్కారోళ్లు పంచాయితిలోని పెద్ద ఊరికి ఒక బడిని పెట్టిరి. మా అయ్యవారట్ల అయ్యవార్లనే శానా బడులకు మేస్టర్లుగా చేసిరి. మా అయ్యవారు కూడా మేస్టరైపోయి, ఆయప్ప సొంతూరులో ఏరుపాటు అయిన ఇస్కోలుకే మేస్టరు అయినాడు. బడి అనే పేరు ఇస్కోలుగా, అయ్యవారు అనే పేరు మేస్టరుగా మారిపోయె. మా వూరి సిన్నోళ్లమంతా ఒక మైలు దూరంలోని ఆ పెద్దూరి ఇస్కోలుకే సేరిపోతిమి.

పుట్టోడు, రామచంద్రుడు, నానాటిగాడు, మేనేట్రు పుట్టిగాడు, నేత (లేత) రెడ్డి, టీనారెడ్డి (టి. నారాయణరెడ్డి), కుక్కమూతి (కృష్ణమూర్తి), కొక్కిరి (దొడ్డి) కాళ్ల కొండడు, తొణ్ణెకత్తల (తొండల) రాముడు, ఒకే ఒక ఆడబిడ్డ మల్లమ్మ,

పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం - రెండూ తప్పులే

నంద్యాలగాడిని అయిన నేను, ఇదీ మా ఇస్కూలు జట్టు. మా పనులూ పుట్టులూ సూసి ఈ అడ్డ పేర్లను మేమే పెట్టుకొనింది. 'నారాయణరెడ్డి' అనే పేరుతోనే ముగ్గురము ఉండాము. ఒకనికేమో రవంత బిక్కిలి (నత్తి), వానిని పేరడిగితే 'నా...నాట్టి' అనేవాడు. దానికే వానిపేరు 'నానాటి' అయిపోయె. "తొణ్ణెకత్తలను తరిమి సంపేసి, పూడ్సిపెట్టేసి, తిరగా ఐదునాళ్లకు తోడితే కాసులు సిక్కుతాయంట్రా. దోవలా పడిపోయిన కాసుల్నంతా మింగి కడుపులో పెట్టుకోనుంటాయంట అవి" అని రాముడు మా కందరికీ సెప్పి నమ్మించె. ఒకరికొకరికి తెలీకుండానే మేమందరమూ ఆడాడా తొణ్ణెకత్తల్ని సంపి పూడ్చి పెడితిమి. నాలుగైదునాళ్లు అయినంక ఆశగా తోడిసూస్తే, కాసుల కత పక్కన పెట్టండి, గబ్బుకు మా ముక్కులు పగిలిపోయె. అపుటి నింకా రాముడి పేరు తొణ్ణెకత్తల రాముడు అయిపోయె. పుట్టారెడ్డిగాడు పుట్టోడు అయితే, మా జట్టులో పెద్దోడుగా ఉండి, మా మీద పెత్తనం చేస్తా, మేస్టరు దగ్గిర 'మానిటర్' అని పిలిపించుకోనే పుట్టిగాడు మేనేట్రు పుట్టిగాడు అయిపోయె.

దినమూ పొద్దున్నే సద్దులు తిని మైలు దూరంలోని ఇస్కోలుకు పోయేది, మద్దేనము ఊరికి పారొచ్చి (పరుగెత్తి వచ్చి), అన్నము తిని గంట కొట్టే లోగా పారిపారి చేరుకొనేది అంతా ఒక ఆట మాకు. మాపుసరి (సాయంత్రం) ఇంటికి పోయేటపుడు ఎన్నెన్నో ఆటలు మావి. మానులెక్కి ఆడే కోతికొమ్మాటలు, చెండాటలు (బంతాట), గుడుగునాటలు (కబడి), పారే పంద్యాలు...ఇట్ల ఆటలే ఆటలు.

మాపుసరి ఇంటికి పొయ్యేనపుడు రెండు జట్లుగా చీలి పోతాము. దోవలో ఒక చిన్న గుట్ట ఉంటుంది. ఆ గుట్టమీద చిన్న చిన్న కాలవల మాదిరి తొగి (త్రవ్వి) పెట్టుకోనుంటాము. కాలవ పై కొసన ఉచ్చపోస్తే, అది కొనకంటా పారి, అక్కడ మేము నాటి పెట్టిండే మామిడి మొలకల బుడాలకు చేరాల. అట్ల చేరేనట్ల పోసినోళ్లు పాండవులు, చేరకుంటే వాళ్లు కౌరవులు. అందరమూ పాండవులు కావాలని చెంబులు చెంబులు నీళ్లు తాగేదే పని.

బేదిబెల్లం ప్రసాదం

పుట్టోడు, రామచంద్రుడు, తొ.రాముడు, కొ.కా. కొండడు దినాము మేస్టరు తావ బాగా బెత్తమేట్లు తింటా ఉండిరి. ఏలంటే వీళ్లు శానా మడ్డినాయాళ్లు. శుచీ శుద్దమే ఎరగనోళ్లు. ఎనుము పెరుగు కలిపిన సద్దిని తినొచ్చి ఎపుడూ తూగడిచ్చేదే(కునికేదే) పని. మేస్టరు వాళ్లబ్బోళ్లని పిలిపించి "ఇట్లా బోజనము పొద్దున్నే పెట్టి పంపద్దండ" అంటేనూ "మాకు ఇంటితావ ఉండేది అదే, మీరు వాళ్లని బాగా బిగిచ్చండ (కొట్టండి) మేస్టరు" అనేసి పోయిరి. ఒకనాడు వీళ్లు సదవకుండా తూగడిస్తా ఉండారు. మేస్టరుకు రేగి పోయింది. అంతే నలుగురినీ గోడకుర్చీ వెయిపించి, అరచేతలను తిప్పమని బెత్తంతో గణుపుల మీద బాగా పులుసు పెట్టేసినాడు.

ఇస్కోల్లో మేస్టరు కొట్టిన దెబ్బల్నీ తొడగిల్లుడుల్నీ వాళ్ల అబ్బోళ్లకి చూపించి దూరు(ఫిర్యాదు) చెప్పిరి ఆ నలుగురూ. "ఇంకా బాగ పడాల మీకు, యేట్లు తింటేనే బుద్దొచ్చేది, పోంద్రా నా కొడకల్లారా" అనేసిరి వాళ్లబ్బోళ్లు. ఇస్కోలుకి పోతే మేస్టరు చేతిలో తన్నులు, ఇంట్లోనే ఉంటే అబ్బోళ్ల చేతిలో పెట్లు, ఏమి సెయ్యాలనేది యోసన సేసి సేసి, ఒక ముదువు (నిర్ణయం) కు వచ్చిరి. మా మేనేట్రు పుట్టి గానికి పిప్పరమెంట్లు లంచమిచ్చి, ఇండ్లల్లో సెప్పద్దని సత్తెం సేపించుకొని, ఇస్కోలుకు నామం పెట్టి, తోటల్లో చేనుల్లోనే ఉండిపోయి, సరిగ్గా ఇస్కోలు విడిసే పొద్దుకు ఇండ్లకు పోతా ఉండిరి. ఎట్లనో కుక్కమూతిగాడు కూడా వీళ్లకి జతయిపోయినాడు. తవళి (అబద్దం) ఎన్నాళ్లు దాగుతుంది! నాలుగునాళ్లకు మేస్టరుకు అంతా తెలిసిపోయింది. ఇంక సూసుకోండప్పా, తోలూడేట్ల కొడతా ఉంటే, వాళ్ల నడుముదారాలకి (మొలతాళ్లకి) సిక్కుకొన్న సద్దీలు ఊడి పడిపోయె. కుక్కమూతిగానికీ బాగనే పడిండాయి.వాడు మేస్టరు మీద కంటు కట్టుకొనె.

అవేవో జాపాళము విత్తులంట, కుక్కమూతిగాని అబ్బ, వాటిని సెబ్బిగా (పక్వంగా) వండి, పుటము పెట్టి, బెల్లంపాకంలో కలిపి ఉంటలు సేసి, బేదిమందుగా అమ్ముతుంటాడు. మా సుట్టుపక్కల ఇరవై ముప్పై ఊర్లలో ఈ మందుకు శానా పేరు. కడుపుల్లో పేగుల్లో శానా ఏండ్లుగా కచ్చకట్టి నిలిసిపోయిండే కసమండాలన్నంతా తీసి శుద్దం చేసేసే మందు అది. పెద్దోళ్లకయితే నాలుగణాలు, సిన్నోళ్ల కయితే రెండణాలు తీసుకొని, నిండు ఉంటనో అర్దముంటనో ఇస్తుం టాడు. ఎట్ల దొంగిలించెనో, వాళ్లబ్బ లేనపుడు, ఈ బేదిబెల్లం మందును, ఒక ఉంటను దొంగిలించి పెట్టుకోనుండాడు కుక్కమూతి గాడు.

కొత్తగా సిన్నోళ్లని సేరిపించేవాళ్లో, తోటల్లో పండించిన వాళ్లో, పేటకు పోయి కొని తెచ్చుకొన్నవాళ్లో, దినమూ ఎవరో ఒకరు అంటి పండ్లను ఇస్కోలికి తెచ్చిస్తుంటారు. వాటి జతకు సెనగపప్పు, బెల్లము, బురుగులు (మరమరాలు) ఉండనే ఉంటాయి. అన్నిటినీ కలిపి ప్రసాదంగా మాకందరికి పంచుతాడు మేస్టరు. అర్దానికి పైగా ఆయనే తినేస్తాడు, మిగిలిండేది మా కందరికీ తలా కొంచెము.

ఒకనాడు కుక్కమూతిగాడు బేదిబెల్లం మందును ప్రసాదంలో కలిపేసినాడు. మాకందరికీ ముందుగానే సెప్పిండాడు కాబట్టి మేము ఉషారు అయిపోతిమి. మేస్టరుకు ఏమి రుసి సిక్కిపోయెనో, ఆపొద్దు ప్రసాదం పంగ పట్టేసినాడు. ఇస్కోలు ముగిసినంక మాపుసరి అందరమూ మావూరి దోవ పడితిమి. ఒకరిద్దరు మా జతగాళ్ళు (స్నేహితులు) తెలియకుండా ప్రసాదాన్ని తినేసిండారు. వాళ్ల కతను సెప్పేదొద్దు, పదిపది అడుగులకు ఒకసారి సద్దీలను విప్పుకొనేదీ సెట్ల మరుగుకు పారిపోయేది.

"రేయ్, దిగులు పడద్దంద్రా, మీ కడుపులు శుద్దమయిపో తాయి, ఇంటికి పోయినంక మజ్జిగన్నం తింటిరంటే బేది నిలిసిపోతుంది, అదే దీనికి మందు" అని వాళ్లకి బద్రం సెప్పె కుక్కమూతిగాడు. అక్కడ మేస్టరు గతి ఏమాయెనో!

రెయ్యి సంగటిపొద్దుకు (సుమారు 7 గంటలు) లోపల్నే ఈ సమాచారము కుక్కమూతిగాని వాళ్లబ్బకు తెలిసిపోయింది.

'అయ్యయ్యో మేస్టరు ఏమయిపోయెనో' అనుకొంటా ఆ మబ్బు (చీకటి) లోనే పడతా లేస్తా మేస్టరోళ్ల ఊరికి పోయిండాడు. పొయి సూస్తే ఏ ముందాది, ఇరవైసార్లకు పైన్నే బేదికొట్టి సుస్తయిపోయిండాడు మేస్టరు. ఇదేమో కాయిలు (జబ్బు) అనుకొని, అంత పొద్దులో పేటలోని ఆసుపత్రికి పోలేక, గచ్చాకు పుచ్చాకు వైదిగం సేసుకొంటా ఉండాడు.

"ఎవరో సిన్నోళ్లు నీకు బేదిమందును ఇచ్చేసిండారు మేస్టరు. సడే పోనీ, నీ కడుపులో ఉండిన కచడా అంతా పొయి, శుద్దమాయె. దీనికి మందు మజ్జిగన్నమే" అని సెప్పి, మజ్జిగన్నాన్ని తినిపించి, మేస్టరు కడుపును సల్లసేసి వచ్చెనంట ఆయప్ప.

ఇంత జరిగినా మా మేస్టరు బుద్ధి మారలేదు. సిన్నోళ్లని దంచేదాన్లో మొనగాడు మా మేస్టరు.

ఆకాశవేణే ఏడిసె

మేస్టరు సుస్తుపడి లేసి రెండునాళ్లు కూడా కాలేదు. ఎప్పుడట్లానే మేము ఇస్కోలుకు పోయి మాపుసరి ఇండ్లకు తిరుక్కొంటిమి. పొద్దప్ప (సూర్యుడు) పడమరమ్మతో ఇంకా అరట్లు (బాతాకానీ) కొడతానే ఉండాడు. నల్లని మొయిలు ఒకటి పడమరకు వాలింది. ఊరినంతా గబ్బుమబ్బు తబ్బు (కౌగిలించు) కొనింది. పేటకు పోయిండిన మా పెద్దోళ్లు గోడుగోడుమంటా ఇండ్లకు వచ్చిరి.

"గాంధీ మహాత్మున్ని తుపాకితో కాలిసి సంపేసిరంట. పెపంచమంతా శానా వెతపడతా ఉండాదంట. పెద్దపెద్ద నాయకులే కాదు, మనదేశ ప్రదానమంత్రి నెహ్రూ కూడా ఏడిసేసెనంట. ఓసూర్లో ఆకాశవేణే (రేడియో) ఏడుస్తా ఉండాదప్పా" అంటా వాళ్లూ ఏడిసేసిరి.

"రేయ్, మన మేస్టరు ఎట్లుండాడో సూసి వస్తాము పదండ్రా" అని ఎవరో అంటే, పెద్దోళ్లూ సినోళ్లూ అందరమూ కలిసి ఒక పది పదైదుమంది బయలుదేరితిమి.

మా మేస్టరు వాళ్లింటి జగిలిమీద నెత్తిన బట్టేసుకొని కూకోనుండాడు. మమ్మల్నంతా సూసి, "పరంగోళ్లట్ల చక్రవర్తులనే మన దేశం నింకా తరిమేసి సొతంత్రం తెచ్చేనే, అట్లా మహాత్మున్నే సంపేసిరే. ఇంక ఈ నేల ఉంటుందా, న్యాయమునూ సత్యమునే సంపేసినంక ఈ కాలము నిలుస్తుందా, ఊహూ, ఇంక సత్యానికి కాలము లేదప్పా" అంటా అంగలార్సినాడు.

మరుసనాడు మా ఇస్కోలు సిన్నోళ్లని కొందరిని, ఓసూరు పేటకు పిలుసుకొని పొయినాడు మా మేస్టరు. తాలూకాపీసు తావ (దగ్గర), బెంగుళూరు రేడియో నిలయానికి మైకు పెట్టిండారు. మైకులో పెద్ద సద్దుతో ఏడుపురాగాలు వస్తా ఉండాయి. నడుమ నడుమ రకరకాల బాసల్లో గాంధీతాత కతల్ని సెప్తా ఉండారు. ఆ రాగాలను వినే మా పల్లెల్లో అంతా ఆకాశవేణి ఏడస్తా ఉంది అనుకొనిరి.

పెద్దబాలశిక్షే భగవద్గీత

"ఎన్ని వాచకాలు సదివినా పెద్దబాలశిక్ష ముందు తక్కువే" అంటా ఉంటాడు మా మేస్టరు. మాయబ్బోళ్లకు సెప్పి, ఓసూరునింకా పెద్దబాలశిక్ష, నరసింహశతకము, అమరకోశము అనే మూడు పుస్తకాలను తెప్పించినాడు మేస్టరు. ఈ మూడు పుస్తకాలనూ సదివి తెలుసుకొంటే పెపంచములో ఎక్కడైనా బతకొచ్చునంట. ఇరవైమంది సిన్నోళ్లము ఈ పుస్తకాలమీద పడితిమి. సదవతుండే మాకంటే నేరిపిస్తుండే మా మేస్టరే ఎక్కువ కష్టపడతా ఉండాడు. పెద్ద బాలశిక్ష, నరసింహశతకము పరవాలేదు, మా మూళ (బుర్ర) కు ఎక్కిపోయె. కానీ అమరం ఉందే మమ్మల్ని ఉతికి పిండేసె. నేనూ ఇంకొక ఇద్దరు ముగ్గురు తప్పితే, మిగతావాళ్లు అమరం పేరు వింటేనే నిక్కర్లు నానిపేస్తా ఉండారు. 'యస్యజ్ఞానదయాసింధోరగాదస్యానగాగుణః' అనే మొదటి శ్లోకము వచ్చేతలికి మేస్టరుకే జెరము వచ్చెసె. దాంతో అమరాన్ని పక్కకు పెట్టేస్తిమి. నిజముగానే పెద్దబాలశిక్ష మాకు శానా నేరిపించె. దినాల పేర్లు, నెలలపేర్లు, ఏడాదులపేర్లు, అంకెలు, ఒక్కట్లు (ఎక్కాలు), ఒకటి కాదు రెండు కాదు, పెద్దబాలశిక్షను సదివి ఎన్నో నేరిస్తిమి.

వేమన – రామదాసు

ఒకనాడు మా మేస్టరు "ఈ పొద్దు మీకు కొత్త పాటము సెప్తా ఉండాన్రా. బాగా వినుకోని అర్తము సేసుకోండి" అనె. మేమంతా ఈ కొత్త పాటము ఎట్లుంటుందా అని రవంచ ముందరకి వంగితిమి. అమరములోని శ్లోకాలను సదివేకి నోరు తిరగక దెబ్బలు తినిన సిన్నోళ్లకయితే, ఇదేమి పాటమో ఎట్లుంటుందో అని సెమట్లు పట్టె.

"ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు / చూడజూడ రుచుల జాడవేరు / పురుషులందు పుణ్యపురుషులు వేరయా / విశ్వదాభిరామ వినురవేమ. దీనిని వేమన పద్యం అంటారు…" అంటా మేస్టరు ఇంకా ఏమో సెప్తా ఉండాడు. మాకందరికీ నగవు వచ్చెసె. లేకపోతే ఇది పొయి పాటమా!

మేము ఇంతగా ఆశ్చర్యపొయిందానికి కారణం ఉంది. మా తావున అన్ని పల్లెల్లోనూ వేమన పద్దెము తెలియని మనిషే ఉండదు. పెండ్లి అయినంక, పెండ్లి జంటను ఊరంతా మెరవణి (ఊరేగింపు) చేస్తారు. అట్లే ఊరుపండగలపుడు ఊరుదేవతల్ని మెరవణి చేస్తారు. మెరవణి నడిసేనపుడు ముందు డోలు కొలువు (సన్నాయి) తో మంగలోళ్లు పోతా ఉంటారు. నాలుగయిదు ఇండ్లకు ఒక తావ మెరవణి నిలుస్తుంది. అప్పుడు ఆ ఇండ్లలో వాళ్లు బయటికి వచ్చి, మంగలోళ్లకి కాలణా అర్దణా ఇచ్చి పొగడమంటారు. మంగలోళ్లు కొలువును నిలిపి, "ఉప్పుకప్పురము ఒక్క పోలికనుండు…వినరా వేమా అన్నట్లు, ఎవరయ్యా అంటే నందేల రామరెడ్డిగారు పెండ్లిజంట బాగుండాలని, అర్దణా ఇచ్చి బోగొప్పగా బోయశస్సుగా పొగిడించి రహో" అని పొగడతారు. ఇట్ల మెరవణి ముగిసేలోగా నూరు వేమన పద్దేలన్నా సెప్తారు. మంచి కార్యాలపుడే కాదు, ఎవరన్నా తీరిపోయినపుడు, పీనిగ ముందు పలకకొట్టే వాళ్లు కూడా వేమన పద్దేలు సెప్పి పొగడతారు. ఆవులు మేపే సిన్నోళ్లయినా, మడకదున్నే మైనీర్లయినా, బండ్లు తోలే పెద్దోళ్లయినా, ఇంటి

పనులు చేసే ఆడోళ్లయినా, చేను పనులు చేసే కూలోళ్లయినా, వేమన పద్దెము ఎరగనివారే ఉండరు మా తావున అట్లాంటి పద్దేలు, పాటాలుగా వచ్చేతలికి ఆశ్చర్యమయిపోయే.

మా తావున వేమన మాదిరే రామదాసు కూడా. ఇంటింటికీ జగుళ్లు ఉంటాయి కదా. వాటి అంచుల్లో గొత్తులను (కొయ్యగూటాలు) నాటి పెట్టింటారు. ఆ గొత్తులకు ఆనించి జగిలి పొడుగునా ఒక దూలాన్ని అడ్డం వేసింటారు. గొత్తులకు గొడ్లను కట్టేసి, జగిలి మీద కసువు వేస్తే, కసువును కిందకు లాక్కోకుండా దూలం అడ్డంగా ఉంటుంది. గొత్తులకూ దూలానికీ తాడు బిగించి ఉంటుంది కాబట్టి దూలం జరిగి గొడ్ల కాళ్లమీద పడేలేదు. రెయ్యి సంగటి తినినంక పెద్దోళ్లూ ముసిలీ ముక్కలూ జగుళ్లపైకి సేరుకొంటారు. ఒకోజత ఎద్దులకు ఒకొకరు ఎదురుగా కూకొని, జొన్నకడ్లను వాటి నోటికి అందిస్తా ఉంటారు. అట్ల అందియ్యకపోతే అవి ఉత్త ఆకుల్నే తినేసి దిండ్లను వదిలేస్తాయి. అట్లాంటపుడు మాయట్ల సిన్నోళ్లు కూడా పెద్దోళ్ల పక్కలో దూరుతాము. నిదరకు తూగిడిచ్చి సేతివేళ్లని గొడ్ల నోటికి ఇయ్యకుండా ఉండేకి మా పెద్దోళ్లు బద్రాచలం రామదాసు పాటలు పాడతారు. 'ఏ తీరుగ నను దయజూసెదవో...'పలుకే బంగారమా యెనా...' ఇచ్చాకు కుల తిలక...' వంటివి ఎన్నో పాటలు తాతల తండ్రుల నోళ్ల నుండి మాకు అందతా వస్తా ఉంటాయి.

రెయ్యంతా రామదాసు కీర్తనలు ; పొద్దున్నే కైవారం తాతగారి తత్వాలు; వేమన, సుమతి, నరసింహ శతక పద్యాలు; పెద్ద బాలశిక్ష; తరగతి వాచకం; అలలు అలలుగా జనం నోళ్లనింకా తెలుగు వెల్లువలయి దుమికే మా రాజ్యంలో మా తొలి సదువు ఇట్లా ఆరంబమయి కొనసాగింది.

(తరువాయి రాబోయే సంచికలో...)

స్పందన

మే నెల 2019 అమ్మనుడిలో ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి కథ 'పేరు బలం'. చాలా గొప్పగా ఉంది. చక్కని కథనంతో సందేశాత్మకంగా ఉంది. ప్రతిభావంతులు రాసిన కథలో పతిభ అంతా ప్రతిబింబిస్తోంది

జోళదరాశి (గుత్తి) చంద్రశేఖరరెడ్డిగారితో ముఖాముఖి కూడా బాగా నచ్చింది. రాజకీయాల రణగొణలో భాష దెబ్బతినడం చక్కగా వివరించారు. కన్నడిగులతో విడిపోవడమే ఒక పెద్దతప్పు అయితే, తెలుగువారు వారిలోవారే ఇప్పుడు రెండుగా చీలికలై పోవడం మరింత విచారకరం. మన అమ్మనుడిని రక్షించుకునేందుకు మనంపడే పాట్లు చూస్తే బాధగా ఉంది.

– పాలెపు బుచ్చిరాజు (బరోడా)

(36 వ పుట తరువాయి)

కుమ్మరి వృత్తి అత్యంత ప్రాచీనమైనది. కుండకు అత్యంత ప్రాధాన్యత కూడా ఉంది. క్రీ.పూ. 5500 ప్రాంతంలో మెసప టోమియా నాగరికత కాలానికే కుండవున్నట్లు ఆధారాలున్నాయి. చలివేంద్రం, కుమ్మరి కులవృత్తి జీవితంలో వ్యయప్రయాసల్ని తెలిపే కథ. రచయిత జాతశ్రీ. కాగుబొత్త కథకూడా పెద్దింటి ఆశోక్, కమ్మరి కథల్లో ఈ భూమినాది, కొడుకురాకపాయె, పాటర్ససర్కిల్, చిప్ప వడ్రంగి కథ, అన్నంగుడ్డ సుంకోజిదేవేంద్రచారి, జాతశ్రీ కుట్ర వృత్తిలో నైపుణ్యం వున్నా యంత్రాలు వచ్చాక చాలావరకు వడ్రంగి జీవితం దుర్భరంగా మారింది రాసాని కొలిమి, శిరం సెట్టి కాంతారావు నేలమీద జాబిలి, దిలావర్ గూడు చెదిరిపోయింది. మంగలి అడపం కథ తుమ్మలరామకృష్ణ చేతి వృత్తి చేసే వాళ్ళ ఏమాత్రం బాగుపడినా ఓర్చని జనం గురించి తెలుపుతుంది,అతుడు బయల్దేరాడు : రాప్తాడు గోపాలకృష్ణ కథ రాయసీమ ప్రాంతానికి చెందినదన్కెన అంతటా అన్వయించకో వచ్చు. 'బీడి వోడు' ఉప్పర కులసుడు అడివోడు అందరికీ క్షవరం చేసి కులవృత్తను తుడిచేయాలనుకొంటాడు. పతంజలి, వివినమూర్తి కలింగాంధ్ర బహుజనుల బాధలను చిత్రీకరించారు. శాంతి నారాయణస్వామి, రాసాని, రాయల సీమ బహుజనుల కడగండ్లను కళ్లకు కట్టారు. ఖదీరు బాబు: ఖాధర్ లేదు. షాజహాన్ రాసిన సండాసీ, సిలసిలా సండాసీ . పాచికలు షేకుసేన్ హునర్ నరికి లక్షణ్ అంటారు. చేతివ ఎత్తి మగానిలక్షణం అని గర్వంగా చెప్పుకొంటాడు. శశిశ్రీ దహేజ్, రాతిలో తేమా, అక్కంపేట, ఇబ్రహీం జీవసమాధి ? ఎన్నెస్ ఖలందర్ మున్నీబేగం ముస్లిం జీవన స్వభావ నైజం గుణాలను తెలిపే కథలు.


సత్యాగ్ని యంత్రం, హుసేన్ సయ్యద్ సలీం బారహతుల్లో సైబాబా, షాజహాన్, వేంపల్లి షరీఫ్, ఎన్నిస్ ఖందరు ముస్లింకథల్లో ప్రధాన భూమిక నిర్వహిస్తున్నారు. గీతాంజలి, పెహజాన్, చ, హిందూ ముసల్మాన్, ఆళ్వారుస్వామి, కాఫీ, బుచ్చిబాబు, కేతువిశ్వనాథరెడ్డి పీర్లసావిడి ,ఓల్గా సారీజాఫర్, రాసాని బుసీ ఫెలస్, నువ్వు

అనాధవికావు, శ్రీపాద గులాబీత్తరు గురజాడ పెద్ద మసీదు మైనారిటీవాదాన్ని బలంగా వినిపించే కథలు. ఇలా అన్ని ఉత్పత్తి కులాల కథలు వచ్చినా పరిస్థిలో మాత్రం మార్పు ఆశించినంతగా రాలేదు. లోపం రచయితల్లో వుందా లేక పాఠకుల్లో వుందా ,లేదా పాలకుల్లో వుందా అనేది తెలియాలి. బహుజనులు అనే పదం మందిని కలుపుకొని పోవడానికి తప్పితే మార్పు మాత్రం అంతంత మాత్రమే. ఇంకా దళితుల పైన దాడులు ఆగలేదు,దేవాలయాల ప్రవేశం నిషేదం కొనసాగుతోంది,దళితులే కాకుండా మిగిలిన ఉత్పత్తి కులాలు కూడా అగ్ర కులాలవారితో అనేక శోషణలు ఎదుర్కొంటున్నారు. బహుజనులు ఇంకా ఓటరు గానే వుంటున్నారు తప్పితే పాలించే దిశగా చాలా వెనుకబడ్డారు. అజ్ఞానం,అవిద్య మూఢనమ్మకాలు బహుజనులు విడనాడాలి మనిషిని మనిషిగా చూసే సమాజం మనందరు నిర్మించుకోవాలి.

రచయిత : అసోసియేట్ ఫెలో
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం. మైసూరు.

పుస్తక సమీక్ష

రాయలసీమ మాండలిక పద పరిమళం
బతుకు వెతుకులాట



రచన : సడ్లపల్లి చిదంబరరెడ్డి
వెల: 400/- పుటలు : 508
ప్రతులకు : సి. కళానిధి, 21-6-139
వెలుగు చిగురు టీచర్స్ కాలని
హిందుపురం - 515211
సెల్ : 9440073636

ఇప్పుడొస్తున్న వివిధ సాహిత్య ప్రక్రియలలో స్వీయ చరిత్రలు గాని జీవిత చరిత్రలు కాని సంఖ్యాపరంగా తక్కువే. ఈ రెండిటిలో మాత్రం స్వీయ చరిత్ర (ఆత్మకథ)ల సంఖ్య కొంచెం ఎక్కువ. ఒక ప్రముఖుని గురించి వేరొకరు రాసే జీవిత చరిత్రకన్నా, ఒక వ్యక్తి తన అనుభవాల్ని, అనుభూతుల్నీ అంతరంగాన్నీ ఆవిష్కరిస్తూ, వాటికి అక్షరరూపం ఇవ్వడం ఆత్మకథల్లో ప్రత్యేకంగా కనిపిస్తుంది. అయితే ఆత్మకథ లేదా స్వీయ చరిత్ర వంటివి, ప్రముఖులు, మహాను భావులు మాత్రమే రాసుకునే ఒక పరిమితమైన ప్రక్రియ, తన పరి మితులు దాటి పరిధులు విస్తరించుకుని ఇప్పుడు ఏ స్థాయికి, ఏ తరగతికి చెందిన వారైనా తమ అనుభవాలను అక్షరబద్ధం చేయవచ్చు అనే భావవైశాల్యాన్ని సంతరించుకుంది. వ్యక్తులు మాన్యులైనా, సామాన్యులైనా తాము జీవితంలో సాధించిన విజయాలు, అపజయాలు, నేర్చిన పాఠాలు, తమ బాధలని, వేదనలని, లోపాలని, బలహీనతల్నీ నిజాయితీగా నిష్కర్షగా చెప్పుకున్నప్పుడు అది ఒక మంచి ఆత్మకథ అవుతుంది. కేవలం తమ గతాన్ని తోడి చెప్పటమో, తన గతంలోకి సింహావలోకనమో చేసుకోవటానికో కాకుండా, ఆత్మకథలు ఒక వ్యక్తి లోని మంచిని, ప్రేరణగా తీసుకొని, జీవిత సత్యాలను తెలుసుకోటానికి కొంతమందికైనా స్ఫూర్తినిచ్చేవిగా ఉండాలి. అటువంటి ఆత్మకథల ద్వారా వివిధ ప్రాంతాల గురించీ, విభిన్న మనస్తత్వాలు గల మనుషుల గురించి, జీవన సరళిని, జీవిత సారాన్ని గురించి తెలుసుకునే వీలు కలుగుతుంది. భిన్న సామాజిక నేపథ్యాలు, భిన్న వయసు గల వారి మధ్య చోటు చేసుకునే అంతరాల వ్యవధిని తగ్గించి పాత కొత్త తరాలవారి మధ్య నూత్న సుహృద్భావ సంబంధాలు ఏర్పడటానికి దోహదపడతాయి. దాదాపు పై లక్షణాలన్ని నింపుకుని రాయలసీమ ప్రాంత మానవ జీవితం, అక్కడి ప్రజల జీవనయానానికి ఒక అనుభవ మంటపం అనిపించే పుస్తకం సడ్లపల్లె చిదంబరరెడ్డి రాసిన 'బతుకు వెతుకులాట' స్వీయచరిత్ర.

రాయలసీమలో కర్ణాటక సరిహద్దు హిందూపురం ప్రాంతం లోని గ్రామీణ రైతుల జీవితాలలోని సంక్షోభాలను విధ్వం సాలను, తన జీవితంలోని అనుభవాలను ఆత్మకథలాగా తనదైన వ్యక్తిత్వంతో, భాషతో అద్భుతంగా, నిజాయితీగా చిత్రించిన రచన ఇది. తాను పుట్టి పెరిగిన పల్లె బతుకు, అంతకు ముందు జనాలు చెప్పి ఉన్నవి, తాను కళ్లారా చూసినవి ఈ కాలం జనాలకి తెలియచేయటానికి 'వెతుకులాటల బతుకు' పేరుతో రాసిన మొదటి అధ్యాయం 'నా ఒగటో తరగతి సదువు' తో ప్రారంభించిన చిదంబరరెడ్డి ఆత్మ కథల ధారావాహిక 80 అధ్యాయాలకు విస్తరించింది. చిన్నపిల్లవాడుగా - ఒకటో తరగతి విద్యార్థిగా ఉన్నప్పటి నుండి దాదాపు ఐదున్నర దశాబ్దాలుగా తన ఆరాట పోరాటాలను బతుకు వెతుకులాటను 2016 లో తన కుమారుడు కళానిధి వివాహం జరిగిపోయి, తన బాధ్యత బరువూ తీరిపాయె-అనే వాక్యంతో ఆత్మకథ ముగుస్తుంది. ఈ ఆత్మకథ లో రెండు ప్రధాన అంశాలు మనకు ప్రముఖంగా అనిపిస్తాయి. ఒకటి-అంతర్జాల ముఖపుస్తకంలో (ఇంటర్ నెట్-ఫేస్‌బుక్)లో ధారావాహికంగా వచ్చిన మొదటి జీవన అక్షర చిత్రం ఈ ఆత్మకథ. 2014 నవంబరు 'సారంగ' అనే అంతర్జాల పత్రికలో 'బతుకు వెతుకులాట' పేరుతో ప్రారంభమై, ఆ తరువాత సం॥నికి బెంగుళూరు తెలుగు ప్రతిలిపి ఫేస్‌బుక్ పత్రికలోనూ (కవి సమ్మేళనం) వెలువడిన విశేషాన్ని దక్కించుకుంది. రెండవది-ఇందులో ఉపయోగించిన రాయలసీమ మాండలిక భాష (దీనినే రచయిత-మాండలికం అనేదాన్ని స్థానిక పదజాలం అంటారు)

చిదంబరరెడ్డి విద్యావంతుడు, సాహితీప్రియుడు, తెలుగు అయ్యవారుగా పనిచేసినవాడు కవి, రచయిత తన ఆత్మకథని పాత్రోచితంగా తన భాషలో రాసి ఉండవచ్చు కదా, తన అనుభవాల్ని చెప్పేటప్పుడు తన సహజమైన పదజాలంలోనే చెప్పి ఉండాల్సింది అని అనిపిస్తుంది. అయితే ఈ విమర్శకుకూడా రచయిత ముందుమాటలో (నామాట) తన స్థానికభాషను సమర్థించుకుంటూ సమాధానం యిచ్చారు. 'కొన్ని వందల పాత్రలు, వందల సం॥ల నిడివి, వాటి యాసలు, మరి నేను 5,6 సం॥ల వయసునుండీ 65 సం॥లు వచ్చే దాకా, ఏకరువు పెట్టిన ఘోష' అని. అన్ని భాషలకు సంస్కృత భాషే మూలం అని బుకాయించే గుత్తాధిపత్యానికి, ఒకటి రెండు జిల్లాల అతి తక్కువ పదజాలమే ప్రామాణికమని తప్పెటకొట్టే వర్గానికీ వ్యతిరేకంగానే ఈ రాతను మొదలు పెట్టానని చెప్పటం రాయలసీమ స్థానిక పదజాలం మీద రచయితకు ఉన్న గాఢమైన అభిమానం వ్యక్తం అవుతుంది. అంతేకాదు. మనకు కూతవేటు దూరంలో పొరుగునే ఉన్న, మన పేగుబంధాలతో ముడిపడి ఉన్న సజీవ స్థానిక పదాలు అర్థంకావు అనడాన్ని ఎటువంటి హృదయవైశాల్యానికి గీటురాయో మరి? అని అధిక్షేపణ కూడా చేసారు. అంతిమంగా-ఒక అరశతాబ్దం కాలంలో అన్ని రంగాలకు సంబంధించిన నగ్న చరిత్రను రాబోయే తరాల వారు ఒకేచోట చదువుకోగలరని, ప్రతి ఒక్కరూ తమ ప్రాంతీయ జీవనాన్ని, సహజ పదజాలాన్ని ప్రేమించగలరని కోరుకుంటున్నాను అని ఒక ఆశాభావం తెలియజేస్తారు. అయితే, రచయితకు రాయలసీమ మాండలికం (స్థానిక పదజాలం) పై ఉన్న గాఢాభిమానం ఇతర ప్రాంతాలవారికి కొంచెం అసౌకర్యం కలిగిస్తుందని చెప్పక తప్పదు. ఆ విధంగానే ఒకేబిగిన చదువుకుంటూ సాగవలసిన పరిస్థితిలో కొన్ని సంస్కృత పదాల దగ్గర ఇబ్బందులు


ఎదురవుతాయి. ఉదాహరణకు, 'పెజాసామ్మియం' (ప్రజాస్వామ్యం), 'నిరువచనం' (నిర్వచనం), 'కవిత్తువం' (కవిత్వం), 'శబ్బుదం' (శబ్దం), 'అమిశం' (అంశం) వంటివి. ఏది ఏమైనా రచయితకు స్థానిక పద జాలంపై గల మక్కువని మెచ్చుకోకుండా ఉండలేము. అనంత అక్షర విజయంలో (అందరికీ చదువు చెప్పించే కార్యక్రమం) పాల్గొన్నప్పుడు అక్కడ గొల్ల సుద్దులు, పాటలు మొ॥వి అన్నీ తెలంగాణా యాసతో ఉండటం గమనించిన రచయిత, 'మా రాయలసీమ గూడా యీ రాష్ట్రంలో ఒక బాగము, మాకీ వొగ బాష యాస వుండివి, వాట్లో సెప్పితేనే మా జనాలకి బాగా అర్తం అవుతుంది' అని మీటింగులలో వాదించినవాడు. 'తాను చెప్పేగతాలకో లేక ప్రాంతీయ పదజాల భాషా పరిమళాలో తెలియదుగానీ పాఠకుల నుంచి విపరీతమైన స్పందన రావడం మొదలైంది' అని అన్నారు రచయిత. రాయలసీమ – అనంతపురం జిల్లా తెలుగు భాషలోని సజీవత్వం ఈ పుస్తకంలో తొణికిసలాడుతుందని సాహితీ ప్రియులకు అనిపిస్తుంది.

'బతుకు వెతుకులాట' కేవలం చిదంబరరెడ్డి వ్యక్తిగత సమా చారం మాత్రమే అయితే దీని పరిమితి చాల చిన్నదిగా ఉండేది. కాని ఇందులో ఆయన జీవితం ప్రతిబింబిస్తూనే తన ప్రాంతంలో భూమి సంబంధాలు, మానవ సంబంధాలు ఎలా పరిణామం చెందు తూ వచ్చాయో తెలుస్తుంది అని ఆచార్య రాచపాళెం చంద్రశేఖరెడ్డి వ్రాసిన పీఠిక (మట్టిమనిషి–మట్టిజీవితం) అక్షర సత్యం. ఇది రచయిత బతుకు కత మాత్రమే కాదు. సగటు మనిషి బతుకు వెతలు అని పిస్తుంది. హిందూపురం దగ్గరి సడ్లపల్లె (సూగూరు సడ్లపల్లి – ఎస్. సడ్లపల్లి)లో ఒక రైతు కుటుంబంలో పుట్టి పొలం పనులు చేసుకుంటూ గడిపి, 'బతకల్ల అంటే ఎదకల్లేమో' అన్నట్లుగా వాళ్ల వూరు విడిచి నీటిజాడ ఎదుర్కొని ఎగువసీమ (కల్యాకనపల్లి)కి వలస పోయి, 15 సం॥ వచ్చేదాకా అక్కడే వుండి కన్నడం చదివి తిరిగి సొంతూరు పక్కకే తిరిగి వచ్చిన బాల్యం ; కపిల (మోట) సేద్యం నాటి మనుషులు కరెంటు వచ్చేనాటికే ఏ విధంగా మారిపోయిందీ; వూర్లో రెడ్డి కర ణాలు చేసే అన్యాయాల గురించీ; తన చదువు, వ్యవసాయం, ఉపాధ్యా వృత్తి, వయోజన విద్యను నేర్పడం, కవిత్వం, కథలు రాయటం, పత్రికలకు పంపటం, ఆకాశవాణిలో ఏ ప్రసారం కావడం ; ఉపా ధ్యాయుల్లో ఆదర్శవంతులు, బద్ధకస్తులు, కొడుకు చదువు, అతనికి జరిగిన రోడ్డు ప్రమాదం, అతని పెళ్లి, ఇల్లు కట్టటం (వెలుగు– చిగురు), స్నేహితులు చేసిన మోసాలు–వీటన్నిటి నుండీ తాను పొందిన అనుభవం, ఆనందం, దుఃఖం, మనోవేదన ఈ బతుకు వెతుకులాటలో కనిపిస్తాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే – సడ్లపల్లి చిదం బరరెడ్డి ఆరోగ్య సమస్య ఇందులో ప్రధానంగా కనిపిస్తుంది. చిన్నప్పటి నించీ అలర్జీ వలన–వాతావరణంలో మార్పు వలనగానీ, తిన్న ఆహా రంలో తేడావల్లనో గాని–చాలసార్లు మృత్యువు అంచుల దాకా వెళ్లి. అందరూ ఆశలు వదిలేసిన సందర్భాలు, చేయించుకున్న వైద్యాలు, తిన్న మందులు, విసుగెత్తి భగవంతుణ్ని తనను రోగాల మారిగా పుట్టించినందుకు తిట్టుకుంటూ, 30 సం॥ల మించి బ్రతకటం కష్టం అన్న మనిషి ఇప్పటికీ (66 సం॥ వరకు) జీవించ గలగడం దానికి కారణంగా– ఆ రోగం మీద, తినే ఆహారం మీద, వాతావరణం మీద శాస్త్రీయ అవగాహన పెంచుకొని కాలానుగుణమైన ఆధునిక మందులు వాడుతూ, అన్నిటినీ మించి ఆత్మ స్థైర్యంతో యిప్పటికీ బతకగలగటం చిదంబరరెడ్డిలోని ఒక పోరాట పటిమకు నిదర్శనం. అందరికీ ఆదర్శవంతం కూడా. 'అనారోగ్యాన్ని అరికాలికిందేసి మట్టిబతుకు పోరులో గెలుపు సాధించిన ఒకానొక సామాన్యుడి అనుభవాల సంపుటి' అనీ, తన కథలో ఏదీ దాచుకున్నట్లుగాని, అతిశయోక్తులు చెప్పినట్లు గాని ఎక్కడా అనిపించక తన అనుభవాల్ని నిజాయితీగా రాసుకుని, తద్వారా అరవయ్యేళ్ల కాలంలో వచ్చిన మార్పుల్ని కళ్లకు కట్టించారు' అంటారు గంటేడ గౌరునాయుడు 'వెతుకులాటలో ఎదురైన, అరుదైన మిత్రుడు' చిదంబర రెడ్డి గురించి.

చిదంబరరెడ్డి శారీరకంగా (ఆరోగ్యపరంగా) మానసికంగా పడిన కష్టాలు, బాధలు, వాటిని ఆయన ఎదుర్కొన్న తీరు సంపూర్ణంగా మనకు ఈ కథలలో ప్రతిబింబిస్తుంది. అంతే కాకుండా విభిన్నము విశిష్టమూ అయిన ఆయన వ్యక్తిత్వాన్ని కూడా తెలియజేస్తుంది. ఆయన నిరంతర శ్రమజీవి. గొప్ప ధైర్యవంతుడు. తెలుగు సాహిత్యం మీద మమకారం; తపన, భావుకత, ఆర్ద్రత కలిగి స్పందించే హృదయం ఉన్నవాడు. సంస్కారం కలిగి తన ఉపాధ్యాయ వృత్తిలో చిత్తశుద్ధి, నిజాయితీగా విధులు నిర్వర్తించినవాడు. సంఘంలో జరుగు తున్న అన్యాయాలు, మనుషుల మధ్య ఏర్పడుతున్న అగాధాలు, 'జనాలు నీతి న్యాయాలు లేకుండా తయారవుతుండారంటే యీళ్ల నడుమ బతకలేను అనిపిచ్చె' అని దిగులు పడే మనస్తత్వం. అర్థంలేని మూఢాచారాలను వాస్తు విషయాలను, ముహూర్తాలను, శకునాలను నిరసించడమేకాకుండా వీటన్నిటినీ తాను పాటించకపోవడం వలన చాలమంది తిరస్కారానికి కూడా గురయినవాడు. విద్యాబోధనలలో సంస్కరణలు రావాలని, ప్రాథమిక పాఠశాలల్లో మహిళా ఉపాధ్యా యుల్నే నియమించాలని, అదికూడా అంతో యింతో లలిత కళలలో ప్రవేశమున్నవారయితే పిల్లలకు బాగా విద్య నేర్పవచ్చుననీ భావిస్తాడు. 'ఇతర్లను మోసగించకపోవటం, ఆరు నూరైనా యిచ్చిన మాట మీద నిలబడ్డం'–ఈ రెండూ తన బలాలు అని చెప్పుకున్న ఆదర్శవ్యక్తి చిదంబరరెడ్డి.

తన జీవితంలో చూసిన, ఎదుర్కొన్న సంఘటనలు తనకీ ప్రత్యేకం అని భావిస్తాడు రచయిత. అయితే తన గతాల కష్టాల్నీ కడగండ్లనీ మనకు చూపి సానుభూతిని ఆశించాలనీ కాదు అంటాడు. మరి తన బతుకు వెతలను కతలుగా చెప్పదలచినందుకుగల ఆశ యాల్ని 'గతాల గురుతులు' అన్న అధ్యాయంలో చాలా స్పష్టంగా చెప్పారు. "పట్నానికి ఆనుకునే, బెంగుళూరు హైవేలో ఉన్న గ్రామంలో నివసిస్తూ, సామాజికంగా ఉన్నత వర్గానికి చెందిన కుటుంబంలో పుట్టి సొంతంగా వ్యవసాయం చేసి, బతక కలిగిన స్తోమత కలిగిన నా జీవితమే యింత భయంకరంగా ఉంటే!

అక్షరాలే చొరబడలేని, మారుమూల పల్లెల్లో సాటి జీవుల్లాగా దాహానికి బావినుండి నీటిని కూడా చేదుకోలేని, ఇతర మనుష్యులను తాకడానికి కూడా నోచుకోలేని, తమ హృదయవేదనలు వినిపించడా నికి నోరులేని, వినిపించినా వినే చెవుల్లేని, ఎన్ని విలువైన మానవ



ఉత్పల సత్యనారాయణాచార్య నగర కావ్యాలు :
ఈ జంట నగరాలు హేమంత శిశిరాలు
పుటలు: 208, వెల :75/-
ప్రతులకు : తెలంగాణ సాహిత్య అకాడమి
కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం
హైదరాబాద్ - 500 004
సెల్: 040-29703142

కాలమిచ్చిన తీర్పు, పెళ్ళి పందిరి : రెండు నవలలు
రచన : తురగా జయశ్యామల
పుటలు: 186, వెల: రు.150/-
ప్రతులకు: తురగా జయశ్యామల
ఫ్లాట్ నెం. 706, ఆరాధన 'బి' వింగ్, జి.డి. అంబేద్కర్ రోడ్
దాదార్, ముంబయి - 400 014
సెల్ : 09820 03133





శాస్త్రీయ దృక్పథం-మానవ మనుగడ శాస్త్రీయ వ్యాస సంకలనం, రచన, సంకలనం: పసల భీమన్న
పుటలు :152, వెల: రు.90/
ప్రతులకు: జనవిజ్ఞానవేదిక మరియు ప్రజా సైన్సు వేదిక
శ్రీ జి.మాల్యాద్రి, కన్వీనర్ : విజ్ఞాన ప్రచురణలు
162, విజయలక్ష్మీ నగర్, నెల్లూరు - 524 001
సెల్ : 94405 03061


వ్యాస నీరాజనం - సాహిత్య వ్యాసాలు
రచన: డా॥ తుర్లపాటి రాజేశ్వరి
పుటలు: 166, వెల: 200/-
ప్రతులకు :ఎన్.ఎస్.మూర్తి, సత్యశ్రీ పబ్లికేషన్స్
ఫ్లాట్ నెం. 405, 3వ అంతస్థు, రాజారాణి సరోవర్ అపార్ట్‌మెంట్స్, శాస్త్రినగర్ ఎదుట, 3వ లైను
బెర్హంపూర్ - 760 002, సెల్ : 90787 43851





నీళ్ళింకని నేల రాయలసీమ కథల సంకలనం
సంపాదకులు: ఎస్.ఎం.డి. ఇనాయతుల్లా
కెంగార మోహన్
పుటలు:144, వెల: రు.150/-
ప్రతులకు: ఎస్.ఎం.డి. ఇనాయతుల్లా, ఇం.నెం. 80-129 సి6బి, అబ్బాస్ నగర్, కర్నూలు -2
సెల్ : 9849367922

షట్‌స్థల చక్రవర్తి చిన్నబసవేశ్వరుని వచనములు
అనువాదకులు : లింగైక్యులు రేకళిగె మఠం వీరయ్య
పుటలు:110 వెల: రు.45/-
ప్రతులకు : తెలంగాణ సాహిత్య అకాడమి
కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం
హైదరాబాద్ - 500 004
సెల్: 040-29703142





మహాబాటసారి కవితా సంపుటి
రచన : కె.శాంతారావు
పుటలు: 110, వెల: రు.40/-
ప్రతులకు :కె. శాంతారావు
103, ఆదిత్య ఆర్కేడ్, బి.బ్లాక్, అజామాబాద్
హైదరాబాదు - 500 020
సెల్ : 9959745723


చింకిచాట
రచన : పొట్లూరి సుబ్రహ్మణ్యం
పుటలు:200, వెల: రు.100/-
ప్రతులకు: పొట్లూరి సుబ్రహ్మణ్యం
రెవెన్యూ కాలని -2, చంద్రబాబు నగర్ రోడ్
నెల్లూరు - 524 004
ఫోన్ : 94911 28052





తపతీ సంవరణము
పరిష్కర్త : డా॥ పాటిబండ మాధవశర్మ
పుటలు : 184, వెల : 80/-
ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి
కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం
హైదరాబాద్ - 500 004
సెల్: 040-29703142

గజల్ గీతికలు
రచన : పటేలు అనంతయ్య
పుటలు: 68, వెల: రు.30/-
ప్రతులకు : తెలంగాణ సాహిత్య అకాడమి
కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం
హైదరాబాద్ - 500 004
సెల్: 040-29703142



ఖనిజాలు కాలగర్భంలో సమాధి అయ్యాయో కదా అనిపిస్తుంది.

ఇటువంటి గత చేదు నిజాల్ని జ్ఞప్తికి తెచ్చుకుని, కాస్తా ఒళ్లు దగ్గం పెట్టుకుని మనుష్యుల్ని మనుష్యులుగా గుర్తించమని, ఈ ప్రపంచంలో మనమే కాదు ఇంకా బతకాల్సినవారు, తమను తాము వ్యక్తం చేసుకోవలసినవారు చాలమంది ఉన్నారని ఎరుక చేయటానికీ!"

ఇంత గొప్ప, ఉన్నత జీవిత సత్యం, సందేశం ఆదర్శం చిదంబరరెడ్డి 'వాగేయదారు బతుకు' వెతల కతల పుస్తకం 'బతుకు వెతుకులాట' లో మనం చూస్తాం. ఇలాంటి ఆత్మకథలు అన్ని ప్రాంతాల వారు చదవాలి. మాండలిక (స్థానిక) పద జాలాలని తెలుసుకోవాలి అడ్డుగోడలు కూల కొట్టాలి. ఈ ఇందూపురం తావు కతలు ముందు మనం చదవడం ఒకసారి మొదలు పెడితే, పోనుపోను అవే మనల్ని చదివింప చేస్తాయి. అందరి బతుకులూ పూలబాటలో సాగవు. నిరాశ చెందకుండా అన్ని అవరోధాల్ని అధిగమిస్తూ, జీవనయానం సాగించి, బతుకులను సార్థకం చేసుకోవాలని ప్రేరణను, స్ఫూర్తిని కలిగించే ఆత్మకథ. చిదంబరరెడ్డి 'బతుకు వెతుకులాట'

ఎమ్.వి.శాస్త్రి
9441 342999

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్లక్ష్యం వలన ప్రమాదంలో తెలుగుమాధ్యమ విద్యార్థుల భవిష్యత్తు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గత రెండు నెలల్లో పంచాయితీ కార్యదర్శి, గ్రూప్ 2, గ్రూప్ 1 సర్వీస్‌లకు గానూ ప్రవేశ పరీక్షలను నిర్వహించింది. ఈ పరీక్షలలో ముందుగానే ఆంగ్ల మాధ్యమంలో ప్రశ్నాపత్రాన్ని రూపొందించి తెలుగు అనువాదం మాత్రమే చేర్చుతామని తెలిపిన కమిషన్, ఎలాంటి నాణ్యత లేని ప్రశ్నాపత్రాన్ని తెలుగు మాధ్యమ విద్యార్థులకు అందించింది. మచ్చుకు కొన్ని:

ఏప్రిల్ 21 న జరిగిన పంచాయతీ కార్యదర్శి పేపర్ లో కాంగ్రెస్ ను కాంగ్రస్ అని, మౌలిక ను మౌతిక అని, జాతీయగీతం, జాతీయ జెండాలను దేశీయ గీతం, దేశీయ జెండా అనటం. బీమా పదాన్ని ఒక చోట భిమ అని ముద్రించడం. ఇవి ముద్రణలో దోషాలనుకుందాం. Valid, act, invalid, లాంటి ఆంగ్ల పదాలకు తర్జుమా చేయకుండా వాలిడ్, ఇన్‌వాలీడు. ఆక్ట్ ఇలా వదిలేసారు. ఇదే పోకడను గ్రూప్ 1, గ్రూప్ 2, పరీక్షాపత్రాల్లోనూ అనుసరించారు.

ఆంగ్లంలో ప్రశ్న:(A సెట్‌లో 10వ ప్రశ్న) – Garo hills are part of which state?, దీనికి తెలుగు అనువాదం – “గారొ కొండల సమీపంలో భారతదేశంలోని ఏ రాష్ట్రముంది”. సమీపంలో/ లో కి చాలా అంతరం ఉంది.

ఆంగ్లంలో ప్రశ్న : (A సెట్ లో 20వ ప్రశ్న) – Which countrys airline introduced the world first single use plastic free passenger flight?, అనగా ఏ దేశపు విమానయాన సంస్థ మొదటిసారిగా ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్ ను నిషేధించింది, అనగా తిరిగి వాడే ప్లాస్టిక్ ను మాత్రమే ఆ విమానాల్లో వాడతారు అని అర్థం.

దీనికి తెలుగులో ప్రశ్న : “ఏ దేశ విమానయానంలో ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్ ను కూడా తొలగించి ప్లాస్టిక్ లేని ప్రయాణీకుల విమానంగా చేసింది?” అని ఉంది. ఆంగ్ల ప్రశ్నకు పూర్తి విరుద్ధంగా ఉంది తెలుగు అనువాదం.

కొన్ని ప్రశ్నల్లో పదాలు ఎగిరిపోయాయి, ఉదాహరణకు సెట్ A, 58, session.

if wall is called window, wiondow is called door, door is called floor, floor is called roof and roof is called ventilator, what will a person stand on?

ఈ ప్రశ్న అర్థమేంటంటే, ఒక సంకేతభాషలో గోడని కిటికి అని, కిటికీని తలుపు, తలుపుని నేల, నేలని కప్పు, కప్పుని వెంటిలేటర్ అంటే, ఆ సందర్భాంలో మనిషి దేనిపై నిలబడతాడు, అని. అయితే కమిషన్ వారి అనువాదం – “గోడ కిటికి అని పిలవబడితే, కిటికీ తలుపు అని పిలవబడితే, తలుపు నేల అని పిలవబడితే, నేల కప్పు అని పిలవబడితే, కప్పు వెంటిలేటర్ అని పిలవబడితే, మనిషి ఏమని పిలవబడతాడు?”

అసలే ఒక రకమైన ఒత్తిడి కింద విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతారు, ఇలాంటి తప్పులున్న ప్రశ్నలు వారి ఆత్మస్థైర్యాన్ని పూర్తిగా నాశనం చేసేస్తాయి.

ఇక మే 5 న జరిగిన గ్రూప్ 2 పరీక్షలో భారతాదేశాన్ని భరతదేశమని, భావనను బావనఅని, ఇలా అచ్చుతప్పులు, economy అనగా దేశాల సందర్భంలో ఆర్థిక శక్తి అని అనువదించుకోవాలి, సెట్ A లో 4వ ప్రశ్నలో భారత్ ఆర్థికంగా నిలిచింది అని ఇచ్చారు.

7వ ప్రశ్న ఆప్షన్‌లలో moderate ను ఆదునిక అని అనువదించారు, దీని వలన పూర్తి అర్థమే మారిపోతుంది.

Tsangpo ను సాంగ్ అని అనువదించారు. 17వ ప్రశ్నలో అమ్మిన టికెట్లు బదులు టికెట్లు అమ్మిన అని పదాలు తారుమారు అయి అర్థం మారిపోయింది.


భారతదేశ రాజకీయాల్లో ఒక చట్టాన్ని తేవడానికి, అమలు పరాచడానికి మధ్య తేడా ఉంది. చట్టాన్ని తేవడమంటే ఇరు సభలలో ప్రవేశ పెట్టడం, అమలు పరచడం అనేది ఆ చట్టంలో పేర్కొంటారు. సెట్ A లో 130వ ప్రశ్న ఆంగ్లంలో enact అనుంటే తెలుగులో చట్టాన్ని తీసుకొచ్చారు అని ఉంది.

ఇక మే 26 న జరిగినా గ్రూప్ 1 ప్రశ్నాపత్రానికి పూర్తి స్థాయి యాంత్రిక అనువాదాన్ని ఆశ్రయించినట్టు అనిపిస్తోంది.

సెట్ A, 49వ ప్రశ్నలో ఒక ఆప్షన్, ''Reduce the amount of sentence without changing its character' అని ఉంది, ఇది శిక్షాస్మృతికి సంబంధించిన ప్రశ్న, ఇక్కడ సెంటెన్స్ అనగా శిక్ష అని. అయితే తెలుగు అనువాదం –”వాక్యాల గుణాలని మార్చకుండా వాక్యాన్ని కుదిస్తుంది.”

ఇంకా ఎన్నో తప్పులున్నాయి. ఒక బాధ్యతగల రాజ్యాంగబద్ధ సంస్థ ఈ విధంగా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడేలా ప్రశ్నాపత్రాలివ్వడం, ఆ విషయాన్ని ఎవరూ నిరసించకపోవడం మన దౌర్భాగ్యం.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362



బోనాలు
మహంకాళీ జాతర

తెలంగాణ సాహిత్య కళావేదిక ప్రచురణ

వెల : రు. 3000/-

బి.నరసింగరావు ముఖ్య సంపాదకుడుగా మామిడి హరికృష్ణ, ప్రొ.పురుషోత్తం, ననుమాసస్వామి, రాధికా రాజమణి, ఎన్.రాజేందర్ తదితరుల సమిష్టి సృజన. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే 'బోనాలు' పండుగను అధికారికంగా గుర్తించి ప్రోత్సహించింది ప్రభుత్వం.

నేపథ్యాన్నీ, వర్తమానాన్నీ అందంగా రంగురంగుల బొమ్మలతో, రచనలతో చిత్రించిన గొప్ప ప్రచురణ ఇది. అంతర్జాతీయ స్థాయిలో అందరికీ తెలిసేందుకై తెచ్చిన ఆంగ్ల ప్రచురణ. దీనిని ఇదే స్థాయిలో తెలుగులో కూడా ప్రచురించాలి.

తెలుగువారికి - ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి ఖ్యాతి తేగల గొప్ప ప్రచురణ ఇది.

అన్ని సంస్థల గ్రంథాలయాల్లో, బోధనా సంస్థల్లో ప్రతిష్ఠాత్మకంగా అందుబాటులో ఉంచదగిన ప్రచురణ.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
June 2019 Vol :5, Issue 4
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244